ఆదివారం మ్యాగజైన్

ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త


మిస్ తెలుగు యుఎస్‌ఎ 2026 అమూల్య 7లో

epaper.vaartha.com WWW.VAARTHA.COM
ఖమ్మం : fb.com/vaartha Digital
Published from Khammam, Hyderabad, Vijayawada, Visakhapatnam, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupati, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam
11-4-2026 శనివారం సంపుటి: 32 సంచిక: 70 పేజీలు: 8+16 వెల: 6.50

# డీలిమిటేషన్‌పై పోరాటం

## నియోజకవర్గాల పునర్విభజన వల్ల దక్షిణాదికి తీరని నష్టం

### మహిళా రిజర్వేషన్‌కు డీలిమిటేషన్‌తో ఎందుకు లింక్?

### ప్రస్తుత సీట్లతోనే రిజర్వేషన్లు ఇవ్వొచ్చు

### ప్రాంతాల మధ్య అసమానతలకే కేంద్రం చర్యలు


శుక్రవారం న్యూఢిల్లీలో జరిగిన సిడబ్ల్యుసి సమావేశంలో ఖర్గే, రాహుల్, వేణుగోపాల్, సిఎం రేవంత్, జైరాం రమేష్, రఘువీరా ప్రభృతులు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్,ఏప్రిల్10:** ఢిల్లీలోని ఇందిరా భవన్‌లో జరిగిన సీడబ్ల్యూసీ హాజరైన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నియోజకవర్గాల పునర్విభజన అంశంపై పలు కీలక వ్యాఖ్యలు చేశారు. రాబోయే రోజుల్లో జరగబోయే నియోజకవర్గాల పునర్వ్యవస్థీకరణ వల్ల దక్షిణాది రాష్ట్రాలకు, ముఖ్యంగా చిన్న రాష్ట్రాలకు తీరని అన్యాయం జరుగుతుందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. కేవలం జనాభా ప్రాతిపదికన సీట్లను పెంచితే, అది దేశ సమగ్రతకు, సమాఖ్య స్ఫూర్తికి విఘాతం కలిగిస్తుందని ఆయన హెచ్చరించారు. శుక్రవారం సాయంత్రం మీడియాతో చిట్ చాట్ చేస్తూ డీలిమిటేషన్ వల్ల పెద్ద రాష్ట్రాలు మరింత పెద్దవిగా మారుతాయి, చిన్న రాష్ట్రాలు అలాగే ఉండిపోతాయి. కేరళలో ప్రస్తుతం ఉన్న 20 సీట్లు 30కి పెరిగితే అదే సమ యంలో ఉత్తరప్రదేశ్‌లో ఉన్న 80 సీట్లు 120కి పెరుగుతాయి. దీని వల్ల కేంద్రంలో దక్షిణాది రాష్ట్రాల గొంతుక పూర్తిగా నలిగిపోతుంది. దక్షిణాది రాష్ట్రాల ప్రమేయం లేకుండానే >>2

## రాజకీయ లబ్ధికే ప్రత్యేక పార్లమెంటు: ఖర్గే

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్,ఏప్రిల్10:** ఢిల్లీలోని కాంగ్రెస్ ప్రధాన కార్యాలయం ఇందిరా భవన్‌లో శుక్రవారం జరిగిన కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ (సిడబ్ల్యూసీ) సమావేశానికి తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డిహాజరయ్యారు. ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే అధ్యక్షతన జరిగిన ఈ సిడబ్ల్యుసి సమావేశానికి రాహుల్ గాంధీ, కేసీ వేణుగోపాల్, ప్రియాంక గాంధీ, జైరాం రమేష్, సల్మాన్ ఖుర్షిద్, అంబికా సోనీ, సచిన్ పైలట్, భూపేష్ బఘేల్ తదితర కీలక నేతలు హాజరయ్యారు. వీరందరితో కలిసి సీఎం రేవంత్‌రెడ్డి పాల్గొన్నారు. అలాగే కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల ముఖ్యమంన >>2

## మత్తులో పట్టుబడితే వాహనం సీజ్ వద్దు

### హైకోర్టు ఆదేశం

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్, ఏప్రిల్10:** రాష్ట్ర హైకోర్టు వాహనదారులకు ఊరటనిచ్చేలా డ్రంక్ అండ్ డ్రైవ్ కేసుల విషయంలో కీలక ఆదేశాలు జారీ చేసింది. తనిఖీల్లో ఎవరైనా మద్యం తాగి వాహనం నడుపుతూ పట్టుబడితే, పోలీసులు వారి వాహనాన్ని సీజ్ చేయకూడదని ధర్మాసనం స్పష్టం చేసింది. డ్రంక్ అండ్ డ్రైవ్‌లో దొరికినంత మాత్రాన మోటారు వాహనాల చట్టం కింద వాహనాన్ని స్వాధీనం చేసుకునే అధికారం పోలీసులకు లేదని కోర్టు తేల్చి చెప్పింది. డంక్ అండ్ డ్రైవ్ టెస్ట్‌లపై దాఖలయిన పిటిషన్‌ను శుక్రవారం జస్టిస్ ఈవి వేణుగోపాల్‌రావు ధర్మాసనం విచారించింది. విచారణ సందర్భంగా కీలక ఆదేశాలు జారీ చేసింది. వాహనం నడుపుతున్న వ్యక్తి మద్యం తాగి ఉన్నట్లు నిర్ధారణ >>2



## ఆర్టీసీ ఉద్యోగులకు 2.1% డిఏ పెంపు

### మంత్రి పొన్నం ప్రభాకర్

**హైదరాబాద్, ప్రభాతవార్త, ఏప్రిల్ 10:** తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థలోని కార్మికులకు డీఏను పెంచుతూ యాజమాన్యం నిర్ణయం తీసుకుంది. ఆర్టీసీ ఉద్యోగులకు 2.1 శాతం డీఏ పెంచుతున్నట్టు రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రకటించారు. ప్రస్తుతం ఉన్న 50.7శాతం ఉన్న డీఏను 52.8 శాతానికి పెంచినట్టు తెలిపారు. డీఏ పెంపుతో సంస్థపై నెలకు రూ. 2.82 కోట్ల అదనపు భారం పడుతుందని మంత్రి పొన్నం ప్రభాకర్, ఆర్టీసీ ఎండీ వై నాగిరెడ్డి తెలి పారు. ఈ ఏడాదిలో సంస్థ ఉద్యోగులకు జన వరిలో ఇవ్వాల్సిన డీఏను అంద జేస్తున్నట్లు రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ >>2

రాష్ట్ర జనాభాలో 86 శాతం మంది తెల్లరేషన్ కార్డుదారులే 3లో

ఇజ్రాయెల్‌పై హెజ్బుల్లా భీకర దాడులు 5లో

## అన్నా! దేవుడే పంపిండు

### మీతో కలిసి పనిచేస్తా

### కెసిఆర్‌ను కలిసిన సందర్భంగా జీవన్‌రెడ్డి భావోద్వేగం

### 20న బిఆర్ఎస్‌లో చేరిక, జగిత్యాలలో భారీ బహిరంగ సభ


శుక్రవారం ఎర్రవెల్లిలోని ఫామ్‌హౌస్‌లో కెసిఆర్‌తో జీవన్ రెడ్డి ఆత్మీయ ఆలింగనం దృశ్యం

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్,ఏప్రిల్10:** మాజీ సిఎం, బీఆర్ఎస్ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖరరావును కాంగ్రెస్ సీనియర్ నేత, మాజీ మంత్రి టి.జీవన్ రెడ్డి శుక్రవారం మర్యాద పూర్వకంగా భేటీ అయ్యారు. ఈ సందర్భంగా జీవన్‌రెడ్డి కేసీఆర్‌ను పలకరిస్తూ భావోద్వేగానికి లోనయ్యారు. 'అన్నా.. నన్ను దేవుడే పంపిండు. మీతో కలిసి పని చేయమని' అంటూ కేసీఆర్‌ను ఆప్యాయంగా ఆలింగనం చేసుకున్నారు. ఇటీవల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వైఖరిని నిరసిస్తూ కాంగ్రెస్‌కు రాజీనామా చేసిన జీవన్ రెడ్డి, కుమారులు, జగిత్యాల జడ్పీ మాజీ చైర్‌పర్సన్ వసంత సురేశ్ దంపతులు కేసీఆర్‌ను కలిసినవారిలో ఉన్నారు. ఈ సందర్భంగా ఎర్రవెల్లిలోని కేసీఆర్ (ఫామ్‌హౌస్) నివాసానికి తొలిసారి వచ్చిన జీవన్ రెడ్డిని పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రులు కొప్పుల ఈశ్వర్, గంగుల కమలాకర్, ప్రశాంత్ రెడ్డి, ఎమ్మెల్సీ ఎల్. రమణ, ఎమ్మెల్యే డా.కె.సంజయ్, మాజీ ఎంపీ జోగినపల్లి సంతోష్ కుమార్, మాజీ ఎమ్మెల్యే కె. విద్యాసాగర్ రావు, పార్టీ నేతలు గ్యాదరి బాలమల్లు, మారెడ్డి శ్రీనివాస్ రెడ్డి, రాగిడి లక్ష్మారెడ్డి తదితరులు ఆయనకు పుష్పగుచ్ఛాలు అందజేసి స్వాగతం పలికారు. తెలంగాణకు నష్టం జరు గుతున్న సమయంలో మీతో >>2

## ఇక మావోయిస్టుల్లేరు!

### మరో 42 మంది డిజిపి సమక్షంలో లొంగుబాటు

### 36 ఆయుధాలు, 800 గ్రా.ల బంగారం స్వాధీనం

### పార్టీలో మిగిలింది ఇక ఐదుగురే..

### గణపతి కూడా లొంగిపోవాలని డిజిపి శివధర్‌రెడ్డి వినతి


శుక్రవారం మావోయిస్టుల నుంచి స్వాధీనం చేసుకొన్న తుపాకులతో డిజిపి శివధర్ రెడ్డి


శుక్రవారం హైదరాబాద్‌లో డిజిపి సమక్షంలో లొంగిపోయిన మావోయిస్టులు

**హైదరాబాద్, ఏప్రిల్ 10, ప్రభాతవార్త:** మావోయిస్టులు మరోసారి భారీగా తెలంగాణ పోలీసుల ఎదుట లొంగిపోయారు. గడచిన ఏడాదిన్నరగా తెలంగాణతో పాటు ఛత్తీస్‌ఘడ్‌కు చెందిన మావోయిస్టులు ఆయుధాలతో పాటు తెలంగాణ పోలీసుల ఎదుట లొంగిపోతున్న క్రమంలో శుక్రవారం నా డు 42 మంది 36 ఆయుధాలు, వెయ్యికిపైగా తూటాలు, తమ డంప్‌లో వున్న 800 గ్రాముల బంగారంతో డిజిపి శివధర్ రెడ్డి ఎదుట లొంగిపోయి జన జీవన స్రవంతిలో కలిశారు. నక్సలైట్ల లొంగుబాటు సందర్భంగా డిజిపి మాట్లాడుతూ తెలంగాణ మావోయిస్టు రహిత రాష్ట్రంగా మారిందని తాజా లొంగుబాటు తరువాత మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీలో మిగిలిన వారు పార్టీ అగ్రనేత ముప్పాళ్ల లక్ష్మణ్ రావు అలియాస్ గణపతి, ఆయన సతీమణి సహా ఐదుగురే మిగిలారని, వీరు కూడా వెంటనే జనజీవన స్రవంతిలో కలవాలని కోరారు. లొంగిపోయిన వారిలో 11మంది తెలంగాణ కేడర్‌కు చెందిన వారు కాగా మిగిలిన వారు ఛత్తీస్‌ఘడ్‌కు చెందిన వారని డిజిపి తెలిపారు. తెలంగాణకు కేడర్‌లో వున్న 11 మందిలో తెలంగాణ కు చెందిన వ్యక్తి ఒక్కరేనని ఆయన అన్నారు. గణపతి అడవుల్లో లేరని, ఆయన బతికేవున్నట్లు తమకు సమాచారం వుందని, ఎక్కడ వున్నాడనే దానిపై స్పష్టత లేదని ఆయన వెల్లడించారు.

మావోయిస్టుల లొంగుబాట్లు కొనసాగుతూనే వున్నాయి. గత మార్చి నెల >>2

## దాడులు ఆపితేనే చర్చలు!

### స్తంభింపచేసిన ఆస్తులు విడుదల చేయాలి

### చర్చలకు ఇరాన్ తాజా షరతులు

### అమెరికాతో ఆటలాడుకోవద్దు: జెడి వాన్స్ హెచ్చరిక



**ఇస్లామాబాద్; ఏప్రిల్ 10:** ఇరాన్ యుద్ధం ముగింపు కోసం అమెరికా, ఇరాన్‌లమధ్య జరిగే చర్చల్లో ప్రతిష్టంభన కనిపిస్తోంది. లెబనాన్‌పై దాడులపట్ల తీవ్ర నిరసన వ్యక్తంచేసిన ఇరాన్ లెబానన్‌ను కూడా తమ చర్చల అజెండాలోచేర్చాలని పట్టుదలగా ఉంది. ఇదిలా ఉంటే డీల్ జరిగితే ఒకే లేదంటే ఇక గతంకంటే తీవ్రస్థాయిలో సైనిక చర్యలుంటాయని ట్రంప్ మరోసారి ట్రూత్ సోషల్ మీడియాలో హెచ్చరికలు చేయడంమళ్లీ ఉద్రిక్తతలను రాజేసింది. ఇందుకోసం ఇప్పటికే భారీ ఆయుధాలతో ఉన్న నౌకలు మళ్లీ పశ్చిమాసియా జలాల్లోకి వెళుతున్నాయి. న్యూయార్క్‌పోస్టుతో జరిగిన ఇంటర్వ్యూలోట్రంప్ మాట్లాడుతూ మేం మా నౌకలను అత్యున్నత అధునాతన ఆయుఘసామగ్రితో నింపుతున్నాయి. గతంలో ఎన్నడూలేని ఆయుధాలు ఈ సారి దాడులకు వినియోగిస్తాం. ఈదెబ్బకు మొత్తం మంటల్లో తగులబడిపోవడం ఖాయం అని అన్నారు. డీల్ అనేది లేకపోతే ఈ ఆయుధాలన్నీ ప్రయోగి స్తామని ఆయనఅన్నారు. ఇదిలా ఉంటే అమెరికా ఉపాధ్యక్షుడు జెడివాన్స్ ఇస్లామాబాద్‌కు బయలుదేరుతున్నట్లు ప్రకటించారు. చర్చల్లో తాత్సారం చేయవద్దని అమెరికాతో ఆటలాడుకోవద్దంటూ ఇరాన్‌కు అల్టిమేటమ్ ఇచ్చారు. ఇరాన్‌తో చర్చలు సానుకూలంగా జరుగుతాయనే భావిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఇదిలా ఉంటే ఇరాన్ పార్లమెంటు స్పీకర్ మహ్మద్ బాఘేర్ గాలిబాఫ్ సోషల్‌మీడియాలో పోస్టుపెడుతూ రెండు పాయింట్లు తెరపైకి తెచ్చారు. లెబనాన్‌లో కాల్పుల విరమణ, స్తంభింపచేసిన ఇరాన్ >>2

## పవన్ ఖేరాకు ఊరట మధ్యంతర బెయిల్ మంజూరు

### వారం రోజుల పాటు ఎలాంటి చర్యలు తీసుకోవద్దని అసోం పోలీసులకు ఆదేశాలు



**హైదరాబాద్, ఏప్రిల్ 10, ప్రభాతవార్త:** అస్సాం సిఎం హిమంత బిశ్వ శర్మ సతీమణి రిణికి భూయాన్‌పై తీవ్రమైన ఆరోపణలు చేసిన కాంగ్రెస్ అధి కార ప్రతినిధి పవన్ ఖేరాకు తెలంగాణ హై కోర్టులో ఊరట లభించింది. ఆయనపై అస్సాం పోలీసులు నమోదు చేసిన కేసులో మధ్యంతర బెయిల్ మంజూరు చేస్తూ తెలంగాణ హైకోర్టు శుక్రవారం ఆదేశాలు జారీ చేసింది. ఇదే కేసులో వారం రోజుల పాటు ఖేరాపై ఎలాంటి చర్యలు తీసుకోరాదని హైకోర్టు ధర్మాసనం పేర్కొంది. అస్సాం సిఎం హిమంత బిశ్వ శర్మ సతీమణి రిణికి భూయాన్‌కు మూడు పాస్‌పోర్టులు వున్నాయని, ఆమె విదేశాల్లో కోట్లాది రూపాయల అక్రమా స్తులు సంపాదించారని ఖేరా చేసిన ఆరోపణలు అస్సాంతో పాటు ఢిల్లీలో సంచలనం రేపడం తెలిసిందే. దీనిపై తీవ్రంగా స్పందించిన అస్సాం స ర్కారు ఖేరాపై కేసు నమోదు చేసి అరెస్టు చేసేందుకు ప్రయత్నించగా ఆయన అజ్ఞాతంలో వెళ్లడం విదితమే. వారం రోజులుగా ఖేరా కోసం అటు ఢిల్లీ ఇటు హైదరాబాద్‌లో అస్సాం పోలీసులు గాలిస్తుండగా ఆయన ఆచూకీ తెలియరాలేదు. ఇదే సమయంలో తెలంగాణ హైకోర్టులో ఖేరా తరపున దాఖలైన మధ్యంతర బెయిల్ పిటిషన్‌పై శుక్రవారం విచారణ జస్టిస్ సుజన నేతృత్వంలోని ధర్మాసనం ఇరుపక్షాల వాదనలు విన్నది. మొదట ఖేరా తరపున వాదనలు వినిపించిన సీనియర్ న్యాయవాదులు అభిషేక్ >>2

## రేపే ఇంటర్ ఫలితాలు!

### స్పష్టత ఇచ్చిన ఇంటర్ బోర్డు

**హైదరాబాద్, ప్రభాతవార్త, ఏప్రిల్ 10:** తెలంగాణ రాష్ట్రంలో ఫిబ్రవరి 25 నుంచి మార్చి 18 వరకు జరిగిన ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షల ఫలితాలను ఈ నెల 12న విడుదల చేయడానికి ఇంటర్ బోర్డు నిర్ణయించింది. ఇప్పటి వరకు ఫలితాల విడుదలపై ఉన్న సస్పెన్స్‌కు తెరదించుతూ ఈ నెల 12న ఇంటర్ ఫలితాలను విడుదల చేయనున్నట్టు ఇంటర్ బోర్డు ప్రకటించింది. అయితే ఫలితాలను ఇంటర్ బోర్డు కార్యాలయంలో విడుదల చేస్తారా? లేకపోతే ముఖ్యమంత్రి ఇంటిదగ్గర విడుదల చేస్తారా? అనేదానిపై సస్పెన్స్ కొనసాగుతోంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దగ్గరే విద్యాశాఖ కూడా కొనసాగుతున్నందున ఇంటర్ ఫలితాలను సీఎం స్వయంగా విడుదల చేసే అవకాశం ఉన్నట్టు తెలుస్తున్నప్పటికీ, ఫలితాలను సీఎం ఇంటి దగ్గర విడుదల చేస్తారా? లేకపోతే ఇంటర్ బోర్డులో విడుదల చేస్తారా? ఆ రెండుచోట్ల కాకుండాసచివాలయంలో విడుదల చేస్తారా? అనే అంశంపై స్పష్టత రావల్సి ఉంది. ఇంటర్ వార్షిక పరీక్షలు ఫిబ్రవరి 25న ప్రారంభమై మార్చి 18తో ముగిశాయి. ఇంటర్ పరీక్షల జవాబు పత్రాల మూల్యాంకనాన్ని మార్చి 15 నుంచి 20 కేంద్రాల్లో ప్రారంభించారు. ఈ నెల1తో మూల్యాంకన ప్రక్రియ ముగిసింది. >>2

## నడ్డి విరుస్తున్న విద్యుత్ వడ్డనలు

### ప్రతి బిల్లుపై అదనంగా రూ.100పైగా వసూలు

### తీవ్రంగా వ్యతిరేకిస్తున్న వినియోగదారులు

**హైదరాబాద్, ఏప్రిల్ 10, ప్రభాతవార్త:** కస్టమర్ ఛార్జీల పేరుతో రాష్ట్ర విద్యుత్ పంపిణీ సంస్థలు వినియోగదారులపై వడ్డింపులకు పాల్పడుతున్నాయి. విద్యుత్ బిల్లులపై అదనంగా కస్టమర్ ఛార్జీలను వేసి బలవంతంగా వసూలు చేయడం పట్ల వినియోగదారుల్లో తీవ్ర వ్యతిరేకిస్తున్నారు. కరెంట్ యూనిట్ వినియోగం తక్కువగా ఉన్నప్పటికీ తమ బిల్లు మొత్తాలు పెరిగాయని పలువురు వినియోగదారులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. కస్టమర్ ఛార్జీల భారాన్ని వేయడంతోనే కరెంట్ బిల్లులు అకస్మికంగా పెరిగాయని అంటున్నారు. ఈ పద్ధతి అన్యాయమని పేర్కొంటూ, బిల్లింగ్‌ను సమీక్షించాలని వారు డిమాండ్ చేస్తున్నారు. ఒక వినియోగదారుని తన విద్యుత్ బిల్లును చూపిస్తూ, రూ.540 వచ్చే కరెంట్ బిల్లు ఈ సారి రూ.630కి పెరిగిందని అర్వింద్ అనే వినియోగదారుడు తెలిపారు. కరెంట్ ఈ విధంగానే ప్రతీ బిల్లుపై అదనంగా రూ.100 వరకూ వడ్డింపులకు పాల్పడుతున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయిఇ. బిల్లు చెల్లింపు సమయంలో ఇది ఇంకా పెరగొచ్చని ఆయన తెలిపారు. ఈ ఛార్జీలను బిల్లుపై స్పష్టంగా వివరించలేదని, ముఖ్యంగా తక్కువ మొత్తంలో విద్యుత్‌ను ఉపయోగించే గృహాలకు ఇవి అసమానంగా కనిపిస్తున్నాయని వినియోగదారులు చెబుతున్నారు. ప్రస్తుత టారిఫ్ ప్రకారం దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ ఇప్పటికే అధిక వినియోగం గల గృహ వినియోగదారుల నుండి విద్యుత్ వినియోగ ఛార్జీలు, కస్టమర్ సంబంధిత రుసుములకు అదనంగా, మంజూరైన లోడ్‌లో ప్రతి కిలోవాట్‌కు స్థిర ఛార్జీలను వసూలు చేస్తోంది. పంపిణీ సంస్థలు (డిస్కామ్‌లు) వినియోగదారులు ఎంత విద్యుత్‌ను వినియోగిస్తారనే దానిపై ఆధారపడని స్థిర నిర్వహణ ఖర్చులను తిరిగి రాబట్టుకోవడానికి కస్టమర్ ఛార్జీలను వసూలు చేస్తున్నాయి. విద్యుత్ నియంత్రణ కమిషన్ మార్గదర్శకాల ప్రకారం స్థిర ఛార్జీలు, ఇంధన సర్దుబాట్లు వంటి అన్ని అంశాలను బిల్లుపై పారదర్శకంగా చూపించాల్సి ఉండగా తప్పనిసరి అని, అయితే కస్టమర్ ఛార్జీల వసూలు చేయడం అసాధారణమైందని పలువురు >>2

## 10 రోజులు వడగాడ్పులు

**హైదరాబాద్, ఏప్రిల్ 10, ప్రభాతవార్త:** తెలంగాణ ప్రజలకు వాతావరణశాఖ రెడ్ అలర్ట్స్ జారీ చేసింది. రానున్న 10 రోజులపాటు తెలంగాణలో అధిక ఉష్ణోగ్రతలతోపాటు తీవ్రమైన వడగాలులు వీస్తాయని హెచ్చరించింది. సాధారణంగా ఏప్రిల్ చివరిలో లేదా మే నెలలో కనిపించే తీవ్రమైన వడగాలులు ఈసారి ముందే రానుండడం వాతావరణనిపుణులతోపాటు ప్రజలను కలవరానికి గురిచేస్తోంది. ముఖ్యంగా ఉత్తర,తూర్పు తెలంగాణ జిల్లాలైన ఆదిలాబాద్, నిజామాబాద్, జగిత్యాల, >>2



శుక్రవారం న్యూఢిల్లీలో రాష్ట్రపతి ద్రౌపది ముర్మును కలిసిన తెలంగాణ గవర్నర్ శివప్రతాప్ శుక్లా

# ఇక మావోయిస్టుల్లేరు!

>> 31వ తేదీనాటికి దేశంలో నక్సలైట్ల ఏరివేతను పూర్తి చేస్తామని కేంద్రం ప్రకటించడం తెలిసిందే. దీని తరువాత కూడా ఛత్తీస్‌ఘడ్, తెలంగాణలో వారి లొంగ ుబాట్లు జరుగుతూనే వున్నాయి. మావోయిస్టు పార్టీలో తెలంగా ణ కేడర్‌లో వివిద హోదాలో పనిచేస్తున్న వారిని లొంగిపోయేలా చేసేందుకు ఎస్‌ఐబి పోలీసులు నెల రోజులుగా చేస్తున్న కృషి ఫలించి పిఎల్‌జిఎ బెటాలియన్ కమాండర్ సహా 42 మంది లొంగిపోయారు. వీరిలో 17 మంది మహిళలు వున్నారు. దీంతో పాటు ఐదు ఎకె 47, నాలుగు ఎస్ఎ ల్ఆర్, మూడు ఇన్సాస్, ఒక 9 ఎంఎం స్టెన్‌గన్, ఆరు 303 రైఫిల్స్, రెండు 8 ఎంఎం రైఫిల్స్, ఒక 9ఎంఎం ఆటో పిస్టల్, రెండు .38 రివా ల్వర్, 10 కంట్రీమేడ్ గన్స్, ఒక బిజిఎల్ గన్, మరో ఎయిర్ గన్, 44 మ్యాగజైన్లు, 1007 తూటాలు, తమ డంప్‌లో వున్న 800 గ్రాముల ఎని మిది బంగారు బిస్కట్లను లొంగిపోయిన నక్సలైట్లు పోలీసులకు స్వాధీనం చేశారు. వీరి లొంగుబాటు సందర్భంగా డిజిపి శివధర్ రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం నుంచి మావోయిస్టు పార్టీలో వున్న వారు గణపతి ఆయన సతీమణి సహా ఐదుగురు మాత్రమే మిగిలారని తెలిపారు. ఇంతకు ముందు 11 మంది వుండగా తాజా లొంగుబాటు తరువాత ఈ సంఖ్య ఐదుకు తగ్గిందని ఆయన తెలిపారు. లొంగిపోయిన నక్సలైట్లలో కీలకమైన దండకారణ్య జోన్ కమిటీ సభ్యుడు, పిఎల్‌జిఎ బెటాలియన్ కమాండర్ సోడిమల్ల కేషాల్ అలియాస్ నిఖిల్ (47)తో పాటు డివిజన్ కమిటీ, ఏరి యా కమిటీ సభ్యులున్నారని ఆయన తెలిపారు. పార్టీలో తెలంగాణ కేడర్ తరపున పనిచేస్తున్న 13 మంది ఏకకాలంలో లొంగిపోవడం వెనుక ఎస్ ఐబి పోలీసుల కృషి వుందని డిజిపి తెలిపారు. లొంగిపోయిన వారి తెలంగాణ రాష్ట్రం తరపున కోటీ 93 లక్షల రూపాయల రివార్డుతో పాటు కేం ద్రం అందించనున్న రివార్డు వస్తుందని డిజిపి తెలిపారు. వీరంతా జనజీవన స్రవంతిలో కలిసి గౌరవంగా కుటుంబ సభ్యులతో కలిసి జీవించేలా చూస్తామని ఆయన హామీ ఇచ్చారు. నక్సలైట్లు స్వాధీనం చేసిన ఆయుధాలు సాయుధ బలగాలకు చెందినవేనని డిజిపి తెలిపారు. వీటిని ఆయా వి భాగాలకు అందజేస్తామని ఆయన తెలిపారు. 2023 డిసెంబర్ నెల నుంచి ఏడాదిన్నర కాలంలో 761 మంది 302 ఆయుధాలతో లొంగిపోయారని, ఇదిపోలీసుల సమిష్టికృషి వల్ల సాధ్యమయ్యిం దని ఆయన వెల్లడించారు. ఈ ఏడాది ఇప్పటి వరకు 205 మంది 206 ఆయుధాలతో లొంగి పోయారని డిజిపి తెలిపారు.

**గణపతి జీవించే వున్నారు...అడవుల్లో లేరు, లొంగిపోవడం ఉత్తమం**

మాజీ మావోయిస్టులు ప్రజలకు సేవ చేయాలనుకుంటే ఆ పార్టీపై నిషేధం ఎత్తివేయాలనడం సరికాదు మావోయిస్టు పార్టీ అగ్రనేత గణపతి గురించి మీడియా అడిగిన ప్రశ్నకు డిజిపి సమాధానం ఇస్తూ ఆయన జీవించే వున్నారని, అయితే అడవుల్లో మాత్రం లేరని తెలిపారు. ఆయనతో సహా వున్న పార్టీ ముఖ్యనేతలు ఐదుగురు లొంగిపోయి జనజీవన స్రవంతిలో కలవడం, మారిన పరిస్థితుల్లో _ఉత్తమమని డిజిపి తెలిపారు. నక్సలైట్ల లొంగుబాటుకు డెడ్‌లైన్ ముగిసిన తరువాత కూడా అక్కడక్కడ ఎవరైనా మిగిలివుంటే భేషజాలకు పోకుండా బయటకు రావాలని, వారికి అన్ని విధాలా అండగా వుంటామని ఆయన హామీ ఇచ్చారు. లొంగిపోయిన నక్సలైట్లు ప్రజలకు సేవచేసే క్రమంలో మావోయిస్టు పార్టీపై నిషేధం ఎత్తివేయాలని కోరడం అసమంజసంగా వుందని ఆయన పేర్కొన్నారు. మావోయిస్టులు పార్టీని వీడి బయటకు వచ్చా క మళ్లీ దాని గురించి మాట్లాడడం సరైంది కాదని డిజిపి తెలిపారు. వారు సేవచేయాలనుకుంటే ఎలాగైనా చేయవచ్చని ఆయన అన్నారు. లొంగి పోయిన నక్సలైట్లు తాము లొంగి పోలేదని, అరెస్టు చేశారని చెప్పడాన్ని కూడా డిజిపి తప్పుపట్టారు. వారికి ఇబ్బందులు వుండి ఇలా మాట్లాడి వుం డవచ్చని ఆయన తెలిపారు. లొంగిపోయిన వారు వారివారి స్వగ్రామాలలో కుటుంబాలతో సంతోషంగా వున్నారని, పోలీసుల నుంచి ఎలాంటి ఇ బ్బందులు లేదని డిజిపి తెలిపారు. లొంగిపోయిన వారందరికి త్వరలోనే ఆరోగ్య కార్డులు ఇస్తున్నట్లు ఆయన తెలిపారు. కొందరు మాజీ నక్సలైట్లను విచారణ పేరిట ఎన్ఐఎ వేధిస్తుందనే దానిపై మాట్లాడిన డిజిపి ఆ సంస్థ కేంద్ర హోం శాఖ పరిధిలో వుందని, తాము ఎవరినిఇబ్బంది పెట్టడంలేదని తెలిపారు. ఈ సమావేశంలో పోలీసు సంక్షేమ అదనపు డిజి స్వాతి లక్రా, గ్రే హౌండ్స్ అదనపు డిజి అనిల్ కుమార్, నిఘా విభాగం అదనపు డిజిపి విజయ్ కుమార్, ఎస్ఐబి ఐజి సుమతి తదితరులు పాల్గొన్నారు.



శుక్రవారం మావోయిస్టుల నుంచి స్వాధీనం చేసుకున్న బంగారాన్ని చూపిస్తున్న డిజిపి శివధర్ రెడ్డి

# దాడులు ఆపితేనే చర్చలు!

>> ఆస్తులు విడుదలచేయాలని కోరారు. వీటిని ఇప్పటికీ అమలుచేయలేదని అవిజరిగితేనే చర్చలుంటాయని చెప్పారు. ఇజ్రాయెల్, హెజ్‌బొల్లాల మధ్య తీవ్రస్థాయిలో దాడులు జరుగుతున్న క్రమంలో ఇపుడు చర్చలు తెరపైకి వచ్చాయి. లెబనాన్‌పై దాడులు ఆపనంతవరకూ చర్చలు ప్రారంభించేదిలేదని ఇరాన్ తెగేసి చెప్పింది. ఇజ్రా యెల్ లెబనాన్‌లమధ్య చర్చలు జరిపేందుకు వచ్చేవారం ఏర్పాటుచేయాలని అమెరికా భావి స్తోంది. ఈ వివాదానికి ముందు రోజుకు 100కి పైగా నౌకలు హార్ముజ్‌గుండా వెళ్లేవి. ఎక్కు వశాతం ఆసియా దేశాలకే ఉన్నాయి. ప్రస్తుతం కేవలం 12 మాత్రమే వెళుతున్నాయి. అలాగే హార్ముజ్‌పై ఇరాన్ వైఖరి మారలేదని ట్రంప్ ఆగ్రహం వ్యక్తంచేసారు.

శాంతి చర్చల వేళ రెడ్‌జోన్‌కు సీల్.. హైఅలర్ట్‌లోకి పాక్

ఇస్లామాబాద్, ఏప్రిల్ 10: అమెరికా-ఇరాన్ కాల్పుల విరమణకు అంగీకరించినా.. పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు మాత్రం తొలగిపోలేదు. సీజ్‌ఫైర్ వేళ.. శాంతి చర్చలకు పాకిస్థాన్ ఆతిథ్యం ఇస్తోంది. ఈ నెల 11న రాజధాని ఇస్లామబాద్‌లో ఈ చర్చలు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో పాకిస్థాన్ హై అలర్ట్‌లోకి వెళ్లిపోయింది. ప్రభుత్వ భవనాలు, కీలక రహదారి మార్గాల వద్ద భద్రతా బలగాలు పహారా కాస్తున్నాయి. రాజధానిలోని రెడ్‌జోన్ చుట్టూ కట్టుదిట్టమైన భద్రత కొనసాగుతోంది. అక్కడ పరిమిత సంఖ్యలోనే జనసంచారం కనిపిస్తోంది.

ఇస్లామాబాద్‌లో దేశ పార్లమెంట్, కీలక ప్రభుత్వ కార్యాలయాలు, లగ్జరీ హోటళ్లు, ఎంబసీలు, విదేశీ సంస్థల కార్యాలయాలున్న ప్రాంతాన్ని రెడ్‌జోన్‌గా పిలుస్తారు. ఈ చర్చల నేపథ్యంలో గురువారం, శుక్రవారం ఇస్లామాబాద్‌లో సెలవు ప్రకటించారు. దుకాణాలు మూతపడ్డాయి. తమ మధ్యవర్తిత్వంతోనే రెండు వారాలపాటు కాల్పుల విరమణ జరిగిందని చెప్పిన పాకిస్థాన్.. ఇప్పుడు ఇరు దేశాల మధ్య శాంతి చర్చలకు ఆతిథ్యం ఇస్తోంది. ఉపాధ్యక్షుడు జెడి వాన్స్ నేతృత్వంలోని బృందం అమెరికా తరఫను చర్చల్లో పాల్గొననున్నట్లు తెలుస్తోంది. ఇక ఇరాన్ వైపు నుంచి విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాగ్చీ, పార్లమెంట్ స్పీకర్ ఘాలిబాఫ్ పాక్ బయల్దేరారంటూ అంతర్జాతీయ మీడియా కథనాఉల పేర్కొన్నాయి. ఈ వార్తలను ఇరాన్ ఖండించింది. వారిద్దరూ తమ రాజధాని టెహ్రాన్‌లోనే ఉన్నారని చెప్పింది.ఒకవేళ చర్చలంటూ జరిగితే.. హార్ముజ్‌పై నియంత్రణ, తమ దేశంపై ఉన్న ఆంక్షల నుంచి ఉపశమనం, తన మిత్రపక్షాలపై దాడులు చేయకూడదంటూ 10 పాయింట్ల డిమాండ్లపైనే ఇరాన్ పట్టుబట్టే అవకాశం ఉంది. ఇక, లెబనాన్‌లోని ఇరాన్ మిత్రపక్షం హెజ్‌బొల్లా గ్రూప్‌పై ఇజ్రాయెల్ దాడులు మాత్రం ఆగడం లేదు. సీజ్‌ఫైర్ ప్రకటన తర్వాతే అక్కడ మారణహోమం సృష్టించింది. అమెరికా-ఇరాన్ మధ్య ఉన్న అపనమ్మకం, ఇజ్రాయెల్ దూకుడు కారణంగా ఈ చర్చల్లో పురోగతిని ఆశించలేమనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

# మధ్యంతర బెయిల్ మంజూరు

>> మను సింఘ్వీ, రవీందర్ రెడ్డిలు ఖేరాను కావాలనే అస్సాం సర్కారు ఇబ్బందులకు గురిచేస్తోందని తెలిపారు. రాజకీయంగా ఖేరాను ఎదుర్కొనలేక వంద మంది పోలీసులను అస్సాం నుంచి ఢిల్లీ, హైదరాబాద్‌కు పంపి గాలింపు పేరి ట వేధిస్తున్నారని వారు తెలిపారు. ఈ కేసులో ఖేరాపై అస్సాం సిఎం హిమంత బిశ్వ శర్మ మొదట అనుచితంగా మాట్లాడినా దీనిపై ఎలాంటి చర య్యలు తీసుకోలేదని వారు వాదించారు. ఖేరా సతీమణి సనత్‌నగర్‌లో పోటీ చేసినందున ఇక్కడ వుంటున్నారని, దీనిపై విచారించే పరిధి తెలంగాణ కో ర్టుకు వుందని వారు తెలిపారు. అస్సాం సర్కారు తరపున వాదించిన సీనియర్ న్యాయవాది దేవజిల్ షైకి ఖేరాపై నమోదయ్యింది చిన్న కేసు కాదని, ఖేరా చేసిన ఆరోపణల కోసం తప్పుడు పత్రాలను వాడినట్లు ఆధారాలు వున్నాయని తెలిపారు. ఖేరా ఢిల్లీలో శాశ్వతంగా వుంటున్నట్లు తమ వద్ద అ న్ని ఆధారాలు వున్నాయని, ఈ కేసును తప్పుదోవ పట్టించేందుకు తాను హైదరాబాద్ వాసిగా ఖేరా చెప్పుకుంటున్నాడని ఆయన వాదించారు. ఇరుప క్షాల వాదనలు విన్న ధర్మాసనం అస్సాం పోలీసులు నమోదు చేసిన కేసుపై ఖేరాకు మధ్యంతర బెయిల్ మంజూరు చేయడంతో పాటు ఆయనపై వారం రోజుల పాటు ఎలాంటి చర్యలు తీసుకోవద్దని అస్సాం సర్కారును ఆదేశించింది. ఈ కేసులో ఖేరా పోలీసులకు సహకరించాలని హైకోర్టు ఆ దేశించింది.

# డీలిమిటేషన్‌పై పోరాటం

>>కేంద్రంలో ప్రభుత్వం ఏర్పడే ప్రమాదం ఉంది. భవిష్యత్తులో కేవలం బీహార్, ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్, రాజస్థాన్ రాష్ట్రాల మద్దతుతోనే కేంద్రంలో అధికారాన్ని చేజిక్కించుకునే అవకాశం ఉంది అని పేర్కొన్నారు. కాగా, నియోజకవర్గాల విషయంలో బిఆర్ఎస్ పార్టీ ఇప్పటికే బిజెపికి సరెండర్ అయి ఉండొచ్చు అని వ్యాఖ్యానించారు. ఇప్పటికే దక్షి ణాది రాష్ట్రాలు మోసపోతున్నాయి, నియోజకవర్గాల పునర్విభజన వల్ల ఇంకా మోసపోతాం. రైతు చట్టాలు ఎలా వెనక్కి తీసుకున్నారో.. నియోజకవర్గాల పునర్విభజన ఆలోచనను కూడా వెనక్కి తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ బిల్లు ఆమోదం పొందుతే భవిష్యత్తులో దక్షి ణాది రాష్ట్రాలు కూడా ఆందోళన చేస్తాయి. మహిళా రిజర్వేషన్ బిల్లుకు వ్యతిరేకం కాదని, 2023లోనే ఈ చట్టాన్ని చేయాలని కాంగ్రెస్ డిమాండ్ చేసింది అని అన్నారు. మహిళా రిజర్వేషన్ బిల్లుకు కాంగ్రెస్ పూర్తి మద్దతు ఇస్తుందని సిఎం రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. మహిళల కోసం బిల్లు తీసుకొచ్చిందే కాంగ్రెస్ అని ఆయన స్పష్టం చేశారు. స్థానిక సంస్థల్లో మహిళలకు రిజర్వేషన్లను రాజీవ్‌గాంధీ అమలు చేశారు. మహిళా బిల్లును సోనియాగాంధీ గతంలోనే పార్లమెంట్‌లో పెట్టారు. 33శాతం మహిళా రిజర్వేషన్లలో ఓబీసీ కూడా అమలు చేయాలి అని చెప్పారు. మహిళా రిజర్వేషన్లను డీలిమిటేషన్‌తో ఎందుకు లింక్ పెడుతున్నారు? ప్రస్తుతం ఉన్న 543లో మహిళా రిజర్వేషన్ అమలు చేయొచ్చు. ప్రస్తుత సీట్లతోనే మహిళా రిజర్వేషన్ అమలు చేస్తే ఎవరూ అడ్డుపడరు అని పేర్కొన్నారు. ఉత్తర-దక్షిణాది రాష్ట్రాల మధ్య అంతరాన్ని పెంచాలని బిజెపి చూస్తోందని, ఆర్థిక అంతరాలతో ఇప్పుడు రాజకీయ అంతరాలు తీసుకొస్తున్నారని వ్యాఖ్యానించారు. ప్రస్తుతం ఉత్తర,దక్షిణాది మధ్య నియోజకవర్గాల్లో అంతరం ఉంది. కొత్త అంతరం ప్రస్తుతం మోతాదులోనే ఉంటే ఎవరికీ అభ్యంతరం ఉండదు,ఎన్డీయే చెబుతున్న లెక్కలు ఉత్తర-దక్షిణాది మధ్య పెద్ద అంతరం పెంచనున్నాయన్నారు. ఐదు రాష్ట్రాలతోనే కేంద్రంలో ప్రభుత్వం ఏర్పాటు చేయాలన్నది బిజెపి ఆలోచన అని రేవంత్‌రెడ్డి అన్నారు. డీలిమిటేషన్ అనేది కేవలం రాజకీయ పార్టీల సమస్య కాదని, ఇది ప్రాంతాల అస్థిత్వానికి సంబంధించిన సమస్య అని ఆయన స్పష్టం చేశారు. మహిళా రిజర్వేషన్ల అమలుకు డీలిమిటేషన్‌తో ముడిపెట్టడం కేంద్రం ఆడుతున్న రాజకీయ డ్రామా అని అని సిఎం విమర్శించారు. మహిళా రిజర్వేషన్లను ఇవ్వడానికి పునిర్విభజన అవసరమేలేదు. కానీ,దీని సాకుతో దక్షిణాది రాష్ట్రాల ప్రాముఖ్యతను తగ్గించాలని కేంద్రం కుట్ర చేస్తోందన్నారు. డీలిమిటేషన్ వల్ల ఉత్తరాది రాష్ట్రాల ఎంపీ సీట్లు 600 దాటితే దక్షిణాది సీట్లు కేవలం 195 దగ్గరే ఆగిపోతాయన్నారు. అప్పుడు కేంద్రంలో ప్రభుత్వం ఏర్పాటు చేయడానికి సౌత్ ఇండియా అవసరమే ఉండదు. ఇదే కేంద్రం ప్లాన్ అని రేవంత్‌రెడ్డి ఆరోపించారు. దక్షిణాది రాష్ట్రాలు ఇప్పటికే పన్నుల వాటాలో,నిధుల కేటాయింపులో తీవ్ర అన్యాయానికి గురవుతున్నాయని సిఎం ఆవేదన వ్యక్తం చేశారు. సౌత్ ఇండియా ఫైనాన్షియల్ క్యాపిటల్‌గా ఉంటే,నార్త్ ఇండియా పొలిటికల్ క్యాపిటల్‌గా మారింది. ఎన్నో ఏళ్లుగా మమ్మల్ని సెకండ్ గ్రేడ్ సిటిజన్స్‌గా చూస్తున్నారు. ఇప్పటికే గాయపడి ఉన్న దక్షిణాది రాష్ట్రాలపై ఇంకా అన్యాయం చేస్తామంటే ప్రజలు తిరుగుబాటు చేయడం ఖాయమన్నారు. ఇది చివరకు పెద్ద ప్రజా ఉద్యమానికి దారి తీస్తుందని హెచ్చరించారు.

# 10 రోజులు వడగాడ్పులు

>> ములుగు వంటి ప్రాంతాల్లో ఉష్ణోగ్రతలు 44డిగ్రీల నుండి 45 డిగ్రీల వరకు పెరిగే అవకాశం ఉంది. దీంతో ఆయా జిల్లాలకు వాతావరణశాఖ రెడ్ అలర్ట్ జారీ చేసింది. అదే సమయంలో రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌లో కూడా పరిస్థితి తీవ్రంగా ఉండబోతోందని వాతావరణశాఖ పేర్కొంది. ఏప్రిల్ 12 నుండి 22 వరకు ఎడతెరిపి లేకుండా వరుసగా పది రోజులపాటు అత్యధిక ఉష్ణోగ్రతలు 40 డిగ్రీల 41 డిగ్రీల వరకు కొనసాగనున్నాయి. మండే ఎండల నేపథ్యంలో ప్రజలు మధ్యాహ్నం 11 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు అనవసర ప్రయాణాలు చేయవద్దని, తగినంత నీరు, ద్రవ పదార్థాలు తీసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. ముఖ్యంగా వృద్ధులు, పిల్లలు, గర్భిణీలు ఈ వడగాలుల ప్రభావానికి గురికాకుండా జాగ్రత్తగా ఉండాలని హెచ్చరిస్తున్నారు.

## మత్తులో పట్టుబడితే వాహనం సీజ్ వద్దు

>> అయితే, ఆ సమయంలో అతనితో పాటు ఉన్న మద్యం తాగని స్నేహితులకు లేదా బంధువులకు వాహనాన్ని అప్పగించాలని కోర్టు స్పష్టం చేసింది. ఒకవేళ అక్కడ ఎవరూ లేని పక్షంలో సదరు వ్యక్తికి సంబంధించిన బంధువులు లేదా స్నేహితులకు ఫోన్ చేసి అక్కడికి పిలిపించి వాహనాన్ని వారికి అప్పగించేలా చర్యలు తీసుకోవాలని తెలిపింది.

# నడ్డి విరుస్తున్న విద్యుత్ వడ్డనలు

>> వ్యాఖ్యానిస్తున్నారు. ఈ విషయంపై దక్షి ణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ, తెలంగాణ విద్యుత్ నియంత్రణ కమిషన్ దృష్టికి తీసుకెళుతున్నట్లు పలువురు స్పష్టం చేస్తున్నారు. దీనిపైఅధికారిక వివరణ ఇవ్వాలని, సర్‌ఛార్జీలపై పరిమితి విధించాలని, లెక్కలోకి రాని ఛార్జీలుగా తాము భావిస్తున్న వాటికి వాపసు ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు.

## రాష్ట్రపతి ముర్ము, ప్రధాని మోడీని కలిసిన గవర్నర్ శివప్రతాప్ శుక్లా

### ఉప రాష్ట్రపతి రాధాకృష్ణన్,కేంద్ర హోం మంత్రి అమిత్‌షాలతోనూ భేటీ

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్, ఏప్రిల్10:** తెలంగాణ రాష్ట్ర గవర్నర్ శివప్రతాప్ శుక్లా శుక్రవారం ఢిల్లీలో బిజీబిజీగా గడిపారు. పెద్దలందరినీ కలిశారు. మొదట రాష్ట్రపతి ద్రౌపదీముర్ముతో భేటీ అయ్యారు. తెలంగాణ గవర్నర్ గా బాధ్యతలు చేపట్టిన తర్వాత ఆయన తొలిసారి రాష్ట్రపతి భవన్ లో రాష్ట్రపతిని మర్యాదపూర్వకంగా కలిశారు. రాష్ట్ర పరిస్థితులను వివరించారు. తర్వాత భారత ప్రధాన మంత్రి నరేంద్రమోడీని మర్యాద పూర్వకంగా గవర్నర్ కలిశారు. ఆయనకు రాష్ట్ర పరిస్థితులను వివరించారు. ఆ తర్వాత ఉప రాష్ట్రపతి సీ.పీ. రాధాకృష్ణన్‌తో భేటీ అయ్యారు.తెలంగాణ గవర్నర్ గా బాధ్యతలు చేపట్టిన తర్వాత శివ ప్రతాప్ శుక్లా తొలిసారి ఉప రాష్ట్రపతిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఆ తర్వాత కేంద్ర హోమ్ మంత్రి అమిత్‌షాను మర్యాద పూర్వకంగా కలిశారు.

# బిఆర్ఎస్‌లో చేరిన పొన్నాల ఎక్కడున్నారో తెలుసా?

## బిఆర్ఎస్ నుంచి సీనియర్లు ఎందుకు బయటకొచ్చారు?

### జీవన్‌రెడ్డి కామెంట్స్‌పై సిఎం రేవంత్‌రెడ్డి రియాక్షన్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్,ఏప్రిల్10:** మాజీ మంత్రి జీవన్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలపై ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి తనదైన శైలిలో స్పందించారు. కాంగ్రెస్‌లో సీనియర్లకు అన్యాయం జరుగుతోందన్న విమర్శలను కొట్టిపారేస్తూనే గత బిఆర్ఎస్ ప్రభుత్వంలో సీనియర్ నేతలకు ఎదురైన పరిస్థితులను ఆయన గుర్తు చేశారు. శుక్రవారం ఢిల్లీలో మీడియా ప్రతినిధులతో జరిగిన చిట్‌చాట్‌లో సిఎం ఈ అంశంపై ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. జీవన్‌రెడ్డి తనపై చేసిన వ్యక్తిగత విమర్శలకు పెద్దగా ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరం లేదని రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. జీవన్‌రెడ్డి వ్యాఖ్యలపై నేను ప్రత్యేకంగా స్పందించను అని పేర్కొన్నారు. కాంగ్రెస్‌లో సీనియర్లకు అవమానం జరుగుతోందని అంటున్న వారు,బిఆర్ఎస్‌లో నుంచి సీనియర్ నేతలు ఎందుకు బయటకు వచ్చారో చెప్పాలని డిమాండ్ చేశారు. ఒకప్పుడు పార్టీ కోసం పనిచేసిన ఆళ్ల నరేంద్ర,విజయశాంతి, ఈటల రాజేందర్ వంటి నేతలు బిఆర్ఎస్‌ను ఎందుకు వీడాల్సి వచ్చింది? అక్కడ వారికి జరిగిన అవమానం ఏంటో అందరికీ తెలుసు? అని సిఎం అన్నారు. మాజీ పిసిసి అధ్యక్షుడు పొన్నాల లక్ష్మయ్య ఇప్పుడు ఎక్కడున్నారో,ఆయనకు బిఆర్ఎస్‌లో దక్కిన గౌరవం ఎంతో కనిపిస్తూనే ఉందని ఎద్దేవా చేశారు. బిఆర్ఎస్ హయాంలో సీనియర్లకు జరిగిన అవమానాలు గుర్తు లేదా? అని రేవంత్‌రెడ్డి ప్రశ్నించారు. కాంగ్రెస్ ఎప్పుడూ తన నేతలను గౌరవిస్తుందని, కానీ కొందరు కావాలని చేస్తున్న విమర్శలకు కాలమే సమాధానం చెబుతందని పేర్కొన్నారు.

# కాంగ్రెస్ పోవాలి.. కెసిఆర్ రావాలి

## బిఆర్ఎస్ అధినేతతో సమావేశంలో జీవన్‌రెడ్డి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్, ఏప్రిల్10:** తెలంగాణ మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌తో మాజీ ఎమ్మెల్సీ టి.జీవన్ రెడ్డి భేటీ అయ్యారు. ఎర్రవల్లిలోని కేసీఆర్ ఫామ్ హౌస్‌లో వీరిద్దరూ సమావేశం అయ్యారు. దాదాపు ఐదు గంటలపాటు వీరి మధ్య తాజా రాజకీయ పరిణామాలపై చర్చ జరిగింది. ఈ భేటీతో కారు పార్టీలో టి.జీవన్ రెడ్డి జాయిన్ కావడం లాంఛనమైంది. సమావేశం అనంతరం జీవన్ రెడ్డి మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీపై సంచలన వ్యాఖ్యలు చేశారు. కాంగ్రెస్ అధిష్ఠానం తెలంగాణపై పట్టు కోల్పోయిందని జీవన్ రెడ్డి అన్నారు. ఒకప్పుడు పీసీసీ చెప్పినట్టు సీఎం నడుచుకునే వారని.. కానీ ఇప్పుడు సీఎం చెబితే పీసీసీ అమలు చేస్తోందని విమర్శించారు. త్వరలోనే జగిత్యాలలో భారీ బహిరంగ సభ పెట్టి కేసీఆర్ సమక్షంలో తాను బీఆర్ఎస్‌లో చేరుతానని జీవన్ రెడ్డి చెప్పారు. పీసీసీ తప్పు చేసి ఆ నింద ఏఐసీసీ మీద వేస్తోందని మండిపడ్డారు. తనకు 14 సార్లు బిఫామ్ ఇచ్చారంటే అది తన సమర్థత వల్లేనని.. తాను కంటెంట్ ఉన్న నాయకుడిని కాబట్టే కాంగ్రెస్ పార్టీ టికెట్ ఇచ్చిందని చెప్పుకొచ్చారు. అధికార పార్టీ నుంచి ప్రతిపక్షంలోకి ఎందుకు వెళ్తున్నానో మీకే తెలియాలంటూ కాంగ్రెస్ నేతలకు చురకలు అంటించారు జీవన్ రెడ్డి. కాంగ్రెస్ ప్రభుత్వం తిరోగమనంలో పయనిస్తోందని.. కాంగ్రెస్ పోవాలి.. కేసీఆర్ రావాలి.. అని ప్రజల్లో చర్చ మొదలైందన్నారు. మిగిలిన రెండున్నరేళ్లు అయినా కాంగ్రెస్ సర్కార్ బాగా పని చేయాలని తాను కోరుకుంటున్నట్లు జీవన్ రెడ్డి ఆకాంక్షి ంచారు.



శుక్రవారం ఎర్రవెల్లి ఫామ్‌హౌస్‌కు వచ్చిన జీవన్‌రెడ్డికి పుష్పగుచ్ఛాన్ని అందజేస్తున్న కెటిఆర్ తదితరులు

# అన్నా! దేవుడే పంపిండు

>> కలిసి పనిచేయాల్సిన అవసరమున్నదని, మీతో కలిసి పనిచేయమని దేవుడే నన్ను మీదగ్గరికి పంపించిండు. చాలా గ్యాప్ తర్వాత ఇన్నాళ్ల కైనా మీతో కలిసిపనిచేసే అవకాశం రావడం సంతోషంగా ఉంది అంటూ మనసులోని మాటను వ్యక్తం చేశారు.ఈ సంద్భంగా జీవన్‌రెడ్డిని కేసీఆర్ సన్మానించారు. తర్వాత కెసిఆర్‌తో కలిసి జీవన్‌రెడ్డి భోజనం చేశారు. కాగా, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, మాజీ మంత్రి టి. జీవన్‌రెడ్డి ఈనెల 20న బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరనున్నారని మాజీ మంత్రులు కొప్పుల ఈశ్వర్, ఎల్ రమణ వెల్లడించారు. ఎర్రవల్లిలోని కేసీఆర్ వ్యవసాయ క్షేత్రంలో కేసీఆర్‌తో జీవన్‌రెడ్డి భేటీ అనంతరం వారు మీడియాతో మాట్లాడారు. బీఆర్ఎస్ ప్లీనరీ సభకు ముందే జగిత్యాలలో నిర్వహించే భారీ బహిరంగ సభలో భారీగా చేరికలు ఉంటాయని తెలిపారు. రాష్ట్రంలో రైతు సమస్యలతో ప్రజా సమస్యలపై బహిరంగ సభ నిర్వహించబోతున్నామని వెల్లడించారు. కేసీఆర్‌తో కలిసి పనిచేయడానికి జీవన్‌రెడ్డి ముందుకు రావడం సంతోషమని వివరించారు.కేసీఆర్ ప్రజాక్షేత్రంలోకి రాబోతున్నారని, ప్రజాసమస్యలపై ఇకపై నిరంతరం పోరాటం చేస్తామని, కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతామని స్పష్టం చేశారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ప్రజాక్షేత్రంలోకి రానున్నారని ఎల్.రమణ వెల్లడించారు. ప్రజాసమస్యలపై ఇకపైనిరంతరంగా పోరాటం చేస్తామని ఆయన పేర్కొన్నారు.

# ఆర్టీసీ ఉద్యోగులకు 2.1% డిఎ పెంపు

>> ప్రకటించారు. శుక్రవారం సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ వై. నాగిరెడ్డి, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లు, ఉన్న తాధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో మంత్రి ప్రకటన చేశారు. ఈ నిర్ణయంతో రాష్ట్రవ్యాప్తంగా ఉన్న సుమార 38 వేల మందికి పైగా ఆర్టీసీ సిబ్బందికి లబ్ధి చేకూరనుంది. ప్రస్తుతం ఆర్టీసీ ఉద్యోగులకు 50.7 శాతం డీఏ అందుతుండగా, తాజాగా 2.1 శాతాన్ని పెంచారు. దీనితో మొత్తం డీఏ 52.8 శాతానికి చేరింది. ఈ పెంపు జనవరి 1, 2026 నుండి అమల్లోకి వస్తుందని మంత్రి స్పష్టం చేశారు. గత మూడు నెలలకు (జనవరి, ఫిబ్రవరి, మార్చి) సంబంధించిన బకాయిలను ఏప్రిల్ నెల జీతంతోపాటు ఉద్యోగుల ఖాతాల్లో జమ చేయనున్నారు. ఈ పెంపు వల్ల సంస్థపై ప్రతి నెలా రూ. 2.82 కోట్ల మేర ఆర్థిక భారం పడనుంది. ఆర్టీసీ సిబ్బందికి డీఏలన్నీ చెల్లింపులు గత ప్రభుత్వ హయాంలో పెండింగ్‌లో ఉన్న డీఏలను ఈ ప్రభుత్వం వరుసగా విడుదల చేస్తూ వస్తోంది. 2024 మే నెలలో ఆర్‌పీఎస్ 2017 అమలు చేసిన తర్వాత, తాజాగా ఈ 2.1శాతం డీఏను కూడా మంజూరు చేయడంతో, ఉద్యోగులకు చెల్లించాల్సిన డీఏ బకాయిలన్నీ పూర్తయ్యాయని మంత్రి పేర్కొన్నారు. గత ఏడాది జూలై 2025లో కూడా ప్రభుత్వం 2.1శాతం డీఏను పెంచిన విషయాన్ని ఈ సందర్భంగా గుర్తు చేశారు. ప్రజా పాలన ప్రభుత్వం మొదటి నుండి ఆర్టీసీ సంస్థ పరిరక్షణ, కార్మికుల సంక్షేమంపై ప్రత్యేక దృష్టి సారించిందని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు.

డీఏ పెంపుతో పాటు అంతకుముందు పెండింగ్‌లో ఉన్న కారుణ్య నియామకాలు చేపట్టి ఉద్యోగ అవకాశాలు కల్పిం చడమే కాక త్రిసభ్య కమిటీ ద్వారా దీర్ఘకాలంగా విధులకు దూరమైన వారిని తిరిగి తీసుకోవడం, కార్మికుల ఆరోగ్య సంరక్షణ కోసం ఆర్టీసీ ఆసుపత్రిని ఆధునీకరించడం జరిగిం దన్నారు.

# రేపే ఇంటర్ ఫలితాలు!

>> మూల్యాంకన అనంతరం ఫలితాల విడుదలకు సంబంధించిన క్రోడీకరణ పనులను ఇంటర్ బోర్డు అధికారులు ఈ నెల 8 వరకు పూర్తి చేశారు. ఇంటర్ ఫలితాల విడుదల కోసం ఇంటర్ బోర్డు ప్రభుత్వానికి ఈ నెల 9, 10, 11 తేదిల్లో ఏదో ఒకరోజు విడుదల చేయడానికి అనుమతి కోరుతూ ప్రభుత్వానికి లేఖ రాసినట్టు తెలిసింది. అయితే ఇంటర్ బోర్డు కార్యదర్శిగా కొనసాగుతున్న కృష్ణ ఆదిత్య తమిళనాడు ఎన్నికల విధుల్లో పరిశీలకులుగా కొనసాగుతున్న నేపథ్యంలో ఫలితాల విడుదలకు సంబంధించి ప్రభుత్వం నిర్ణయం తీసుకోలేదు. గురువారం ఇంటర్ బోర్డు అధికారులు విద్యాశాఖ అధికారులతో చర్చించిన అనంతరం ఈ నెల 12న ఫలితాలను విడుదల చేయడానికి సుముఖత వ్యక్తం చేసినట్టు తెలిసింది. ఒకవేళ ఈ నెల 12న వీలుకాకపోతే 13న ఇంటర్ ఫలితాలను విడుదల చేసే అవకాశం ఉంది. ఈ ఏడాది మొత్తం 9,97,075 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారు. అందులో మొదటి సంవత్సరం విద్యార్థులు 4,89,126 మంది, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 5,07,949 మంది ఉన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 1,495 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు.

## రాజకీయ లబ్ధికే ప్రత్యేక పార్లమెంటు: ఖర్గే

>>త్రులు కర్ణాటక సీఎం సిద్ధరామయ్య, హిమాచల్ ప్రదేశ్ సీఎం సుఖ్వీందర్ సింగ్ సుక్కుతో కలిసి కీలక చర్చల్లో సీఎం పాల్గొన్నారు. దేశంలో జరిగే నియోజకవర్గాల పునర్విభజన అంశంపై ఈ సమావేశంలో చర్చించినట్లు సమాచారం. మహిళా రిజర్వేషన్ల అంశంపై కూడా ఈ సమావేశంలో చర్చించినట్లు సమాచారం. ఏప్రిల్ 16 నుంచి 18 వరకు పార్లమెంట్ ప్రత్యేక సమావేశాలు ఉన్నందున ఈ నేపథ్యంలో సిడబ్ల్యుసి సమావేశంకు ప్రాధాన్యత సంతరించుకుంది. నియోజకవర్గాల పునర్విభజన,మహిళా రిజర్వేషన్ల అంశంపై పార్లమెంట్‌లో చర్చించి చట్ట సవరణ చేసేందుకు పార్లమెంట్ ప్రత్యేక సమావేశాలను కేంద్రం ఏర్పాటు చేస్తోంది. పార్లమెంట్ ప్రత్యేక సమావేశాల్లో పార్టీ అనుసరించాల్సిన విధానాలు, పార్టీ లైన్‌పై సిడబ్ల్యూసీ సమావేశంలో చర్చించినట్లు సమాచారం.

ఎన్నికల ప్రయోజనాల కోసమే పార్లమెంట్ సమావేశాలు: మల్లికార్జున ఖర్గే సీడబ్ల్యూసీ సమావేశంలో ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే కీలక వ్యాఖ్యలు చేశారు. ప్రత్యేక పార్లమెంట్ సమావేశాలు ఎన్నికల ప్రయోజనాల కోసమేనని చెప్పారు. ఇప్పటివరకు కేంద్ర ప్రభుత్వం నుంచి అధికారికంగా ఎటువంటి ప్రతిపాదన కాంగ్రెస్ ముందుకు రాలేదని అన్నారు.

## వారం - వర్జ్యం

11-04-2026, శనివారం
శ్రీ పరాభవ నామ సంవత్సరం,
చైత్రమాసం, ఉత్తరాయణం
వసంత ఋతువు, కృష్ణపక్షం, రేవతి కార్తె
నవమి రా.12.34
ఉత్తరాషాఢ మ.1.36
వర్జ్యం : సా.5.51-రా.7.34
దు.తె.5.55-ఉ.7.33
రాహుకాలం - ఉ.9.00-10.30

## వార్తాఫలం

**మేషం:** ఖర్చులు అధికంగా ఉండటంవలన చిన్నపాటి ఋణాలను చేయవలసి వస్తుంది. నూతన విద్యావకాశాలు కలవు.

**వృషభం:** మీ మాట మంచితనం నడవడిక వల్ల చాలా మందికి మీరే ముఖ్యమైన అంతరంగికులవుతారు. ధనలాభం కలదు.

**మిథునం:** మీ మీద ఇతరులు చెప్పే చాడీలు పెద్దగా ప్రభావం చూపవు. వ్యవహారాలు సకాలంలో పూర్తి చేసారు. వస్త్రలాభం.

**కర్కాటకం:** ఇ-మెయిల్స్‌ను సకాలంలో సరిచూసుకోవడం మరవకండి. వ్యాపారాలలో స్వల్పమార్పులు చోటు చేసుకుంటాయి.

**సింహం:** కీలక వ్యవహారాలలో అవరోధాలు ఏర్పడినా పూర్తిచేస్తారు. ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రమే.ఆరోగ్య జాగ్రత్త.

**కన్య :** ముఖ్య నిర్ణయాలు ఆలోచించి ముందుకు సాగడం మంచిది. కోప తాపాలకు దూరంగా ఉండండి.

**తుల:** ఉద్యోగులకు విధి నిర్వహణలో బాధ్యతలు పెరుగుతాయి. కుటుంబ సభ్యులతో స్వల్ప విభేదాలు ఏర్పడుతాయి.

**వృశ్చికం:** రాజకీయ, పారిశ్రామిక రంగాలలోని వారికి అనుకూలంగా వుంటుంది. బంధువుల కలయిక.

**ధనుస్సు:** నూతన వ్యక్తులతో పరిచయాలు మిత్రత్వానికి దారితీస్తాయి. కీలక నిర్ణయాలలో తొందరపాటు వద్దు.

**మకరం:** కుటుంబ పరమైన చికాకులు వృత్తి ఉద్యోగాల మీద ప్రభావం చూపించ కుండా జాగ్రత్తలు తీసుకోగలుగుతారు.

**కుంభం:** పరిస్థితులకు లోబడి ఇతరులకు ఇచ్చిన మాటకు కొంతకాలానికి వాయిదా వేస్తారు. స్పెక్యులేషన్‌కు దూరంగా వుండండి.

**మీనం:** పనిభారం తట్టుకోలేక పని విభజన చేసే చర్యలలో భాగంగా మధ్యవర్తులకు వ్యవహారాలను అప్పగిస్తారు.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# మహిళా ఉద్యోగుల రక్షణకు సర్కారు కీలక నిర్ణయం

### అంతర్గత ఫిర్యాదుల కమిటీ ఏర్పాటు

**హైదరాబాద్, ఏప్రిల్ 10, ప్రభాతవార్త:** మహిళా ఉద్యోగుల రక్షణ విషయంలో తెలంగాణ సర్కార్ కీలక నిర్ణయం తీసుకుంది. పని ప్రదేశాల్లో మహిళలపై లైంగిక వేధింపుల నిరోధక చట్టం (పిఒఎస్‌హెచ్ యాక్టు - 2013) అమలులో భాగంగా తెలంగాణ సచివాలయ సాధారణ పరిపాలనశాఖలో అంతర్గత ఫిర్యాదుల కమిటీని రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఈ మేరకు ఏప్రిల్ 9న రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావు ఉత్తర్వులు జారీ చేశారు. కమిటీ ప్రిసైడింగ్ ఆఫీసర్‌గా వి.డి. సుధారాణి (ప్రభుత్వ సంయుక్త కార్యదర్శి), సభ్యులుగా జి. శైలజ (సహాయ కార్యదర్శి), టి. లక్ష్మీ ప్రసన్న (సెక్షన్ ఆఫీసర్), ఆయేషా తబస్సుమ్ (అసిస్టెంట్ సెక్షన్ ఆఫీసర్)ను నియమించారు. జీఏడీలో పనిచేసే మహిళా ఉద్యోగుల నుంచి వచ్చే లైంగిక వేధింపుల ఫిర్యాదులను ఈ కమిటీ స్వీకరిస్తుంది. ఆ ఫిర్యాదులపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై తదుపరి క్రమశిక్షణా చర్యలు తీసుకునేందుకు వీలుగా ప్రభుత్వానికి ఒక సమగ్ర నివేదికను అందజేస్తుంది.

# బెంగాల్ ఎన్నికల్లో స్టింగ్ ఆపరేషన్ కలకలం

### హుమాయూన్ కబీర్ పార్టీతో మజ్లిస్ కటీఫ్

**కోల్‌కతా, ఏప్రిల్ 10:** పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల ముందు స్టింగ్ ఆపరేషన్ వీడియో ఒకటి ఇపుడు రాజకీయ ప్రకంపనలు సృష్టిస్తోంది. ఈ పరిణామంతో అసదుద్దీన్ ఒవైసీ నేతృత్వంలోని ఎంఐఎం పార్టీ, తృణమూల్ కాంగ్రెస్ మాజీ నేత హుమయూన్ కబీర్ స్థాపించిన ఆమ్ జనతా ఉన్నయన్ పార్టీ (ఏజేయూపీ)తో పొత్తును రద్దు చేసుకుంది. బెంగాల్‌లో ఇకపై ఒంటరిగానే పోటీ చేస్తామని స్పష్టం చేసింది.

అధికార తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ) పార్టీ ఓ స్టింగ్ ఆపరేషన్ వీడియోను విడుదల చేసింది. అందులో హుమయూన్ కబీర్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీని ఓడించడానికి బీజేపీతో చేతులు కలిపినట్లు అంగీకరించారని టీఎంసీ ఆరోపించింది. ప్రధాని కార్యాలయంతో (పీఎంవో) తాను టచ్‌లో ఉన్నానని, రూ.1000 కోట్ల ప్రణాళికలో భాగంగా ఇప్పటికే రూ.200 కోట్లు అడ్వాన్స్‌గా అందుకున్నానని కబీర్ చెప్పినట్లు ఆ వీడియోలో ఉన్నట్లు టీఎంసీ పేర్కొంది. ముస్లింలను సులభంగా మోసం చేయవచ్చని ఆయన వ్యాఖ్యానించారని తెలిపింది. ఈ వ్యవహారంపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) విచారణ జరపాలని టీఎంసీ డిమాండ్ చేసింది. ఈ ఆరోపణలను హుమయూన్ కబీర్ తీవ్రంగా ఖండించారు. అది పూర్తిగా ఏఐ జనరేటెడ్ వీడియో అని, తన రాజకీయ ఎదుగుదలను చూసి ఓర్వలేక టీఎంసీ ఈ కుట్రకు పాల్పడిందని ఆరోపించారు. మమతా బెనర్జీ, అభిషేక్ బెనర్జీ సహా పలువురు టీఎంసీ నేతలపై పరువు నష్టం దావా వేస్తానని హెచ్చరించారు. ఈ వివాదం నేపథ్యంలో ఎంఐఎం పార్టీ పొత్తును రద్దు చేసుకుం టున్నట్లు ప్రకటించింది.

# దేశానికి మూలం ఆదివాసులమే

### ఆదివాసీ సంస్కృతి రక్షణకు ప్రభుత్వం కట్టుబడి ఉంది: మంత్రి సీతక్క

**భద్రాచలం, ప్రభాతవార్త:** దేశానికి మూలవాసులు ఆదివాసులేనని, వారి ఆచారాలు, సంప్రదాయాలు, జీవన విధానాలను రాబోయే తరాలకు అందించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని తెలంగాణ రాష్ట్ర పంచాయతీరాజ్, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ (సీతక్క) పేర్కొన్నారు. శుక్రవారం భద్రాచలం ఐటిడిఏ ప్రాంగణంలోని గిరిజన భవనంలో నిర్వహించిన ఆదివాసి సాంస్కృతిక ఆత్మీయ సమ్మేళనం, కోయ ఇలవేల్పుల చరిత్ర గ్రంథావిష్కరణ కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. గిరిజన సంప్రదాయాలకు అనుగుణంగా ఘన స్వాగతం పలికిన అనంతరం చిన్నారులతో కలిసి సాంప్రదాయ నృత్యాల్లో పాల్గొన్నారు.



ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఆదివాసి సంస్కృతి, ఆచారాలు మన పూర్వీకుల నుండి వచ్చిన అమూల్య సంపద అని అన్నారు. వాటిని సంరక్షి ంచడం ద్వారా "దేశానికి మూలం ఆదివాసులం" అనే నినాదానికి సార్థకత చేకూరుతుందని తెలిపారు. కోయ తెగలోని పూజా విధానాలు, కులదేవతల విశ్వాసాలు, ఇలవేల్పుల పండుగలు వంటి అంశాలను లిఖితరూపంలో తీసుకురావడం గొప్ప విషయం అని కొనియాడారు. ఐటిడిఏ పీవో రాహుల్ ఆధ్వర్యంలో గిరిజన చరిత్ర సేకరణకు చేసిన కృషిని ఆమె ప్రత్యేకంగా అభినందించారు. గిరిజన ప్రాంతాల్లో పనిచేసే అధికారులు నిబద్ధతతో పనిచేస్తే ఆదివాసులు వారిని దేవుళ్లుగా భావిస్తారని అన్నారు. గిరిజన సంక్షేమం కోసం విద్య, వైద్యం, మౌలిక సదుపాయాలపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తోందని తెలిపారు. భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకటరావు మాట్లాడుతూ గిరిజన సంస్కృతి ప్రత్యేకతను కాపాడుకోవాల్సిన అవసరం ఉందన్నారు. కాలక్రమేణా కనుమరుగవుతున్న సంప్రదాయాలను పునరుద్ధరించడంలో ఐటిడిఏ కీలక పాత్ర పోషిస్తోందని తెలిపారు. ఐటిడిఏ పీవో బి. రాహుల్ మాట్లాడుతూ గిరిజన విద్యాభివృద్ధికి తీసుకున్న చర్యల వల్ల మంచి ఫలితాలు వచ్చాయని, విద్యార్థులు ఐఐటి వంటి ప్రతిష్టాత్మక సంస్థల్లో ఎంపికవుతున్నారని చెప్పారు. అలాగే గిరిజన రైతుల ఉత్పత్తులకు మార్కెట్ కల్పించేందుకు 'భద్రగిరి మార్క్' ఏర్పాటు చేసి మధ్యవర్తుల ప్రభావాన్ని తగ్గించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కోయ తెగకు సంబంధించిన ఇలవేల్పుల చరిత్ర గ్రంథాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పీవో రాహుల్‌కు "ఆదివాసి వికాసరత్న" బిరుదు ప్రదానం చేసి ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేలు, అధికారులు, గిరిజన పెద్దలు, వివిధ గ్రామాల ప్రజలు భారీగా పాల్గొన్నారు.

# రెండోవిడత రైతు భరోసా నిధుల సమీకరణకు కసరత్తు

### 22న పెట్టుబడి సాయం పంపిణీ

**హైదరాబాద్, ఏప్రిల్ 10, ప్రభాతవార్త:** యాసంగి సీజన్ రెండో విడత రైతు భరోసా కోసం నిధులను సమకూర్చుకోవడంలో రాష్ట్ర ప్రభుత్వ నిమగ్నమైంది. రెండోవిడత రైతు భరోసా పంపిణీ కోసం ఈ నెల 21న రూ.3వేల కోట్ల అప్పును తీసుకోనుంది. ఈ నిధుల నుంచి రెండో విడత రైతు భరోసాను చెల్లించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. రెండో దఫా కింద అయిదెకరాల వరకు సొమ్ము జమ చేయనుంది. రైతు భరోసా నిధులను మూడు విడతల్లో జమ చేస్తామని ప్రభుత్వం ఇప్పటికే ప్రకటించిన విషయం తెలిసిందే. గత నెలలో మొదటి విడతలో ఒక ఎకరం లోపు వరకు రైతుల ఖాతాల్లో ప్రభుత్వం జమ చేసింది. ఈనెల 22లోపు రెండో విడత నిధులను, ఈ నెలాఖరు లోపు మూడో విడత నిధులను రైతుల ఖాతాల్లో జమ చేయాలని అధికారులు కసరత్తు చేస్తున్నారు. వాస్తవానికి రైతు భరోసా స్కీంను ఒక సీజన్లో అమలు చేయడానికి రూ.9వేల కోట్లు పైచిలుకు నిధులు అవసరం అవుతాయని ప్రభుత్వం అంచనా వేసింది. రెండో విడతలో భాగంగా ఈనెల 7న ఒకేసారి ప్రభుత్వం రూ. 3,900 కోట్లు రుణ తీసుకుంది. ఈ నెల 21న మరో రూ.3వేల కోట్లు అప్పు తీసుకోనుంది. ఇక మూడో విడత ఈ నెలాఖరు వరకు జమ చేసే అవకాశాలున్నాయి.

# రాష్ట్ర జనాభాలో 86 శాతం మంది తెల్ల రేషన్‌కార్డుదారులే!

### స్పష్టం చేస్తున్న కేంద్ర ప్రభుత్వ గణాంకాలు

### జాతీయ ఆహార భద్రతా చట్టం కఠినంగా అమలుకు నిర్ణయం

### రేషన్‌కార్డుదారుల్లో అనర్హుల ఏరివేతపై ప్రత్యేక డ్రైవ్

**హైదరాబాద్, ఏప్రిల్ 10, ప్రభాతవార్త:** దేశంలో మరే రాష్ట్రంలో లేనివిధంగా రాష్ట్ర జనాభాలో దాదాపు 86 శాతం మంది తెలుపు రేషన్ కార్డు కలిగి ఉన్నారని కేంద్ర ప్రభుత్వ గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. ఈ నేపథ్యం లో తెలంగాణలో అనర్హులైన రేషన్‌కార్డుదారులపై కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టిసారించినట్లు తెలుస్తోంది. దారిద్ర్య రేఖకు దిగువనున్న పేద కుటుంబాలకు మాత్రమే రేషన్ సరకులు అందజేయాలన్న జాతీయ ఆహార భద్రతా చట్టం నిబంధనలను కచ్చితంగా అమలు చేయాలని నిర్ణయించింది. అనర్హులను వెంటనే గుర్తించి తొలగించాలని తాజా మార్గదర్శకాల్లో కేంద్ర వినియోగదారుల సంక్షేమం, ఆహార, ప్రజా పంపిణీ వ్యవవహారాల శాఖ తెలంగాణ పౌర సరఫరాల శాఖకు స్పష్టం చేసినట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలోనే కేంద్ర ప్రభుత్వ మార్గదర్శకాల కనుగుణంగా యుద్ధ ప్రాతిపదికన అనర్హులందరికీ రేషన్ కార్డు తొలగించేందుకు ప్రభుత్వం చర్యలు మొదలు పెట్టినట్టు సమాచారం. దీంతో తెలంగాణ రాష్ట్రంలో ఇప్పుడున్న రేషన్ కార్డు లబ్ధిదారుల్లో కనిష్ఠంగా కోటి మందికి కోత తప్పదని తెలుస్తోంది. తెలంగాణలో రేషన్ కార్డులు (ఫుడ్ సెక్యూరిటీ కార్డులు) సంఖ్య దాదాపు 1,05,42,188కు చేరుకుంది. ఈ కార్డుల ద్వారా 3.35 కోట్లు నుంచి 3.36 కోట్ల మంది లబ్ధిదారులు రేషన్ ప్రయోజనం పొందుతున్నారు. గత ఏడాది కాలంలోనే ప్రభుత్వం 14.40 లక్షలకుపైగా కొత్త రేషన్ కార్డులను జారీ చేసినట్లు సివిల్ సప్లయ్‌శాఖ అధికారులు వెల్లడించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇటీవల రేషన్ కార్డుల అనర్హులను ఏరివేస్తున్నాయి. అర్హత లేకపోయినా వివిధ మార్గాల్లో రేషన్ కార్డులు పొందిన వారిని గుర్తిస్తూ వెరిఫికేషన్‌లో అనర్హులుగా తేలినవారి రేషన్ కార్డులను అధికారులు రద్దు చేస్తున్నారు. ఇటీవల విచారణలో లక్ష మందికిపైగా అనర్హులను గుర్తించి రేషన్ కార్డు లను రద్దు చేశారు. హైదరాబాద్ నగరంలో 2 లక్షలమంది ఐటీ చెల్లింపు దారులు రేషన్‌కార్డులను కలిగి ఉన్నట్లు అధికారులు గుర్తించారు.

# సింగర్ మంగ్లీ, ఆమె సోదరుడిపై కేసు నమోదు

### మైక్రో ఫైనాన్స్ పేరిట రూ.10 కోట్ల మోసం

**హైదరాబాద్ (జూబ్లీహిల్స్), ఏప్రిల్ 10, ప్రభాతవార్త:** సింగర్ మంగ్లీ(సత్యవతి)తో పాటు అతని సోదరుడు, మరో ముగ్గురిపై పంజాగుట్ట ఠాణాలో కేసు నమోదైంది. ఆలస్యంగా వెలుగు చూసిన సంఘటన వివరాల్లోకి వెళితే.. అధిక లాభాల పేరుతో మైక్రోఫైనాన్స్ పథకాల్లో పెట్టుబడులు పెట్టించుకుని రామవత్ మధు, పాల్ అలియాస్ భారత్ చౌహాన్, పాల్ అలియాస్ శైలజా చౌహాన్, శివ(మంగ్లీ సత్యవతి సోదరుడు), మంగ్లీ అలియాస్ సత్యవతి కలిసి సుమారు రూ.9.5 నుంచి రూ.10 కోట్ల వరకు సేకరించారు. ఈ నిధులను గోకులానందన ఇన్‌ఫ్రా ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ పేరిట ఇంపోర్ట్, ఎక్స్‌పోర్ట్, రియల్ ఎస్టేట్, ట్రేడింగ్ వ్యాపారాల్లో పెట్టుబడి పెడతామని నమ్మించారు. ఇందులో భాగంగానే హేమకాంత్ రెడ్డి, మధుసూదన్ రెడ్డి, తిరుమల్ తదితరులు రూ. 10 కోట్ల మేర పెట్టుబడి పెట్టి ఇలానే మోసానికి గురవ్వడంతో తార్నాకలోని విజయపురి కాలనీకి చెందిన న్యాయవాది సింగపోగు సుబ్బారావును సంప్రదించారు. ఈ మేరకు సుబ్బారావు మంగ్లీని సంప్రదించగా ఆమె అనుచితంగా మాట్లాడారు. ఇదే విషయమై సుబ్బారావు మీడియాను ఆశ్రయించగా ఈ కేసులో తనను, తన సోదరుడిని చేర్చవద్దని సుబ్బారావుతో మంగ్లీ డబ్బు ఆఫర్ చేసినట్లు సుబ్బారావు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. తరువాత దర్శకుడు వేణు ఉడుగుల, అడ్వకేట్ పూజారి నాగేశ్వరరావు ద్వారా పంజాగుట్టలో సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఆ సమావేశంలో మంగ్లీ, వేణు ఉడుగుల, పూజారి నాగేశ్వరరావు, సంగీత దర్శకుడు సురేష్ బొబ్బిలి తదితరులు కేసు వేయవద్దని, మీడియా వీడియోలు తొలగించాలని ఒత్తిడి తెచ్చారు. సమావేశం ముగిసే సమయంలో వేణు ఉడుగుల వేణు తనను బెదిరించగా, మంగ్లీ అసభ్య పద జాలంతో దూషించి హత్య చేస్తామని బెదరించినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఫోన్ ద్వారా రామవత్ మధు, శివలు కూడా తీవ్రంగా బెదిరించినట్లు తెలిపారు. తనకు ప్రాణహాని ఉందని సుబ్బారావు పోలీసులను ఆశ్రయించగా బీఎన్ఎస్ సెక్షన్ 351(2), 352 కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# మధ్యప్రదేశ్‌లో బూతులరహిత గ్రామం

### మాట్లాడితే రూ.500 జరిమానా

### గ్రామంలో పెద్దల పంచాయితీ

**భోపాల్, ఏప్రిల్ 10:** అది పూర్తిగా బూతుల రహిత గ్రామం. ఆ గ్రామంలో బూతులు మాట్లాడ టంపై నిషేధం విధించారు. నిషేధాన్ని ఉల్లంఘించి ఎవరైనా బూతులు మాట్లాడితే వారికి ఏకంగా రూ.500 జరిమానా విధిస్తారు. ఈ మేరకు ఆ గ్రామ పంచాయతీ తీర్మానం కూడా ఉంది. పేద, ధనిక అనే తేడా లేకుండా అందరికీ ఈ నిబంధన వర్తిస్తుందని గ్రామ పెద్దలు చెప్పారు. సాధారణంగా గ్రామాల్లో అయినా, పట్టణాల్లో అయినా గొడవలు జరుగుంటాయి. ఈ గొడవల సందర్భంగా బూతులు కూడా దొర్లుతాయి. ఇలా బూతులు జారడంవల్ల చిన్న గొడవలు కూడా పెద్దవిగా మారుతాయి. అందుకే మధ్యప్రదేశ్ రాష్ట్రం బుర్హాన్‌పూర్ జిల్లాలోని




బోర్‌సర్ గ్రామంలో బూతులపై పూర్తిగా నిషేధం విధించారు.

నిషేధాన్ని ఎవరైనా ఉల్లంఘిస్తే రూ.500 జరిమానా విధించనున్నట్లు ప్రకటిం చారు. బుర్హాన్ పూర్ జిల్లా కేంద్రానికి 20 కిలోమీటర్ల దూరాన ఉన్న ఈ గ్రామంలో 6 వేల మంది జనాభా ఉంటారు. గ్రామంలో ధనిక, పేద తేడా లేకుండా ఎవరు బూతులు మాట్లాడినా రూ.500 జరిమానా విధిస్తారు. ఒకవేళ జరిమానా కట్టకపోతే గంటసేపు గ్రామంలో పారిశుధ్య పనులు చేయాల్సి ఉంటుంది. ఈ మేరకు గ్రామమంతా పోస్టర్లు వేయించి ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. కాగా, బూతులతో గొడవలు పెద్దవి చేసుకోకుండా ప్రజలందరికీ అవగాహన కల్పిస్తున్నామని, ప్రత్యేక బృందాలతో పర్యవేక్షణ చేయిస్తున్నామని సర్పంచి అంతర్‌సింగ్ తెలిపారు.

# బెంగాల్‌ను సోనార్ బంగ్లాగా మార్చేస్తాం

### పశ్చిమబెంగాల్ ఎన్నికలకు బిజెపి మేనిఫెస్టో

**కోల్‌కతా, ఏప్రిల్ 10:** పశ్చిమబెంగాల్ అసెంబ్లీ ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా బీజేపీ శుక్రవారం విడుదల చేసిన తన మేనిఫెస్టోలో ఓటర్లకు పలు తాయిలాలు ప్రకటించింది. బీజేపీ అధికారంలోకి వస్తే చొరబాటుదారులపై కఠిన వైఖరి అవలంబిస్తామని, రాష్ట్రంలోని ప్రతి మహిళకు, నిరుద్యోగ యువతకు నెలకు రూ.3000 చొప్పున ఆర్థిక సాయం అందిస్తామని హామీ ఇచ్చింది. ప్రభుత్వ పగ్గాలు చేపట్టిన 45 రోజుల్లోనే రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల కోసం ఏడో వేతన సంఘం ఏర్పాటు చేస్తామని పేర్కొంది. ఈ సందర్భంగా కేంద్ర హోంమంత్రి అమిత్‌షా, బీజేపీ సంకల్ప పత్రం విడుదలచేసారు. బంగాల్ సంస కృతిని చూసి గర్వపడే ప్రతి పౌరుడికి ఇది సరికొత్త ఆశలు కల్పిస్తుందన్నారు. బంగారు బెంగాల్ సృష్టికి ఒక రోడ్‌మ్యాప్ అని పేర్కొన్నారు. పోలీస్ ఫోర్స్‌తో సహా అన్ని ప్రభుత్వ ఉద్యోగాల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని పేర్కొన్నారు. చొరబాట్లను, సరిహద్దు భద్రతను ప్రధాన ఎన్నికల అంశాలుగా బీజేపీ పరిగణిస్తోంది. చొరబాటుదారులపై డిటెక్ట్, డిలీట్, డిపోర్ట్ అనే విధానాన్ని అనుసరిస్తామని బీజేపీ స్పష్టం చేసింది. అవినీతి రహిత పాలన కోసం క్షేత్రస్థాయిలో సిండికేట్ ప్రభుత్వ ఉద్యోగుల కోసం, పెండింగ్‌లో ఉన్న కరవు భత్యం (డీఏ) చెల్లింపు చేస్తామని హామీ ఇచ్చింది. నిర్ణీత గడువులోగా 7వ వేతన సంఘాన్ని ఏర్పాటు చేస్తామని పేర్కొంది. వచ్చే ఐదేళ్లలో ఒక కోటి ఉద్యోగాలు, స్వయం ఉపాధి అవకాశాలు కల్పిస్తామని పేర్కొంది. నిరుద్యోగ యువతకు నెలవారీగా రూ.3000 భృతిని, పోటీ పరీక్షలకు సన్నద్ధం కావడానికి అదనంగా రూ.15వేలు ఆర్థిక సాయం అందిస్తామని హామీ ఇచ్చింది. ఉపాధ్యాయ నియామకాల కుంభకోణం వల్ల, ఇతర అవినీతి సంబంధిత కేసుల కారణంగా ఉద్యోగాలు కోల్పోయిన వారికి, గరిష్ఠంగా 5 ఏళ్లపాటు వయోపరిమితి సడలింపు కల్పిస్తామని మహిళా పోలీసు బెటాలియన్ల ఏర్పాటు చేస్తామని, దుర్గా సురక్షా సహాయ్ పథకం అమలు చేస్తామని పేర్కొంది. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగాల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని హామీ ఇచ్చింది. కుర్మాలి, రాజ్‌బన్షీ భాషలను రాజ్యాంగంలోని ఎనిమిదో షెడ్యూల్‌లో చేర్చాలని ప్రతిపాదించింది. రైతుల ఆదాయాన్ని పెంచడానికి



వరి, బంగాళాదుంప, మామిడి వంటి పంటలకు మద్దతు ధర మరింత పెంచుతామని వాగ్దానం చేసింది. మత్స్యకారుల కోసం పీఎం మత్స్య సంపద యోజన కింద నమోదు చేస్తామని, బెంగాల్‌ను సముద్ర ఉత్పత్తుల ఎగుమతి హబ్‌గా మార్చడమే తమ లక్ష్యమని పేర్కొంది. ఉమ్మడి పౌరస్మృతి (యూసీసీ) అమలు చేయడం, పశువుల స్మగ్లింగ్ అరికట్టడానికి కఠిన చట్టాలను తీసుకొస్తామని టీ తోటలను పునరుద్ధరించడం, డార్జిలింగ్ టీ బ్రాండ్‌ను మరింత బలోపేతం చేయడం, జనపనార (జూట్) పరిశ్రమలను ఆధునీకరించే ప్రణాళికలు చేపడతా మన్నారు. ఆయుష్మాన్ భారత్ , ఇతర కేంద్ర పథకాల అమలు చేస్తామని పేర్కొంది.

# మేక అవయవాలు, వ్యర్థాలు నిల్వ ఉంచిన ఇండస్ట్రీపై దాడులు

### 1,150 కిలోల తలలు, కాళ్లు ఇతరాల స్వాధీనం

**హైదరాబాద్ (సరూర్‌నగర్), ఏప్రిల్ 10, ప్రభాతవార్త:** హైదరాబాద్ పోలీస్ కమీషనరేట్ పరిధిలోని బాలాపూర్ మదీనా హిల్స్‌లో నిబంధనలకు విరుద్ధంగా అక్రమంగా 1,150 కిలోల కొద్దీ మేక తలలు, ఇతర వ్యర్థాలను నిల్వ ఉంచిన సలామి ఇండస్ట్రీపై పోలీసులు దాడులు చేశారు. సంబంధిత జిహెచ్ఎంసి వెటర్నరీ అండ్ ఫుడ్ సేఫ్టీ విభాగం అధికారులతో కలిసి దాడులు చేసి అక్కడ అపరిశుభ్ర వాతావరణంలో రోజులు, నెలల తరబడి నిల్వ ఉంచిన వివిధ రకాల మేక వ్యర్థాల (అవయవాలను) స్వాధీనం చేసుకున్నారు. వివరాల్లోకి వెళ్తే.. బాలాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని మదీనా కాలనీలో ఉన్న సలామీ ఇండస్ట్రీస్‌లో భారీ ఎత్తున మేక తలలు, కాళ్లు, బోటి, లివర్ తదితర వాటిని అక్రమంగా నిల్వ చేసి ఉంచారనే సమాచారం మేరకు పోలీసులు శుక్రవారం ఆకస్మిక దాడులు చేశారు. జిహెచ్ఎంసి వెటర్నరీ ఫుడ్ సేఫ్టీ విభాగం అధికారులు, సిబ్బందితో కలిసి చేసిన దాడుల్లో విస్తుపోయే నిజాలు వెలికి చూశాయి. చాలా పెద్ద మొత్తంలో కార్టూన్లలో, ప్లాస్టిక్ సంచుల్లో, కవర్లలో నిల్వ చేసిన మేక అవయవాలు కనిపించాయి. వీటిని బయట ప్రాంతాలకు ఎగుమతులు చేయడంతో పాటు ఫంక్షన్లు తదితర వాటికి సరఫరా చేసే వారని తెలుస్తోంది. అయితే దాడులు చేసి స్వాధీనం చేసుకున్న వాటిని జిహెచ్ఎంసి అధికారులు తరలించారు. కాగా చేసిన నిబంధనలకు విరుద్ధంగా ఉన్న స్టోరేజీ, అక్రమ నిల్వలు, చేసిన దాడులు, ఎంత మొత్తంలో అక్రమ మేక అవయవాలు, వ్యర్థాల నిల్వల విషయమై సమాచారం ఇచ్చే విషయంలో ఇన్స్‌పెక్టర్ సుధాకర్ స్పందించలేదు.



స్వాధీనం చేసుకున్న వాటిని తరలిస్తున్న జిహెచ్ఎంసి సిబ్బంది

# మోడల్ స్కూల్ ప్రవేశపరీక్ష హాల్ టికెట్స్ విడుదల

### 19న ఎంట్రన్స్ టెస్ట్

**హైదరాబాద్, ఏప్రిల్ 10, ప్రభాతవార్త:** రాష్ట్రంలో కొనసాగుతున్న 194 మోడల్ స్కూల్స్‌లో 6వ తరగతిలో ప్రవేశాలతోపాటు, 7 నుంచి 10వ తరగతి వరకు ఉన్న ఖాళీల్లో సీట్లను భర్తీ చేయడం కోసం నిర్వహించే తెలంగాణ స్టేట్ మోడల్ స్కూల్స్ అడ్మిషన్ టెస్ట్‌కి సంబంధించిన హాల్ టికెట్లు విడుదలయ్యాయి. హాల్ టికెట్లను శుక్రవారం వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచినట్టు మోడల్ స్కూల్స్ అడిషనల్ డైరెక్టర్ శ్రీనివాసాచారి ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా దరఖాస్తు గడువు ముగిసేనాటికి 37,215 మంది దరఖాస్తు చేసుకున్నారు. దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు తమ హాల్ టికెట్లను శుక్రవారం నుంచి డౌన్‌లోడ్ చేసుకోవడానికి అవకాశం కల్పించారు. 6వ తరగతిలో ప్రవేశాల కోసం 23,957 మంది, 7వ తరగతిలో ప్రవేశాలకు 5117, 8వ తరగతిలో చేరడానికి 4709 మంది, 9వ తరగతిలో చేరడానికి 2820 మంది, 10వ తరగతిలో చేరడానికి 612 మంది దరఖాస్తు చేసుకున్నారు. 6వ తరగతిలో ప్రవేశాల కోసం ఈ నెల 19న ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్షను నిర్వహించనున్నారు.




# నేపాల్‌లో మళ్లీ పెరిగిన పెట్రోలు ధరలు

**కఠ్మాండు, ఏప్రిల్ 10:** మధ్యప్రాచ్యంలో కొనసాగుతున్న ఉద్రిక్తతలు, అమెరికాఇరాన్ మధ్య పెరిగిన ఉద్రిక్త పరిస్థితుల ప్రభావం పొరుగు దేశమైన నేపాల్‌పై తీవ్రంగా పడుతోంది. ఈ ప్రభావంతో నేపాల్‌లో ఇంధన ధరలు వరుసగా నాలుగోసారి పెరగడం గమనార్హం. కేవలం రెండు నెలల వ్యవధిలోనే పెట్రోల్, డీజిల్ ధరలు గణనీయంగా పెరిగాయి. తాజా పెంపుతో నేపాల్‌లో లీటరు పెట్రోల్ ధర రూ.216.50కు చేరగా, డీజిల్ ధర రూ.204.50గా నమోదైంది. ఈసారి పెట్రోల్‌పై రూ.17, డీజిల్‌పై రూ.25 పెంపు అమల్లోకి వచ్చింది. అర్ధరాత్రి నుంచి ఈ కొత్త ధరలు అమలులోకి వచ్చాయి. నేపాల్ ఆయిల్ కార్పొరేషన్ ప్రకారం, అంతర్జాతీయ మార్కెట్‌లో చమురు ధరలు పెరగడం వల్లే ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించింది. చమురు దిగుమతులపై భారీ వ్యయం పెరగడంతో ప్రభుత్వం ఆర్థిక ఒత్తిడిని ఎదుర్కొంటోంది. ప్రస్తుతం ఇంధన ధరల కారణంగా కోట్ల రూపాయల నష్టం వాటిల్లుతోందని అంచనా వేస్తున్నారు. గత రెండు నెలల్లోనే నాలుగు సార్లు ధరలు పెరగడం ప్రజలపై భారంగా మారింది. మార్చి 1న రూ.157గా ఉన్న పెట్రోల్ ధర, ఇప్పుడు రూ.216 దాటడం పరిస్థితి తీవ్రతను సూచిస్తోంది. డీజిల్ ధరలు కూడా ఇదే విధంగా పెరిగాయి. ఇంధన ధరల పెరుగుదలతో నేపాల్ ప్రభుత్వం భారీ నష్టాలను ఎదుర్కొనే వినియోగదారులు సహకరిం చాలని నేపాల్ ఆయిల్ కార్పొరేషన్ విజ్ఞప్తి చేసింది. ఇక ఆసక్తికరంగా, నేపాల్‌తో పోలిస్తే భారతదేశంలోని బీహార్ రాష్ట్రంలోని రక్సౌల్ ప్రాంతంలో ఇంధన ధరలు తక్కువగా ఉన్నాయి. దీంతో సరిహద్దు ప్రాంతాల్లో ధరల వ్యత్యాసం స్పష్టంగా కనిపిస్తోంది.

# మీ సేవ వాట్సాప్‌లో స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ సేవలు

**హైదరాబాద్, ఏప్రిల్ 10, ప్రభాతవార్త:** డిజిటల్ సేవల్లో తెలంగాణ ప్రభుత్వం మరో కీలక ముందడుగు వేసింది. రిజిస్ట్రేషన్స్, స్టాంప్స్ విభాగం సేవలను వాట్సాప్ ద్వారా మొబైల్ ఫోన్‌లో పొందే అవకాశం అందుబాటులోకి తెచ్చింది. ఈ మేరకు మీసేవ కమిషనర్ టి.రవికిరణ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ కార్యాలయానికి వెళ్లాల్సిన అవసరం లేకుండా ఎక్కడ నుంచైనా భూమి సంబంధిత వివరాలను డౌన్ లోడ్ చేసుకోవచ్చని పేర్కొన్నారు. ప్రభుత్వ సేవలన్నీ డిజిటల్ రూపంలో సులభంగా అందుబాటులోకి తీసుకురావాలన్న రాష్ట్ర ఐటీ, పరిశ్రమల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ఆదేశాల మేరకు గత ఏడాది నవంబర్‌లో ప్రారంభించిన మీసేవ వాట్సాప్/చాట్‌బాట్ సేవలు రాష్ట్రంలో అత్యంత ప్రజాదరణ పొందాయని తెలిపారు. మీసేవ వాట్సాప్ నంబర్ 8096958096 ద్వారా రిజిస్ట్రేషన్ పత్రం, సర్టిఫైడ్ కాపీ, ఎన్ కంబరెన్స్ సర్టిఫికెట్, స్టాంప్‌ల కొనుగోలు, ఫ్రాంకింగ్, డెఫిసిట్, సొసైటీలు, సమాచార హక్కు దరఖాస్తు, ఫర్మ్‌లు, అపరాధ రుసుం చెల్లింపు తదితర సేవలు అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. 8096958096 నంబర్‌ను ఫోన్‌లో సేవ్ చేసుకుని, వాట్సాప్‌లో హాయ్ అని మెస్సేజ్ పంపించాలని, ఆ తర్వాత కావలసిన సేవ పేరు టైప్ చేసి, ఫామ్ నింపి, ఆన్‌లైన్‌లో చెల్లింపు పూర్తిచేయొచ్చని సూచించారు. పెనాల్టీ, డెఫిసిట్, స్టాంప్స్ వంటి సేవల్లో చెల్లింపు తర్వాత సంబంధిత సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో పత్రాలు స్వీకరించవచ్చని తెలిపారు. ఈసి మీసేవా కేంద్రంలో అందుతుందని.. సర్టిఫైడ్ కాపీ మాత్రం ఆమోదం తర్వాత నేరుగా వాట్సాప్‌లోనే చేరతాయని వెల్లడించారు.

# అంబేద్కర్ జయంతికి ఎస్ఎస్‌సి మూల్యాంకనం కేంద్రాలకు సెలవు మంజూరు చేయాలి

### పాఠశాల విద్య డైరెక్టర్‌కు బిటిఎ విజ్ఞప్తి

**హైదరాబాద్, ఏప్రిల్ 10, ప్రభాతవార్త:** రాష్ట్రంలో కొనసాగుతున్న ఎస్ఎస్‌సి మూల్యాంకనంలో అంబేద్కర్ జయంతి రోజున సెలవు ప్రకటించాలని బహుజన టీచర్స్ ఫెడరేషన్(బీటీఏ) డిమాండ్ చేసింది. ఈ మేరకు సంఘం రాష్ట్ర అధ్యక్షులు కల్పదర్శి చైతన్య శుక్రవారం పాఠశాల విద్య డైరెక్టర్ నవీన్ నికోలస్‌ని కలిసి విజ్ఞప్తి చేశారు. భారత రాజ్యాంగ నిర్మాత అయిన డాక్టర్ బాబా సాహెబ్ బీఆర్ అంబేద్కర్ జయంతి అయిన ఏప్రిల్ 14కి పదవ తరగతి మూల్యాకణం కేంద్రాలకు సెలవు మంజూరు చేయాలనీ కోరారు. అంబేద్కర్ జయంతిని పురస్కరించుకొని భారత ప్రభుత్వంతోపాటు రాష్ట్ర ప్రభుత్వం కూడా సాధారణ సెలవును ప్రకటించిన విషయాన్ని గుర్తు చేశారు. విద్యా శాఖ పదవ తరగతి మూల్యాకణం పేరుతో ఉపాధ్యాయులకు అంబేద్కర్ జయంతి రోజున సెలవును నిరాకరించడం బాబా సాహెబ్ అంబేద్కర్‌ను అవమాన పరచడమే అవుతుందన్నారు. కాబట్టి ఎస్ఎస్‌సి మూల్యాంకణం కేంద్రాలలో అంబేద్కర్ జయంతి రోజున సెలవును ప్రకటించాలని డిమాండ్ చేశారు. అందుకు స్పందించిన పాఠశాల విద్య డైరెక్టర్ నవీన్ నికోలస్ ..తప్పకుండ సెలవును మంజూరు చేస్తామని హామీ ఇచ్చిరని చైతన్య తెలిపారు.

# 30 నుండి మే 02 వరకు తిరుచానూరులో పద్మావతి అమ్మవారి వసంతోత్సవాలు



**తిరుమల, ఏప్రిల్ 10 ప్రభాత వార్త ప్రతినిధి:** తిరుమల ఆలయం తరహాలో తిరుచానూరు పద్మావతి అమ్మవారి ఆల యంలో వార్షిక వసం తోత్స వాలు ఈనెల 30 నుండి మే 02వ తేదీ వరకు భక్తి, వైభవంగా నిర్వహించ నున్నారు. ఉత్స వాలకు ముందు 29న సాయంత్రం 6 గంటలకు అంకురార్పణ కార్యక్రమం జరగనుంది. భక్తులు ఒక్కొక్కరు 150 రూపాయలు చెల్లించి వసంతోత్సవ సేవలో పాల్గొని అమ్మవారి అనుగ్రహాన్ని పొందవచ్చు. ఉత్సవాల్లో భాగంగా మే 1వ తేదీ ఉదయం 9.30 గంటలకు స్వర్ణ రథోత్సవం కన్నులపండువగా జరుగనుంది. మూడు రోజుల పాటు మధ్యాహ్నం 2.30 నుండి సాయంత్రం 4.30 గంటల వరకు శుక్రవారపు తోటలో అమ్మవారి ఉత్సవమూర్తులకు స్నపన తిరుమంజనం నిర్వహించ బడుతుంది. రాత్రి 7.30 నుండి 8.30 గంటల వరకు ఆలయ నాలుగు మాడ వీధుల్లో అమ్మవారు విహరించి భక్తులకు దర్శనమిస్తూ కటాక్షి స్తారు. ఈనెల 28న వసంతోత్సవాలను పురస్క రించుకుని కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం విశేషంగా నిర్వహించనున్నారు. ఈరోజు ఉదయం సుప్రభాతంతో అమ్మవారిని మేల్కొలిపి, ఉదయం 6 గంటల నుండి 9 గంటల వరకు ఆలయ శుద్ధి కార్యక్రమం చేపడతారు. ఆలయ ప్రాంగణం, గోడలు, పైకప్పు, పూజా సామగ్రి మొదలైనవన్నీ పవిత్రజలంతో శుద్ధి చేయబడతాయి. నామకోపు, శ్రీచూర్ణం, కస్తూరి పసుపు, పచ్చాకు, గడ్డ కర్పూరం, గంధం పొడి, కుంకుమ, కిచీలీగడ్డ వంటి సుగంధ ద్రవ్యాలతో కలిపిన పవిత్ర జలాన్ని ఆలయం అంతటా ప్రోక్షణం చేస్తారు. అనంతరం ఉదయం 9 గంటల నుండి భక్తులకు దర్శనానికి అనుమతి ఇస్తారు.


వార్త

గడిచేదానికి, గడవబోయే దానికి చింతించకుండా వర్తమానాన్ని ఆలోచించేవాడు అభివృద్ధిని సాధిస్తాడు.

- ఇ. గిబ్బన్

# అ'విశ్రాంత' పోరాటమేనా!

ఎంతో ఉత్సాహంగా జీవితగమనంలో అడుగు పెట్టిన వారు ఉద్యోగ కాలం పూర్తయి రిటైరయ్యాక తమకొచ్చే ప్రయోజనాల కోసం ప్రభుత్వ దయాదాక్షిణ్యాలపై ఆధారపడడం ఈనాటిది కాదు. వారి ప్రయోజనాలను వారు అనుభవించడంలో ఎన్నో చిక్కులు ఎదురౌతుంటాయి. తమ ముందుకొచ్చే ఎందరో ఫైళ్లను క్లియర్ చేసి, ఎన్నో సమస్యలకు పరిష్కారం చూపిన ఉద్యోగులే కాలక్రమంలో తమ రిటైర్మెంట్ ప్రయోజనాల కోసం తపించాల్సి వస్తోంది. తాజాగా తెలంగాణలోని విశ్రాంత ప్రభుత్వోద్యోగులు తమకు రావాల్సినబకాయిల ప్రయోజనాల కోసం హైకోర్టు మెట్లెక్కారు. ఏ ఒక్కరో కాదు మూకుమ్మడిగా 754 పిటిషన్లు హైకోర్టును చేరాయి. ఒక్కొక్క పిటిషన్‌లోనూ కనీసం పది మందైనా విశ్రాంత ఉద్యోగుల ఆవేదన ఉండే అవకాశముంది. వీరిలో వివిధశాఖల నుంచి రిటైరైన పోలీసులు, టీచర్లు,ఇంజినీర్లు, ఇతర విభాగాలస్థాయిల విశ్రాంత ఉద్యోగులున్నారు. రిటైర్డు ఉద్యోగుల గౌరవం కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని, వారికివ్వాల్సిన ప్రయోజనాలన్నీ ప్రభుత్వం వద్ద వారు దాచుకున్న వారి సొమ్మేనని తెలంగాణ హైకోర్టు తీవ్ర స్వరంతో ప్రభుత్వానికి తగు ఆదేశాలిచ్చింది. ఎట్టి పరిస్థితుల్లోనూ వారి ఆర్జిత ప్రయోజనాలను వారి కంద్వివడంలో ఎలాంటి జాప్యం కూడదంటూ హైకోర్టు ఎన్నో విషయాలు వివరిస్తూ ప్రభుత్వానికి హితవు చెప్పింది. బకాయిల కోసం ఎదురు చూస్తూ ఎంతో మంది విశ్రాంత ఉద్యోగులు మరణించారు. ఇంకా జాప్యం జరగడం మంచిది కాదంటూ కోర్టు అసంతృప్తి వ్యక్తం చేసింది. ప్రభుత్వాల తక్షణ స్పందన అవసరమైన విషయాల్లో కోర్టులు జోక్యం చేసుకోవాల్సి రావడం పాలనా వైఫల్యం అనిపించుకుంటుంది. ప్రభుత్వమే మళ్లీ మళ్లీ విచారణతో ఆలస్యం చేయడం కోసం గడువుకోరడం సమంజసం కాదని పేర్కొంది. సర్వీసులో ఉన్నవారికి ప్రయోజనాలందించే విషయంలో ప్రభుత్వం వెసులుబాటు అడిగినా అర్థంఉందని ప్రభుత్వ కొలువుల నుంచి విశ్రాంత ఉద్యోగులుగా బయటనున్న వారిని ఇబ్బంది పెట్టడం సహేతుకం కాదని హైకోర్టు చెప్పింది.'ఇంకెంత కాలం జాప్యం చేస్తారని మరో గడువు ఇచ్చేందుకు హైకోర్టు ససేమిరా అంది. దాదాపు 4వేల మంది విశ్రాంత ఉద్యోగులకు ప్రయోజనాలు చెల్లించామన్నా కోర్టు సంతృప్తి చెందలేదు. చిట్టచివరి విశ్రాంత ఉద్యోగి జూన్ 10వ తేదీ నాటికి తమకు ప్రయోజనాలు అందలేదన్న మాట వినిపించనీయకూడదని హైకోర్టు ఎంతో దృఢనిశ్చయంతో ఆదేశాలిచ్చింది. బకాయిలు విడుదలైనందునే చాలా మంది న్యాయవాదులు తమ కక్షిదారుల తరపున హాజరు కాలేదంటున్న ఏ వాదననూ కోర్టు అంగీకరించే పరిస్థితి లేదు. ఇలాంటి వ్యర్థపు వాదనలతో జరిగే కాలక్షేపాన్ని కోర్టు అంగీకరించలేదు. విశ్రాంత ఉద్యోగులకు సంబంధించి నిర్దిష్ట సమాచారాన్నివ్వాలని ప్రభుత్వాన్ని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ నామవరపు రాజేశ్వరరావు ధర్మాసనం కోరింది. ఏప్రిల్ 9నాటికి మొత్తం బకాయిలు చెల్లించాలని లేకపోతే ఆర్థిక శాఖ ముఖ్యకార్యదర్శి ప్రత్యక్షంగా హాజరు కావలసి ఉంటుందని న్యాయమూర్తి స్పష్టమైన ఆదేశాలిచ్చారు. రేపు ఏం జరుగుతుందో చెప్పే పరిస్థితి ఈ రోజే చెప్పగలిగే పరిస్థితి ప్రభుత్వ ట్రెజరీ విషయంలో ఉండకపోవచ్చు. కనుక విశ్రాంత ఉద్యోగుల ప్రయోజనాల విషయంలో కోర్టు తీర్పు వెలువడిన వెంటనే ప్రభుత్వం సత్వర న్యాయం తీసుకునే దిశగా కదలాల్సిందే. ఇదే స్థాయిలో రిటైర్మెంట్ ఉద్యోగులకు ఎప్పటికప్పుడు బిల్లులను మంజూరు చేయగలిగిన పరిస్థితికి ఎదగాలి. ఒక్క విశ్రాంత ఉద్యోగికి ప్రయోజనాలు ఆపినా ఉన్నతాధికారి కోర్టు ఎదుట వ్యక్తిగతంగా హాజరు కావల్సిందే. ఈ ఆదేశాలతో అధికారులు వేగంగా తమ బాధ్యతలను నెరవేరుస్తారని ఆశిద్దాం. వివిధ ప్రభుత్వ శాఖల్లో పదవీ విరమణ చేసిన ఉద్యోగులకు పెన్షన్, జిపిఎఫ్,ఆర్జిత సెలవులుగ్రాట్యూటీ, గ్రూపు ఇన్సూరెన్స్ ప్రయోజనాలు మొత్తం కూడగడితే కోట్లాది రూపాయల మేర ఉంటుంది. టోకెన్ల జారీలో జరిగిన వ్యత్యాసాల వలన మరో కొన్ని సందర్భాలలో కొంత మందికి ప్రయోజనాలు అందించలేకపోయినట్లు ప్రభుత్వమే ఒప్పుకొంది. కాగా కోర్టు వాయిదాలను అలుసుగా తీసుకోవద్దని ఏ విశ్రాంత అధికారీ ప్రభుత్వదయాదాక్షిణ్యాల కోసం ఎదురు చూడరాదని కోర్టు హెచ్చరించింది.ఇలాంటి వివాదాలు ప్రతిసారి కోర్టులకు చేరకుండా ప్రభుత్వ నిర్దిష్ట విధానాలను రూపొందించుకోవాలి. అంటే ఏఉద్యోగి అయినా రిటైర్మెంట్ అయిన రోజునే తన ఆర్థిక ప్రయోజనాలతోనే ఇంటికి చేరుకోవాలి. అలా చేసిన రోజున ప్రభుత్వంపై విశ్రాంత ఉద్యోగుల్నించి ఎలాంటి సమస్యలూ ఎదురుకావు. ఇలా చేస్తేవిశ్రాంత ఉద్యోగులు తమ విశ్రాంత జీవనాన్ని ఎంతో హాయిగా హుందాగా ప్రారంభించగలుగుతారు. పదవీ విరమణ ప్రతిఉద్యోగి జీవితంలో అతి కీలకదశ. ఆ దశలో వారిని సజీవంగా ఉన్న నిర్జీవులుగా మార్చడం ఏ వ్యవస్థకైనా మంచిది కాదు. నియంత్రణ లేకుండా వ్యవస్థలు నడుస్తున్నప్పుడు మాత్రమే ఇలాంటి సమస్యలు తలెత్తుతుంటాయి. విధాన రూపకల్పన, సత్వర అమలు ఉన్న చోట్ల ఉద్యోగులు తమ సమస్యల పరిష్కారం కోసం కోర్టుల గడప ఎక్కడం విచారకరం. విశ్రాంత ఉద్యోగుల ఎదుర్కొనే ఆర్థిక, అనిశ్చితి, ఒత్తిడి, వార్థక్యపు అంచుకు చేరుకున్న వారి మానసిక పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వాలు నిర్ణయం తీసుకోవడం మేలు. విశ్రాంత ఉద్యోగుల్లో వైరాగ్యం తలెత్తకుండా హైకోర్టు తన అసహనాన్ని వ్యక్తం చేస్తూనే వారి సమస్య తీర్చే మార్గాన్ని అన్వేషించడం ఆహ్వానించదగిన సందర్భం.



అవసరం, అవకాశం అనేవి పిరికిపందను కూడా సాహసిగా మారుస్తాయి.

ఆస్కార్‌వైల్డ్



తమ కాళ్ల మూలంగా పక్షులు వలలో చిక్కుకుంటాయి. అలాగే తమ మాటల మూలంగానే మనుషులు చిక్కుల్లో ఇరుక్కుంటారు.

జేమ్స్ థైల్

# ప్రజావాక్కు

## భారత్‌లో గోప్యత ఎక్కడ?

డిజిటల్ యుగంలో ఆర్థిక వ్యవస్థ వేగంగా మారిపోతున్నది. నగదు లావాదేవీల స్థానంలో డిజిటల్ చెల్లింపులు ప్రాముఖ్యత పొందుతున్నాయి.యూపీఐ,మొబైల్ వాలెట్లు, ఇంటర్నెట్ బ్యాంకింగ్ వంటి సౌకర్యాలు సాధారణ ప్రజల దైనందిన జీవితంలో భాగమయ్యాయి. ఈ నేపథ్యంలో డిజిటల్ లావాదేవీలపై ప్రభుత్వ నజర్ పెరగడంసహజమే.అయితే ఇదిప్రజల ప్రయోజనాలకు ఎంత వరకు అనుకూలం? లేదా వ్యక్తిగత గోప్యతకు ముప్పు కలిగించే అంశమా?అనే ప్రశ్నలుప్రస్తుతానికి చర్చనీయాంశంగా మారాయి. మొదటగా, ప్రభుత్వ నజర్ వెనక ఉన్నఉద్దేశాన్ని పరిశీలిస్తే,ఆర్థిక పారదర్శకతను పెంచడం ప్రధాన లక్ష్యంగాకనిపిస్తుంది.డిజిటల్ లావాదేవీలు ట్రాక్ చేయగలిగినవిగా ఉండటం వల్ల నల్లధనం నియంత్రణకు ఇది ఉపయోగపడుతుంది.

- టి. శ్రీనివాస్, చొప్పదండి

## బానిసలు

బానిసలు దశాబ్దాల క్రితం అంటే 60–70 ఏళ్ల క్రితం భార్యల భర్తమాటకు ఎదురు చెప్పేవారు కాదు. తిట్టినా, కొట్టినా భరించేవారు. భర్త కాళ్ల దగ్గర పడి ఉండేవారు అప్పట్లో.ఆడవారికి చదువు ఉండేది కాదు. బయటకి వెళ్లి పనిచేసే పరిస్థితులు ఉండేవికావు.గతిలేక అలా ఉండేవారు.అలానేభాస్వాములు.ధనవంతులుమోతుబరి రైతుల వద్ద ఉండే నౌకర్లు. పాలేర్లు అతి తక్కువ జీతానికి పనిచేసేవారు. ఈ మధ్య కొందరు రాజకీయ నాయకులు పదవుల కోసం,అధికారం కోసంఅత్యున్నతహోదాలో పని చేస్తున్నవారి పక్కన చేరి వారి ద్వారా అధికారాన్ని పదవులను పొందుతున్నారు. వారు చెప్పినట్టు నడుచుకోవడం తప్ప వారికి మరో దారి లేదు.

- రాశి, హైదరాబాద్

## ఉచిత వాష్‌రూమ్స్ ఏర్పాటు చేయాలి

ఏపిలో మహిళలకు ఉచిత ఆర్టీసీ సౌకర్యం కలిగించారు సంతోషం. ఐతే బస్సులో నుండి దిగి మూత్రానికి వెళ్లాలంటేఏపీఆర్టీసీ బస్టాండులలోఐదురూపాయలు రుసుము చెల్లించాలి. పురుషులు,మహిళలు ఐదురూపాయలు కట్టాల్సిందే.టాయిలెటుకు వెళ్లితే ఐదు రూపాయలా అంటూ ప్రయాణికులు ఆశ్చర్యపోతున్నారు. సినిమాహాల్స్‌లో, హోటల్స్‌లో ఉచితం.మరి టికెట్‌కొనిప్రయాణించే బస్టాండ్లలో రుసుము ఏమిటి? తెలంగాణలో తాటి కాయంత అక్షరాలతో ఉచిత టాయిలెట్లు అని రాసి ఉంటుంది.

- నార్నె వెంకటసుబ్బయ్య, ప్రకాశం జిల్లా

## వృద్ధనేతలు ఇంకా ఎందుకు?

ఎన్నికల షెడ్యూల్ వెలుపడటమే తరువాయి పోటీ చేసేందుకు తమకె అవకాశం ఇవ్వాలని మొండిపట్టు పట్టేవారు సైతం పైరవీలు చేసేవారు పార్టీ పెద్దలను కాకా పడుతూ వారి చుట్టు తిరిగేవారు ఇలాంటి రాజకీయ నాయకులు ఈ రోజుల్లో చాలామంది ఉంటున్నారు.వీరు వయసులో చిన్నవారు కారు, చట్టసభలకు ఎన్నిక అవని వారూ కాదు. సీనియర్లు ఎంతో కాలంగా పార్టీకి సేవ చేస్తున్నవారు కదా అని అధిష్టానం వీరికి ఎన్నో సార్లు అవకాశం ఇచ్చి చట్టసభలకు పంపించింది. అయినా వీరికి తృప్తి ఉండటం లేదు. ఎన్నికలు వచ్చినప్పుడల్లా పెద్దలను ఒప్పించి పోటీ చేయాలని ప్రయత్నిస్తున్నారు. ముదిమి వయసులో చట్టసభలకు వెళ్లి వారు ఏం చేస్తారు. ఒక్కసారి కూడా అవకాశం రాని వారికి టికెట్ ఇవ్వటం సమంజసంగా ఉంటుంది.

- శాస్త్రి, హైదరాబాద్

## రెండు విభాగాలను ఏర్పాటు చేయాలి

ఉపాధ్యాయ ఎమ్మెల్సీలో రెండువిభాగాలు ఏర్పాటు చేయాలి. శాసనమండలిలో ఎమ్మెల్సీ ప్రక్రియలో భాగంగా ఉపాధ్యాయ ఎమ్మెల్సీలో స్కూల్‌అసిస్టెంట్ ఉపాధ్యాయులకుఉన్నత విద్యా వ్యవస్థ అధ్యాపకులకు ఓటుహక్కు కల్పిస్తున్నారు.కానీ విద్యా వ్యవస్థలో కీలకమైన ప్రాథమిక స్థాయి ఉపాధ్యాయులైన ఎస్జీటీలకు ఓటు హక్కు కల్పించలేదు. మొత్తం టీచర్ వ్యవస్థలో 70శాతం ప్రాథమికస్థాయి ఉపాధ్యాయులే ఉన్నారు. గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ద్వారా ఉపాధ్యాయ విద్యారంగ సమస్యలు అంతగా ప్రాధాన్యత ఇవ్వడంలేదు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీలో రెండు విభాగాలు ఏర్పాటు చేసి ఎస్జిటి ఎమ్మెల్సీ స్కూల్ అసిస్టెంట్ ఎమ్మెల్సీ ఉంటే విద్యావ్యవస్థలో లోపాలు, ఉపాధ్యాయ విద్యారంగ సమస్యలు ఎప్పటికప్పుడు ప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్లవచ్చు.

- రావుల రామ్మోహన్ రెడ్డి, జనగాం

## దివ్యాంగులకు రేషన్ కార్డులు!

తెలంగాణ రాష్ట్ర పౌర సరఫరాల శాఖ ఆధ్వర్యంలో ఉన్న రేషన్‌కార్డులు వికలాంగులఉద్యోగులకు తప్పకుండా ఉండాలి. వీరి రేషన్ కార్డులు రద్దు చేయవద్దు. వీరు ఉద్యోగ వయో పరిమితి దాటే వయసులో ఉద్యోగాలలో చేరడం జరిగింది. తక్కువ సర్వీస్ కలిగిఉన్నారు.వికలాంగులకు సహాయకులుగా వారి కుటుంబ సభ్యులు వీరితోఉండడం వలన ఇతర ఆదాయ మార్గాలు లేవు. కొందరు ఉద్యోగులు ఎస్సీ, ఎస్టీ, బీసీ సొసైటీ పరిధిలో పనిచేయడం జరుగుతుంది.

- రాపాక రవీందర్, జనగాం

గమనిక: ఎడిటోరియల్ పేజీలో ప్రచురితమయ్యే వ్యాసాలలోని అంశాలు, విశ్లేషణలు వ్యాసకర్త సొంత అభిప్రాయాలు. వాటితో పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. -ఎడిటర్

మనవి ఎడిట్ పేజీకి..
ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు
మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్
(e-mail: editpage@vaartha.com)

# పైశాచికత్వానికి సిసలైన శిక్ష

**స్వాతంత్ర్యం తర్వాత మొదటిసారిగా పోలీసు సంస్కరణ కోసం 1977లో కేంద్రం జాతీయ పోలీసు కమిషన్‌ను నియమించింది. పోలీసు సంస్కరణలకు సంబంధించి ఆ కమిషన్ పలు సిఫారసులను చేసింది. వాటిలో చాలా అంశాలు నేటికీ అమలుకు నోచుకోలేదనే చెప్పొచ్చు. తెల్లదొరలను పారద్రోలి స్వాతంత్ర్యం తెచ్చుకున్నది డబ్బు, అధికారం కోసం కాదు, స్వేచ్ఛను, మానవత్వాన్ని పునరుద్ధరించడమే లక్ష్యమని జాతికి బాబాసాహెబ్ స్పష్టంగా దిశానిర్దేశనం చేశారు. పోలీసులు సామాజిక కార్యకర్తలు కావాలన్న జాతిపిత బాపూజీ ఆశయాలకు కొందరు పోలీసులు తూట్లుపొడుస్తున్నారు.**

దామెర్ల సాయిబాబ

ప్రజావసరాలు ప్రధానంగా భద్రత పట్టించుకోని ఏ వ్యవస్థ అయినా పతనానికే దగ్గరవుతుంది. ప్రజారక్షణే ధ్యేయంగా నెలకొల్పిన పోలీసు వ్యవస్థలో కొందరు భక్షకులుగా మారుతుండటం ఆవేదనే కాదు ఆందోళన కలిగిస్తున్నది. ఏనాడో అప్పటి కాల మాన అవసరాలకు అనుగుణంగా ఏర్పాటు చేసిన వ్యవస్థ, చట్టాలు నేడు మారిన పరిస్థితులకు అనుగుణంగా రూపుదిద్దుకోకపోవడం ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తున్నాయి. వాస్తవంగా 1857 సిపాయిల తిరుగుబాటు తర్వాత భారత ఉపఖండంపై తమ ఆధిపత్యం క్షీణించకుండా, పాలనకు ఎదురు లేకుండా ఏర్పర్చుకున్న చట్టాల్లో 1861 ఇండియన్ పోలీసు యాక్ట్ ఒకటి. స్వాతంత్ర్యం వచ్చి ఎనిమిది దశాబ్దాలు కావస్తున్నా కొన్ని సార్లు మరికొన్ని రాష్ట్రాలు చట్టంలో కొన్ని మార్పులు చేసినా చాలావరకు వలస పాలన అవశేషాలు అలాగే కొనసాగుతున్నాయి. స్వాతంత్ర్యం తర్వాత మొదటిసారిగా పోలీసు సంస్కరణ కోసం 1977లో కేంద్రం జాతీయ పోలీసు కమిషన్‌ను నియమించింది. పోలీసు సంస్కరణలకు సంబంధించి ఆ కమిషన్ పలు సిఫారసులను చేసింది. వాటిలో చాలా అంశాలు నేటికీ అమలుకు నోచుకోలేదనే చెప్పొచ్చు. తెల్లదొరలను పారద్రోలి స్వాతంత్ర్యం తెచ్చుకున్నది డబ్బు, అధికారం కోసం కాదు, స్వేచ్ఛను, మానవత్వాన్ని పునరుద్ధరించడమే లక్ష్యమని జాతికి బాబాసాహెబ్ స్పష్టంగా దిశానిర్దేశనం చేశారు. పోలీసులు సామాజిక కార్యకర్తలు కావాలన్న జాతిపిత బాపూజీ ఆశయాలకు కొందరు పోలీసులు తూట్లుపొడుస్తున్నారు. ప్రజాసమస్యను పరిష్కరించడంలో శాంతిభద్రతలను కాపాడడంలో ఓర్పు, ఓర్మి, సానుభూతితో ప్రవర్తిస్తూ కేసులను సాంకేతిక ఆధారాలు సేకరించి శాస్త్రీయంగా దర్యాప్తు చేయాల్సిన బాధ్యత పోలీసులపై ఉంది. నియమ, నిబంధనలను పక్కనపెట్టి బండబూతులు తిడుతూ ఇష్టానుసారంగా కొట్టి చిత్రహింసలకు గురి చేసి రాక్షసానందం పొందే కేవలం కొందరి ఖాకీల వల్ల మొత్తం పోలీసు యంత్రాంగం అప్రతిష్టపాలవుతున్నది. తాజాగా తమిళనాడులో మధురై కోర్టు వెల్లడించిన తీర్పు దేశవ్యాప్తంగా సంచలనం సృష్టిస్తున్నది. ఏకంగా ఒక సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌తోసహా తొమ్మిది మంది పోలీసులకు మరణశిక్ష విధించింది. అయితే ఈ లాకప్‌డెత్ ఉదంతాన్ని న్యాయస్థానం ముందు రుజువుకు కీలకమైన సాక్ష్యం చెప్పిన మహిళ కూడా ఒక పోలీసు ఉద్యోగే. సహజంగా పోలీసు శాఖలో పై అధికారుల చర్యలు, ఆదేశాలను తప్పుబట్టి ఎదురుతిరిగే ధైర్యసాహసాలు ఉండవు. కానీ ఈ మహిళా హెడ్ కానిస్టేబుల్ అవన్నీ పక్కనపెట్టి పై అధికారులు, తోటి సహచరులు చేసిన దాష్టీకాన్ని తనకు ఏమైనా పర్వాలేదు అనే ధీమాతో పూసగుచ్చినట్లు న్యాయస్థానానికి చెప్పడంతో దేశవ్యాప్తంగా ఆమె పట్ల ప్రశంసల జల్లులు కురుస్తున్నాయి. దేశవ్యాప్తంగా లాక్‌డౌన్ కొనసాగుతున్న సమయంలో 2020 జూన్ 19వ తేదీన జయరాజ్ తన సెల్‌ఫోన్ దుకాణంలో పనిచేసుకుంటున్న సమయంలో సాంతాన్‌కుళం పోలీసు స్టేషన్‌కు చెందిన పోలీసులు వచ్చి కోవిడ్ నిబంధనలను ఉల్లంఘించి నిర్ణీత సమయం కంటే మించి షాప్ తెరిచి ఉంచారని ఆయనను పట్టుకెళ్లారు. విషయం తెలుసుకున్న ఆయన కుమారుడు ఫెన్నిక్స్ పోలీసుస్టేషన్‌కు వెళ్లి తండ్రి ని విడిచిపెట్టమని కాళ్లావేళ్లా బతిమిలాడాడు. తనయుడి ఎదుటనే తండ్రిని విపరీతంగా కొడుతుండటంతో ఆ దెబ్బల బాధ భరించలేక విలపిస్తున్న తండ్రిని చూసి భరించలేక, అడ్డుకోపోయిన ఫెన్నిక్స్‌తో గుంజులాటలో ఒక కానిస్టేబుల్ చొక్కాగుండీలు ఊడిపోయాయి.దీంతో ఫెన్నిక్స్‌ను కూడా అదుపులోకి తీసుకొని ఇద్దరిని ఒకరి ముందు ఒకరిని బట్టలు ఊడదీసి నిలబెట్టి దారుణంగా కొట్టారు. తమవారిని వదలి పెట్టమని కుటుంబసభ్యులు పలువిధాల

**ఒక్క మాట**

వేడుకున్నా కనికరించలేదు. మరుసటిరోజు ఉదయం వదిలేస్తామని కుటుంబ సభ్యులకు చెప్పిపంపారు. తండ్రీకుమారులిద్దరిని మరుసటి రోజు సాంతాన్‌కుళం ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకువెళ్లి అక్కడ బట్టలు మార్చారు. వారి శరీరంపై ఉన్న దెబ్బలు కనిపించకుండా చేసి అక్కడనుండి జ్యూడిషియల్ మెజిస్ట్రేట్ ముందు హాజరుపరిచి కోయిల్‌పట్టీ సబ్ జైలుకు తరలించా రు. జైల్లో వారికి ఆరోగ్యసమస్యలు తలెత్తడంతో కోయిల్ పట్టీ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మెదడులో రక్తనాళాలు చిట్లడంతో ఫెన్నిక్స్ జూన్ 22 అపస్మారస్థితిలోకి వెళ్లి అటునుంచి అటే పరలోకానికి పయనం కట్టారు. మరుసటిరోజు జయరాజ్ ఛాతినొప్పితో ఆస్పత్రిలోనే కన్నుమూశారు. ఈ దారుణ సంఘటనపై సామాన్య కార్యకర్తలు మానవ హక్కుల సంఘాలు పెద్దఎత్తున ధర్నాలు, నిరసన కార్యక్రమాలు చేపట్టారు. హైకోర్టు మధురై బెంచ్ సుమోటోగా కేసును విచారణ చేపట్టి జ్యూడిషియల్ విచారణకు ఆదేశించింది. అయితే విచారణకు వచ్చిన అధికారులకు పోలీసులు సహకరించలేదు. ఇదే విషయాన్ని పోలీసులు తమకు ఏమాత్రం సహకరించడం లేదని, పైగా బెదిరిస్తున్నారని కోయిల్‌పట్టి జ్యూడిషియల్ మెజిస్ట్రేట్ హైకోర్టుకు నివేదిక సమర్పించారు. దీంతో కోర్టు విషయాన్ని తీవ్రంగా పరిగణించి దర్యాప్తును సిబిఐకి బదలీ చేసింది. అయితేపోలీసు స్టేషన్‌లో జరిగిన ఈ రాక్షసకాండను అదే రాత్రి డ్యూటీలో ఉన్న మహిళా హెడ్ కానిస్టేబుల్ రేవతి ప్రత్యక్షంగా చూసింది. ఈవిషయాన్ని చెప్పేందుకు కొంత సంశయించినా కుటుంబ సభ్యులు ఇచ్చిన ధైర్యంతో తనకు, తన కుటుంబానికి రక్షణ కల్పిస్తే మొత్తం దారుణాన్ని చెప్తానని వివరాలన్నీ సుస్పష్టంగా చెప్పింది. ఆ మహిళా హెడ్‌కానిస్టేబుల్ చెప్పిన విషయాన్ని సీరియస్‌గా పరిగణించి, పోలీసు స్టేషన్‌ను స్వాధీనం చేసుకొని సంబంధిత సామాగ్రిని స్వాధీనం చేసుకోవాలని తూత్తుకుడి జిల్లా కలెక్టర్‌కు ఆదేశాలుఇచ్చింది. సాక్ష్యాలు సేకరించి సిబిఐకి బదలీ చేయాలని ఫొరెన్సిక్ బృందానికి ఉత్తర్వులు ఇచ్చింది. 2020 నుండి 26వరకు సిబిఐ వంద మందికిపైగా సాక్షుల నుంచి వివరాలను సేకరించి రెండువేలకుపైగా పేజీలతో చార్జ్‌షీట్ దాఖలుచేసింది. అందులో తండ్రీకుమారులు కోవిడ్ నిబంధనలను ఉల్లంఘించలేదని తేల్చింది. పోలీసులనే దోషులుగా నిర్ధారించింది. వివరాలన్నీ పరిగణనలోకి తీసుకున్న హైకోర్టు మొన్న సోమవారం తొమ్మిది మందికి మరణశిక్ష విధించింది. తీర్పు సందర్భంగా జడ్జి మాట్లాడుతూ ఇది సాధారణ నేరం కాదు. తండ్రీకొడుకులిద్దరిని ఎదురెదురుగా నగ్నంగా నిలబెట్టి ఇష్టం వచ్చినట్లు కొడుతూ కొందరు పోలీసులు వ్యవహరించినతీరు వివరాలను చదువుతుంటే మనసుకు తీవ్ర బాధ కలిగిందని, దోషులకు రెండు ఉరి శిక్షలు విధిస్తున్నట్లు చెప్పారు. ఉరి శిక్షతోపాటు బాధిత కుటుంబ సభ్యులకు దోషులైన పోలీసు అధికారుల నుంచి కోటి నలభైలక్షలు నష్టపరిహారం చెల్లించాలని కూడా ఆదేశించింది. దేశంలో అనేక పోలీసు స్టేషన్లలో నిబంధనలకు విరుద్ధంగా చిత్రహింసలపర్వం కొనసాగుతూనే ఉంది. సాధారణంగా సాక్ష్యాలు చెప్పడానికి ఎవరూ ఉండరు కనుక బాధి తులు చేసిన ఫిర్యాదులు బుట్టదాఖలవుతున్నాయి. కేంద్ర ప్రభుత్వం లెక్కల ప్రకారం కూడా పోలీసులపై యేటా దాదాపు మూడువేలకుపైగా ఫిర్యాదులు అందుతున్నాయి. అందులో అధిక భాగం విచారణకు నోచుకోవడం లేదు. ఇదే విషయాన్ని పదవీ విరమణ పొందిన ఇద్దరు డిజిపిలు ప్రకాశ్‌సింగ్, ఎన్‌కె సింగ్ గతంలో సుప్రీంకోర్టును ఆశ్రయిం చారు. విచారణలో భాగంగా సుప్రీంకోర్టు ఏడు ఆదేశాలను అమలు చేయాలని రాష్ట్రప్రభుత్వాలకు సూచించింది.వాటిలో దేశంలోని అన్నిరాష్ట్రాలు పోలీసు ఫిర్యాదుల ప్రాధికార సంస్థ (పీసీఏ)ఏర్పాటు చేయాలని ఆదేశించింది. ఆ ఆదేశాలను రాష్ట్రాలు పాటిస్తున్నాయా?లేదా అని సర్వోన్నతన్యాయ స్థానం 2008లో ముగ్గురు సభ్యులతో పరిశీలన కమిటీని కూడా నియమించింది. అక్కడక్కడ కొన్ని ప్రాంతాల్లో కొంతమేరకు అమలు అవుతున్నా పూర్తిస్థాయిలో అమలు కావడం లేదు. పోలీసుస్టేషన్లలో నిందితులు చిత్రహింసలకు గురికాకూడదనే ఉద్దేశ్యంతో అన్నిటిలోనూ వాటి పరిసర ప్రాంతాల్లో నలుమూలలు కన్పించేలా సిసిటీవీ కెమెరాలు ఏర్పాటు చేయాలని పరమ్‌వీర్ సింగ్ వర్సెస్ బల్జీత్‌సింగ్ కేసులో సుప్రీంకోర్టు ఆరేళ్ల క్రితమే ఆదేశించింది. వాటిని సరిగ్గా అమలు చేశారా? లేదా అనే అంశంపై జిల్లా రాష్ట్ర స్థాయిల్లో పర్యవేక్షణ కమిటీలను ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాలను ఆదేశించింది. ఇలా ఎన్నో సార్లు దేశ అత్యున్నత న్యాయస్థానం ఆదేశాలు ఇచ్చినా నేటికీ చాలా పోలీసు స్టేషన్లలో పూర్తి స్థాయిలో ఏర్పాటు చేయలేదని, చేసినా అవసరమైన సమయంలో అవి పని చేయడంలేదనే ఆరోపణలున్నాయి. పోలీసు శాఖలో సంస్కరణలు మాటల్లో, కాగితాల్లో కాకుండా చేతల్లో చూపేందుకు ఏకంగా రాష్ట్ర ప్రభుత్వాలు చొరవ తీసుకోవాలి. ప్రధానంగా ప్రజల హక్కులను,భద్రతను దృష్టిలో పెట్టుకోవాలి. అప్పుడే రాజ్యాంగ నిర్మాతల ఆశయాలు నెరవేరుతాయి. ●

# ఐపిఎల్‌పై మోజు క్రీడా సంస్కృతికి ముప్పు!

సురేష్ కాలేరు

దేశం మళ్లీ ఐపీఎల్ మోజులో మునిగిపోయింది. స్టేడియంలు కిటకిటలాడుతున్నాయి. టెలివిజన్ రేటింగ్స్ రికార్డులు బద్దలవుతున్నాయి. కోట్ల రూపాయల ప్రకటనలు, వేల కోట్ల వ్యాపారం, గ్లామర్, సినీ తారలు, రాజకీయ ప్రముఖులు అన్నీ ఒకే వేదికపై దర్శనమిస్తున్నాయి. ఇది క్రీడా ఉత్సవమా? లేక వ్యాపార మేళామా? అనే ప్రశ్నను మనం తప్పించుకోలేము. ప్రస్తుత ఐపీఎల్ సీజన్ కూడా ఇదే దిశగా దూసుకుపోతోంది. ఫ్రాంచైజీలు ఆటగాళ్లపై వందల కోట్ల రూపాయలు వెచ్చిస్తున్నాయి. ఒక్కో మ్యాచ్‌కు వేల రూపాయల టిక్కెట్లు, కోట్ల రూపాయల ప్రసార హక్కులు, సోషల్ మీడియా హైప్ అన్నీ కలిపి ఐపీఎల్‌ను ఒక భారీ వినోద పరిశ్రమగా మలిచాయి. అయితే ఈ ప్రకాశవంతమైన వెలుగుల వెనుక క్రీడా వ్యవస్థలో పెరుగుతున్న అసమతుల్యతను గమనించాల్సిన అవసరం ఉంది. భారతదేశంలో క్రీడలంటే క్రికెట్ అనే భావన బలంగా ఉంది. ఐపీఎల్ దీనిని మరింత బలపరుస్తోంది. పాఠశాలల నుంచి కాలేజీల వరకు యువతలో ఒకే లక్ష్యం క్రికెటర్ కావడం. ఇతర క్రీడలు క్రమంగా ప్రాధాన్యతను పొందలేకపోతున్నాయి. ఒలింపిక్స్,ఆసియా క్రీడలు, కామన్వెల్త్ గేమ్స్ వంటి వేదికలపై భారత్ సాధిస్తున్న ఫలితాలు మనకు అద్దం పడుతున్నాయి. జనాభా పరంగా ప్రపంచంలో అగ్రస్థానంలో ఉన్న దేశం, మెడల్స్ విషయంలో మాత్రం వెనుకబడిపోవడం యాదృచ్ఛికం కాదు. ఇది క్రీడా విధానాల వైఫల్యం మాత్రమే కాదు, ఒకే క్రీడకు గుడ్డిగా మనమిస్తున్న మద్దతు. క్రీడల్లో డబ్బు ప్రవేశించడం ఒక సానుకూల పరిణామమే. కానీ అది సమతుల్యంగా అన్ని క్రీడలకు చేరకపోవడం సమస్య. ఒకవైపు ఐపీఎల్ ఆటగాళ్లు కోట్లలో పారితోషికాలు అందుకుంటు



టే, మరోవైపు ఒలింపిక్ స్థాయి ఆటగాళ్లు కనీస వసతుల కోసం పోరాడాల్సి వస్తోంది. ప్రస్తుతం ఐపీఎల్‌లో కొత్త ప్రతిభ వెలుగులోకి వస్తున్నా, అదే సమయంలో దేశానికి అంతర్జాతీయ స్థాయిలో ప్రతిష్ఠ తీసుకురాగల ఇతర క్రీడాకారులు గుర్తింపుకోసం తపిస్తున్నారు. ఇది క్రీడా వ్యవస్థలోని అసమానతకు నిదర్శనం. ఐపీఎల్ మ్యాచ్‌లు ఇప్పుడు కేవలం క్రీడా పోటీలు కావు అవి వినోద ప్రదర్శనలు. క్రీడ అంటే క్రమశిక్షణ, పట్టుదల, జట్టు భావన. కానీ ఐపీఎల్ ప్రభావంతో యువతలో త్వరగా డబ్బు సంపాదించాలి అనే భావనలు పెరుగుతున్నాయి. ఇది దీర్ఘకాలంలో క్రీడా సంస్కృతికి ముప్పు.దేశంలో అనేక క్రీడా అకాడమీలు ఉన్నా, వాటి పనితీరు ప్రశ్నార్థకమే. ప్రణాళిక లోపం, పారదర్శకత కొరత, రాజకీయ జోక్యం,పోటీ సంఘాలు అన్నీ కలిసి క్రీడాఅభివృద్ధిని అడ్డుకుంటున్నాయి. ఈ అడ్డంకులను అధిగమించిన నాడే క్రీడాభివృద్ధి సాధ్యమవుతుంది. మీడియా కూడా ఈ అసమతుల్యతకు కారణం. ఐపీఎల్ ప్రతి మ్యాచ్‌కు గంటల కొద్దీ ప్రసారం, విశ్లేషణలు ఉంటాయి. కానీ ఇతర క్రీడలు వార్తల్లో చోటుపొందడం అరుదు. ఫలితంగా ప్రజల్లో అవగాహన తగ్గిపోతుంది. మనదేశంలో క్రికెట్‌లో చిన్నదైనా పెద్ద ప్రాముఖ్యత ఇచ్చి ప్రచురించడం అన్ని వార్త ప్రసార మాధ్యమాలకు సర్వసాధారణమైపోయింది. ఈ పరిస్థితి నుంచి బయటపడటానికి సమగ్రదృష్టి అవసరం.పాఠశాల స్థాయిలో క్రీడలను తప్పనిసరిచేయాలి. ప్రతి జిల్లాలో బహుళ క్రీడా శిక్షణా కేంద్రాలు ఏర్పాటు చేయాలి. ఒలింపిక్ క్రీడలపై ప్రత్యేక దృష్టిపెట్టాలి. కార్పొరేట్ రంగాన్ని అన్ని క్రీడల అభివృద్ధిలో భాగస్వామ్యం చేయాలి. ఐపీఎల్ ను వ్యతిరేకించడం కాదు అది క్రీడా రంగానికి ఇచ్చిన దోహదాన్ని అంగీకరించాలి. కానీ అదే సమయంలో అది సృష్టిస్తున్న అసమతుల్యతను సరిచేయడం అత్యవసరం. భారతదేశం నిజమైన క్రీడా శక్తిగాఎదగాలంటే, క్రికెట్ మోజునుంచి బయటపడుతూ అన్ని క్రీడలకు సమాన ప్రాధాన్యం ఇవ్వాలి. లేకపోతే, ఐపీఎల్ వెలుగుల మధ్య ఇతర క్రీడలు చీకటిలోనే మిగిలిపోతాయి. ●

# పిల్లలకు నిజాల బోధనా! లేక ప్రతిష్ట పరిరక్షణా?

తిప్పర్తి శ్రీనివాస్

ఇటీవలి కాలంలో విద్యా రంగంలో పెద్ద చర్చకు దారి తీసిన అంశం ఎన్సీఈఆర్టీ నేషనల్ కౌన్సిల్ ఆఫ్ ఎడ్యుకేషనల్ రీసెర్చ్ అండ్ ట్రెనింగ్) రూపొందించిన 8వ తరగతి సామాజిక శాస్త్ర పాఠ్యపుస్తకంలోని ఒక అధ్యాయం. ఈ అధ్యాయంలో న్యాయవ్యవస్థలో అవినీతి వంటి అంశాలు ప్రస్తావించబడటంతో వివాదం చెలరేగింది. పాఠశాలల నుండి అభ్యంతరాలు రావడంతో పాటు విషయం దేశ అత్యున్నత న్యాయస్థానం అయిన సుప్రీం కోర్ట్ ఆఫ్ ఇండియా దృష్టికి వెళ్లింది. దీనితో ఎన్సీఈఆర్టీ ఆ పాఠ్య పుస్తకాన్ని తాత్కాలికంగా తమ వెబ్‌సైట్ నుండి ఉపసంహరించుకుంది. ఈ పరిణామం దేశవ్యాప్తంగా చర్చకు దారి తీసింది. విద్యా స్వేచ్ఛ, న్యాయవ్యవస్థ ప్రతిష్ఠ, విద్యార్థుల అవగాహన ఈ మూడింటి మధ్య సున్నితమైన సమతుల్యత ఎలా ఉండాలనే ప్రశ్న ముందుకు వచ్చింది. మన దేశ రాజ్యాంగం ప్రకారం న్యాయవ్యవస్థ స్వతంత్ర సంస్థ. ప్రజాస్వామ్య వ్యవస్థలో న్యాయస్థానాలు ప్రజల హక్కులను కాపాడే కవచం లాంటివి. ప్రభుత్వంలోని శాసన, కార్య నిర్వాహక శాఖల చర్యలను సమీక్షించే అధికారం న్యాయ వ్యవస్థకు ఉంది. ఇలాంటి కీలక స్థానం కలిగిన వ్యవస్థపై పాఠ్యపుస్తకాల్లో వ్యాఖ్యానాలు చేయాలంటే అత్యంత జాగ్రత్త అవసరం. ముఖ్యంగా 8వ తరగతి విద్యార్థుల వంటి చిన్నారుల ముందు విషయాన్ని ఎలా ఉంచాలో మరింత శ్రద్ధ వహించాలి. అవినీతి అనే సమస్య ఒక్క న్యాయవ్యవస్థకే పరిమితం కాదు. అది సమాజంలోని పలు రంగాల్లో కనిపించే సామాజిక సమస్య. దాన్ని చర్చించడం తప్పు కాదు. నిజానికి, విద్యార్థుల్లో విమర్శనాత్మక ఆలోచన పెంపొందించడానికి సమాజంలోని లోపాలను కూడా వివరించడం అవసరమే. అయితే, ఒక నిర్దిష్ట వ్యవస్థను లక్ష్యంగా చేసుకుని, సరైన సందర్భం లేకుండా ప్రతికూలంగా చూపించడం వాస్తవ దృష్టికోణాన్ని దెబ్బతీయవచ్చు. చిన్నారుల మనసుల్లో న్యాయవ్యవస్థపై అవిశ్వాసం పెరగకుండా చూసుకోవడం కూడా విద్యాసంస్థల బాధ్యతే. ఈ సందర్భంలో మరో ముఖ్యమైన అంశం విద్యాస్వాతంత్ర్యం. పాఠ్యపుస్తకాలు కేవలం సమాచారాన్ని అందించడమే కాకుండా, విలువలను కూడా బోధిస్తాయి. సమాజంలో ఉన్న సమస్యలను దాచిపెట్టడం మంచిదికాదని కొందరు వాదిస్తున్నారు. విద్యార్థులకు వాస్తవాలను చెప్పాలి, విమర్శనాత్మక దృష్టితో ఆలోచించేందుకు ప్రోత్సహించాలి అంటు న్నారు. మరోవైపు,



న్యాయవ్యవస్థ ప్రతిష్ఠను కాపాడడం అత్యవసరమని మరి కొందరు భావిస్తున్నారు. ఈ రెండు అభిప్రాయాల మధ్య సంతులనం అవసరం. నిజానికి,పాఠ్యపుస్తకాల రూపకల్పనలో పారదర్శకత, నిపుణుల సలహాలు, విభిన్న వర్గాల అభిప్రాయాలు కీలకం.విద్యామండళ్లు పాఠ్యాంశాలనురూపొందించేటప్పుడు న్యాయ నిపుణులు, విద్యావేత్తలు, మానసిక శాస్త్రవేత్తల సూచనలు తీసుకోవాలి. ఒక అంశంచిన్నారులపై ఎలాంటి మానసిక ప్రభావం చూపుతుందో అంచనా వేసి, భాషను సున్నితంగా ఉపయోగించాలి. విమర్శ చేయాల్సి వచ్చినా, అది నిర్మాణా త్మకంగా ఉండాలి. ఉదాహరణకు, 'న్యాయవ్యవస్థలో సమ స్యలు ఉన్నాయి' అని చెప్పడం కంటే న్యాయవ్యవస్థను మరింత సమర్థవంతంగా చేయడానికి తీసుకుంటున్న చర్యలు' అనే కోణంలో వివరించడం మంచిది.ఇక్కడ ప్రశ్నఒకటే విద్యార్థులకు నిజాలు చెప్పాలా, లేక వ్యవస్థల ప్రతిష్ఠను కాపాడాలా?సమాధానం రెండింటికీ మధ్యలో ఉంటుంది. ప్రజాస్వామ్యంలో విమర్శఅనేది సహజం. కానీ అది బాధ్యతాయుతంగా ఉండాలి. చిన్నారులకు సరైన సందర్భం, సరైనభాష, సమతుల్య దృష్టితో విషయాన్ని అందించాలి.న్యాయవ్యవస్థలో ఉన్నసవాళ్లను చెప్పేటప్పుడు, అదే సమయంలో న్యాయవ్యవస్థ సాధించిన విజయాలు, ప్రజలకు అందిస్తున్న న్యాయం, రాజ్యాంగ పరిరక్షణ వంటి అంశాలను కూడా ప్రస్తావించాలి.ఈ వివాదం మనకు ఒక పెద్దపాఠం చెబుతోంది.విద్యారంగం రాజకీయాలనుండి, భావోద్వేగాల నుండి దూరంగా ఉండాలి. పాఠ్యపుస్త కాలు తాత్కాలిక చర్చలకు కాకుండా, దీర్ఘకాలిక విలువలకు సేవ చేయాలి. విద్యార్థుల్లో న్యాయపాలనపై గౌరవం పెంపొందించడమే కాకుండా, సమాజాన్ని మెరుగుపరచాలనే బాధ్యతను కూడా కల్పించాలి. ఎన్సీఈఆర్టీ తీసుకున్న నిర్ణయం తాత్కాలిక ఉపసంహారణ కావొచ్చు. కానీ భవిష్యత్తులో పాఠ్యపుస్తకాల రూపకల్పనలో మరింత జాగ్రత్త అవసరమని ఇది స్పష్టం చేసింది.న్యాయవ్యవస్థ గౌరవాన్నికాపాడుతూ, సమాజంలోని వాస్తవాలను కూడా సున్నితంగా ప్రతిబింబించే విధంగా పాఠ్యాంశాలు రూపొందించాలి. విద్యార్థులు భవిష్యత్ పౌరులు. వారిలో న్యాయం, ధర్మం, పారదర్శకత, సమానత్వం వంటి విలువలు బలపడేలా పాఠ్యపుస్తకాలు ఉండాలి. మొత్తానికి, ఈసంఘటన ఒక వివాదం మాత్రమే కాదు ఇది విద్యా విధానాల పునర్విమర్శకు అవకాశం. ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రతి సంస్థ గౌరవనీయమే.అదే సమయంలో విమర్శను స్వీకరించే సామర్థ్యం కూడా ప్రజాస్వామ్య లక్షణం.ఈ రెండు అంశాలను సమన్వయం చేయగలిగితేనే విద్యారంగం నిజమైన మార్గంలో సాగుతుంది. ●

# నాటో, ఐరోపా దేశాల నుంచి అమెరికా బలగాలు వెనక్కి?



**వాషింగ్టన్, ఏప్రిల్ 10:** నాటో, ఐరోపా దేశాల నుంచి అమెరికా బలగాలు వెనక్కి తగ్గనున్నాయని సమాచారం. నాటో మిత్ర దేశాల కారణంగా నిరాశకు గురైన అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఈ దిశగా అడుగులు వేయనున్నారంటూ ఊహాగానాలు వ్యక్తమవుతున్నాయి. ఇరాన్, గ్రీన్‌ల్యాండ్ విషయంలో మనస్పర్థల కారణంగానే ఈ నిర్ణయం తీసుకోనున్నారని వైట్‌హౌస్ సీనియర్ అధికారి చెప్పినట్లు అంతర్జాతీయ మీడియా కథనాలు రాసుకొచ్చాయి. 'నాటో మిత్ర దేశాలు హార్ముజ్ జలసంధిని తిరిగి తెరిపించడంలో ఎలాంటి సాయం చేయలేకపోయాయి. గ్రీన్‌లాండ్‌ను స్వాధీనం చేసుకోవాలన్న ట్రంప్ ప్రణాళిక ముందుకు కదలట్లేదు. ఈ కోపంతోనే నాటో నుంచి వెనక్కి తగ్గే విషయంపై సలహాదారులతో చర్చించారు. అంతర్గత చర్చలు జరిపినప్పటికీ ఈ అంశంపై ఇంతవరకు ఓ నిర్ణయానికి రాలేదు. వాషింగ్టన్-యూరప్ దేశాల మధ్య సంబంధాలు మాత్రం తీవ్రంగా దెబ్బతిన్నాయి. ఇటీవల నాటో సెక్రటరీ జనరల్ మార్క్ వాషింగ్టన్‌ను సందర్శించిన సమయంలోనే ఈ విషయం వెలుగులోకి వచ్చింది' అంటూ సదరు కథనం వెల్లడించింది. 1949లోనే ఈ కూటమి (నాటో) స్థాపించినా ఇందులో ఉన్న దేశాల మధ్య వివాదాలను పరిష్కరించడానికి ఇంతవరకు ఒక్క సమావేశం కూడా నిర్వహించలేదు. రెండు ప్రపంచ యుద్ధం జరిగిన తర్వాత నుంచి ఐరోపా భద్రత విషయంలో అండగా నిలిచేందుకు పెద్ద సంఖ్యలో అమెరికా సైన్యం మోహరించింది. జర్మనీ, యుకె, ఇటలీ, స్పానిష్‌లోనూ అమెరికా బలగాలు ఉన్నాయి. 'ట్రంప్ అసంతృప్తి ఇప్పటిది కాదు.. కొన్ని నెలలుగా పెరుగుతూ వస్తోంది. రక్షణ రంగంలో ఐరోపా మిత్ర దేశాలు తగినంత పెట్టుబడులు పెట్టడం లేదని ఆయన చాలాకాలంగా ఆరోపిస్తున్నారు. అయితే ఇరాన్ యుద్ధం ప్రారంభమైనప్పటి నుంచి ఉద్రిక్తతలు తీవ్రంగా పెరిగాయి. సీజ్‌ఫైర్ ప్రకటన చేసినప్పటికీ ప్రపంచానికి ఇంధనాన్ని చేరవేయడంలో కీలక పాత్ర పోషిస్తున్న హార్ముజ్ జలసంధి మార్గాన్ని తిరిగి తెరిపించడానికి నాటో దేశాలు ముందుకు రాలేదని అమెరికా అధ్యక్షుడు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారని' అంతర్జాతీయ మీడియా పేర్కొంది.

# ఇజ్రాయెల్ పై హెజ్బుల్లా భీకరదాడులు



ప్రమాదంలో పడిన కాల్పుల విరమణ ఒప్పందం
మధ్యప్రాచ్యంలో మళ్లీ పెరుగుతున్న ఉద్రిక్తతలు
హార్ముజ్ వద్ద పూర్తిగా నిలిచిన రాకపోకలు
హార్ముజ్ జలసంధివద్ద అమెరికా నిఘా డ్రోన్ అదృశ్యం!

**టెల్ అవీవ్, ఏప్రిల్ 10:** అమెరికా, ఇరాన్ మధ్య కుదిరిన బలహీనమైన కాల్పుల విరమణ ఒప్పందం ప్రమాదంలో పడింది. లెబనాన్ నుంచి ఇజ్రాయెల్‌పై రాకెట్ల వర్షం కురవడంతో మధ్యప్రాచ్యంలో మరోసారి తీవ్ర ఉద్రిక్తతలు నెల కొన్నాయి. శుక్రవారం తెల్లవారుజామున టెల్ అవీవ్, అష్దోద్ సహా పలు ఇజ్రాయెల్ నగరాల్లో హెచ్చరిక సైరన్లు మోగాయి. తామే ఈ దాడులు చేశామని హెజ్బొల్లా ప్రకటించగా, కొన్ని రాకెట్లను అడ్డుకున్నామని ఇజ్రాయెల్ సైన్యం తెలిపింది. ఈ దాడులతో శాంతి చర్చలకు విఘాతం కలుగుతుందన్న ఆందోళన వ్యక్తమవుతోంది. ప్రపంచ వాణిజ్యంలో కీలకమైన హార్ముజ్ జలసంధిపై ఇరాన్ పట్టు బిగించింది. కాల్పుల విరమణ అమల్లో ఉన్నప్పటికీ, ఈ మార్గంలో నౌకల రాకపోకలు నిలిచిపోయాయి. హార్ముజ్ జలసంధి మూసివేతపై యూఏఈ చమురు సంస్థ అధిపతి ఆందోళన వ్యక్తం చేశారు. యుద్ధ నష్టానికి పరిహారం డిమాండ్ చేస్తామని, హార్ముజ్ జలసంధిపై తమ నియంత్రణను కొత్త దశకు తీసుకెళ్తామని ఇరాన్ నేత మొజ్తబా ఖమేనీ హెచ్చరించారు. ఈ ఉద్రిక్తతల నడుమ దౌత్యపరమైన ప్రయత్నాలు కూడా కొనసాగుతున్నాయి. పాకిస్థాన్‌లోని ఇస్లామాబాద్‌లో అమెరికా, ఇరాన్ మధ్య చర్చలు జరగనున్నాయి. పరిస్థితిని చక్కదిద్దేందుకు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ రంగంలోకి దిగారు. లెబనాన్‌పై దాడుల తీవ్రతను తగ్గించాలని ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహుకు ట్రంప్ సూచించినట్లు తెలిసింది. మరోవైపు, ఇరాన్, దాని అనుబంధ సంస్థలు తమపై డ్రోన్ దాడులు చేశాయని కువైట్ ఆరోపించగా, తమ ఆయిల్ పైప్‌లైన్‌కు నష్టం వాటిల్లిందని సౌదీ అరేబియా తెలిపింది. అయితే ఈ ఆరోపణలను ఇరాన్ ఖండించింది. హార్ముజ్ జలసంధిలో తమ నౌకల భద్రతపై చర్చించేందుకు దక్షిణ కొరియా తమ ప్రత్యేక ప్రతినిధిని ఇరాన్‌కు పంపనుంది. అమెరికా నౌకాదళానికి చెందిన అత్యంత ఖరీదైన నిఘా డ్రోన్ ఎంక్యూ4సీ ట్రైటాన్ ఈరోజు హార్ముజ్ జలసంధి సమీపంలో అదృశ్యమవ్వడం అంతర్జాతీయంగా కలకలం రేపుతోంది. పర్షియన్ గల్ఫ్, హార్ముజ్ జలసంధి ప్రాంతాల్లో సుమారు మూడు గంటల పాటు నిఘా కార్యకలాపాలు నిర్వహించిన ఈ డ్రోన్, తిరిగి ఇటలీలోని నావల్ ఎయిర్ స్టేషన్ సిగోనెల్లాకు వెళుతున్న క్రమంలో ఈ ఘటన చోటుచేసుకుంది. ఫ్లైట్ రాడార్ 24 గణాంకాల ప్రకారం, ఇరాన్ దిశగా స్వల్పంగా మలుపు తిరిగిన తక్షణమే ఈ డ్రోన్ నుంచి కోడ్ 7700 (జనరల్ ఎమర్జెన్సీ) హెచ్చరికలు వెలువడ్డాయి. ఆ తర్వాత అత్యంత వేగంగా ఎత్తును కోల్పోతూ రాడార్ పరిధి నుంచి మాయమైంది. అమెరికా ఇరాన్ మధ్య కాల్పుల విరమణ ఒప్పందం కుదిరిన రెండు రోజులకే ఈ ఘటన జరగడం గమనార్హం. సుమారు 200 మిలియన్ డాలర్ల (సుమారు రూ. 1,600 కోట్లకు పైగా) విలువైన ఈ ఎంక్యూ4సీ ట్రైటాన్ డ్రోన్, సముద్ర తీర ప్రాంతాల్లో నిరంతర నిఘా కోసం రూపొందించబడింది. 50వేల అడుగుల కంటే ఎక్కువ ఎత్తులో, 24 గంటల పాటు సుదీర్ఘంగా ప్రయాణించగల సామర్థ్యం ఈ డ్రోన్‌కు ఉంది. సాంకేతిక కారణాలతో కూలిపోయిందా? లేదా ఇరాన్ దళాలు కూల్చివేశాయా? అనే దానిపై స్పష్టత రావాల్సి ఉంది. ఒకవైపు శాంతి ఒప్పందాలు జరుగుతుండగానే, అమెరికా తన యుద్ధ కార్యకలాపాల కోసం ప్రతి సెకనుకు 10,300 డాలర్లు (సుమారు రూ. 9.8 లక్షలు) ఖర్చు చేస్తోందని గణాంకాలు చెబుతున్నాయి. కేవలం క్షిపణులు, వాయు, నౌకాదళ కార్యకలాపాల కోసమే రోజుకు వందల కోట్ల రూపాయలు వ్యయం చేస్తూ అమెరికా ఈ ప్రాంతంలో భారీ సైనిక వ్యూహాన్ని కొనసాగిస్తోంది. తాజాగా జరిగిన ఈ డ్రోన్ అదృశ్యం ఇరు దేశాల మధ్య నెలకొన్న తాత్కాలిక శాంతికి విఘాతం కలిగిస్తుందేమోనన్న ఆందోళన వ్యక్తమవుతోంది.

# వ్యాజ్యాలు వేయడం కంటే వృత్తిపై శ్రద్ధ పెట్టండి

## పిటిషనర్లకు సుప్రీం కోర్టు సూచన

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 10:** దేశంలోని పలు అంశాలపై 25 ప్రజా ప్రయోజన వ్యాజ్యాలు దాఖలు చేసిన ఓ న్యాయవాదిపై సుప్రీంకోర్టు అసహనం వ్యక్తం చేసింది. కోర్టులో వ్యాజ్యాలు దాఖలు చేయడం కంటే తొలుత సంబంధిత అధికారులను సంప్రదించాలని సర్వోన్నత న్యాయస్థానం పిటిషనర్‌కు సలహా ఇచ్చింది. మీరు మీ వృత్తిపై శ్రద్ధ పెట్టండి. కోర్టులో పిల్ దాఖలు చేయడానికంటే ముందే సంబంధిత అధికారులను సంప్రదించండి. పిల్ వేయదలచుకున్న పిటిషనర్‌కు అవి ఎలా పరిష్కరించాలో అంచనా వేయగలిగే శక్తి కూడా ఉండాలి. సమస్య పరిష్కారం కాకపోతే కోర్టును ఆశ్రయించాలి అని పిటిషనర్ సచిన్ గుప్తాకు ధర్మాసనం సూచించింది. విచారణ చేయాల్సి ఉన్న వ్యాజ్యాలను ఉపసంహరించుకొనేందుకు పిటిషనర్‌కు అనుమతి ఇచ్చింది. స్నానానికి వాడే సబ్బులో బ్యాక్టీరియాను మాత్రమే చంపే రసాయనాలు వాడాలని, శరీరానికి హాని కలిగించేవి వాడొద్దంటూ ఆదేశాలు జారీ చేయాలని కోరడంతోపాటు పలుఅంశాలపై సచిన్‌గుప్తా వేర్వేరుగా వ్యాజ్యాలు దాఖలు చేశారు. వీటి విచారణ నేపథ్యంలో సిజెఐ జస్టిస్‌సూర్యకాంత్ స్పందిస్తూ ఇవన్నీ మీరు అర్ధరాత్రి నిద్రలో లేచి రాశారా? అని అసహనం వ్యక్తం చేశారు. ఈ క్రమంలో పిటిషనర్ దాఖలు చేసిన మరో అయిదు అనవసర పిల్స్‌ని సైతం కొట్టి వేశారు. నిజంగా ప్రజలకు ఉపయోగపడే అంశాలపై వ్యాజ్యాలు వేసినప్పుడు వాటి పరిష్కారానికి సుప్రీంకోర్టు ముందు ఉంటుందని ఈ సందర్భంగా సిజెఐ పేర్కొన్నారు.

# ఇరాన్‌పై యుద్ధంలో 650 బాలిస్టిక్ క్షిపణులు వినియోగించాం..


## ఇజ్రాయెల్ సైనిక విభాగం ఐడిఎఫ్ నివేదిక విడుదల



**జెరూసలెం, ఏప్రిల్ 10:** ఇరాన్‌పై 40 రోజులపాటు జరిపినయుద్ధంలో సుమారు 650 బాలిస్టిక్ క్షిపణులను ఫైర్ చేసినట్లు ఇజ్రాయెల్ వెల్లడించింది. దీంట్లో సగం కన్నా ఎక్కువ క్లస్టర్ బాంబులు ఉన్నట్లు ఇజ్రాయిల్ మిలిటరీ చెప్పింది. బాంబు వార్‌హెడ్స్‌ను ఆ క్షిపణులు మోసుకెళ్లాయి. ఇరాన్ జరిపిన దాడుల్లో సుమారు 20 మంది ఇజ్రాయిలీ పౌరులు మరణించారు. వెస్ట్ బ్యాంక్‌కు చెందిన నలుగురు పాలస్తీనియన్లు ఉన్నట్లు తెలిసింది. ఇక ఇరాన్ దాడి వల్ల సుమారు ఏడు వేల మంది ఇజ్రాయిలీలు గాయపడినట్లు ఆరోగ్యశాఖ వెల్లడించింది. ఇరాన్ మొదటి రోజు 80 మిస్సైళ్లు ఫైర్ చేసింది. ఆ తర్వాత రెండో రోజు 60, మూడో రోజు 30 క్షిపణులను వదిలింది. ఇక ఆ తర్వాత వారాల్లో సీజ్‌ఫైర్ కుదిరే వరకు ప్రతి రోజు ఇరాన్ సగటున 10 నుంచి 20 క్షిపణులను రిలీజ్ చేసినట్లు ఇజ్రాయెల్ పేర్కొన్నది. సుమారు 16 క్షిపణులు వార్‌హెడ్స్‌తో ఇజ్రాయెల్‌పై అటాక్ చేశాయని, వాటిల్లో వందల కిలోల పేలుడు పదార్థాలు ఉన్నట్లు మిలిటరీ పేర్కొన్నది. ఇజ్రాయిల్‌లోని జనసాంద్రత ఉన్న ప్రదేశాలపై ఆ బాంబులతో దాడి చేశారు. క్లస్టర్ బాంబు వార్‌హెడ్స్‌తో ఉన్న సుమారు 50 క్షిపణులను ఇరాన్ ఫైర్ చేసినట్లు ఇజ్రాయెల్ చెప్పింది. ఇరాన్ దాడిలో చనిపోయిన 24 మంది పౌరులే అని తెలిపింది. హోమ్ ఫ్రంట్ కమాండ్ ప్రకారం బాంబు దాడుల వల్ల ఇజ్రాయెల్‌లో సుమారు 5500 మంది చెల్లాచెదురయ్యారు. ఇక ఇరాన్‌పై సుమారు వెయ్యికిపైగా జరిగిన వైమానిక దాడుల్లో 18వేల బాంబులను ఇజ్రాయెల్ జార విడిచింది. ఐడీఎఫ్ నివేదికప్రకారం 4 వేల టార్గెట్లపై 10800 దాడులు జరిగినట్లు తెలిసింది. ఎయిర్ డిఫెన్స్ సిస్టమ్స్, బాలిస్టిక్ మిస్సైల్ లాంచర్లు, వెపన్ ప్రొడక్షన్ సైట్లు, న్యూక్లియర్ కేంద్రాలు, వివిధ ప్రధాన కార్యాలయాలు, మిలిటరీ కమాండర్లు, నేతలను టార్గెట్ చేస్తూ ఆ దాడులు జరిగాయన్నారు. ఇజ్రాయెల్‌కు చెందిన వైమానిక దళం ఇరాన్‌పై సుమారు 8500 దాడులు నిర్వహించినట్లు మిలిటరీ పేర్కొన్నది. ఇక ఇరాన్ సైనిక లక్ష్యాలపై అమెరికా సుమారు 13వేల దాడులు చేసినట్లు అమెరికా మిలిటరీ పేర్కొన్నది. ఇరాన్ ప్రయోగించిన 470 క్షిపణుల్లో 60 శాతం క్షిపణులను ధ్వంసం చేసినట్లు ఇజ్రాయల్ మిలిటరీ తెలిపింది. 200 లాంచర్లను ధ్వంసం చేసింది. టన్నెల్స్‌లో దాడి వల్ల 80 ప్రదేశాలు దెబ్బతిన్నట్లు ఐడీఎఫ్ చెప్పింది. వార్‌కు ముందు ఇరాన్ వద్ద సుమారు 2500 బాలిస్టిక్ క్షిపణులు ఉన్నట్లు ఐడీఎఫ్ అంచనా వేసింది. ఇరాన్ వద్ద ఇంకా సుమారు వెయ్యి క్షిపణులు ఉన్నట్లు ఐడీఎఫ్ ఇంటెలిజెన్స్ అంచనా వేసింది. ఇరాన్‌కు చెందిన 85 శాతం ఎయిర్ డిఫెన్స్, డిటెక్షన్ సిస్టమ్స్‌ను నాశనం చేసినట్లు ఇజ్రాయెల్ చెప్పింది.

# రాజ్యసభకు మళ్లీ హరివంశ్ నారాయణ్ సింగ్

## - నామినేట్ చేసిన రాష్ట్రపతి.. గెజిట్ విడుదల



**న్యూఢిల్లీ, ఏప్రిల్ 10:** ప్రస్తుత రాజ్యసభ డిప్యూటీ చైర్మన్ హరివంశ్ నారాయణ్ సింగ్ మళ్లీ పెద్దల సభకు నామినేట్ అయ్యారు. శుక్రవారం జారీ చేసిన ఒక గెజిట్ ప్రకటన ప్రకారం, రాష్ట్రపతి ద్రౌపది ముర్ము హరివంశ్ నారాయణ్ సింగ్‌ను రాజ్యసభ సభ్యుడిగా నామినేట్ చేశారు. ఇటీవలే నామినేటెడ్ సభ్యుడు రంజన్ గొగోయ్ పదవీ విరమణ కావడంతో ఏర్పడిన ఖాళీ స్థానంలో హరివంశ్ నారాయణ్ సింగ్‌కు రాష్ట్రపతి అవకాశం కల్పించారు. 2018 నుండి ఉపసభాపతిగా (డిప్యూటీ చైర్మన్గా) సేవలందించిన హరివంశ్, బీహార్ నుండి జెడి(యు) సభ్యుడిగా తన పదవీకాలం ఏప్రిల్ 9న పూర్తి కావడంతో, మళ్లీ నామినేట్ అయ్యారు. కాగా, హరివంశ్‌కు విశేషమైన పార్లమెంటరీ అనుభవం ఉంది. ఎగువ సభలో వివిధ కీలక కమిటీలకు ఆయన సేవలందించారు. 2014లో రాజ్యసభకు ఎన్నిక కావడంతో పార్లమెంటరీ జర్నీని ఆయన ప్రారంభించారు. 2020లో తిరిగి ఎన్నికయ్యారు. రాజ్యసభ చైర్మన్‌గా, గత బడ్జెట్ సమావేశాల్లో డిప్యూటీ స్పీకర్‌గా వ్యవహరించారు. క్లిష్ట పరిస్థితుల్లో ఆయన సభను నడిపించిన తీరు అధికార, ప్రతిపక్షాల ప్రశంసలు అందుకుంది. ఈ నేపథ్యంలో ఆయన సేవలను మరికొంత కాలం వినియోగించుకోవాలని కేంద్రం నిర్ణయించింది.

# ట్రంప్ చెప్పినా.. లెబనాన్‌పై వెనక్కి తగ్గని ఇజ్రాయెల్!

**టెల్అవీవ్, ఏప్రిల్ 10:** లెబనాన్‌పై దాడులను ఆపాలని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ విజ్ఞప్తి చేసినప్పటికీ ఇజ్రాయెల్ మాత్రం వెనక్కి తగ్గడం లేదు. రెండు పట్టణాలపై ఇజ్రాయెల్ దళాలు వైమానిక దాడులు జరిపాయని, కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఉల్లంఘించాయని లెబనాన్ ఆరోపించింది. అందుకే హెజ్‌బొల్లా ప్రతీకార దాడులు జరిపినట్లు పేర్కొంది. అయితే, లెబనాన్‌లో దాడులు ఆపకపోతే అమెరికాతో జరిపే శాంతి చర్చల నుంచి వైదొలుగుతామని ఇరాన్ హెచ్చరించిన తర్వాత ఈ పరిణామాలు చోటుచేసుకోవడం గమనార్హం. ఇజ్రాయెల్‌లోని మిస్గావ్ ఆమ్ ప్రాంతంలో రాకెట్ దాడులు చేశామని, తమ ప్రజలను రక్షించుకోవడంలో భాగంగానే ఈ ప్రతీకార చర్యలకు దిగినట్లు హెజ్‌బొల్లా ఓ ప్రకటనలో పేర్కొంది. కాల్పుల విరమణ ఒప్పందాన్ని పదే పదే ఉల్లంఘిస్తోన్న ఇజ్రాయెల్.. లెబనాన్ గ్రామాలపై దాడులు చేస్తుండటం వల్లే తాము ఈ విధంగా ప్రతిస్పందించాల్సి వస్తోందని తెలిపింది. మరోవైపు, రెండు వారాలపాటు కాల్పుల విరమణకు సంబంధించి అమెరికాతో జరిగే చర్చల్లో లెబనాన్ అంశం కూడా ఉందని ఇరాన్ చెబుతోంది. అయినప్పటికీ, ఇజ్రాయెల్ భారీ స్థాయిలో దాడులు జరుపుతోంది. ఇటీవల కేవలం పది నిమిషాల్లోనే 100 లక్ష్యాలపై దాడులు చేసినట్లు సమాచారం.

**మాజీ విదేశాంగ మంత్రి మృతి:** ఇరాన్‌లో ఇటీవల జరిగిన వైమానిక దాడుల్లో గాయపడిన ఆ దేశ మాజీ విదేశాంగ మంత్రి కమాల్ ఖరాజీ మృతి చెందినట్లు టెహ్రాన్ మీడియా పేర్కొంది. ఇరాన్ సంస్కరణవాది, అధ్యక్షుడు మొహమ్మద్ ఖతామీ హయాంలో ఖరాజీ విదేశాంగ మంత్రిగా.. సుప్రీం లీడర్ అయతుల్లా ఖమేనీకి విదేశీ వ్యవహారాల సలహాదారుడిగా పనిచేశారు. అణుబాంబు తయారు చేసే సాంకేతిక సామర్థ్యం ఇరాన్‌కు ఉందంటూ 2022లో సంచలన వ్యాఖ్యలు చేశారు. అయితే, దీన్ని రూపొందించడంపై ఇరాన్ ఇంకా నిర్ణయం తీసుకోలేదని అప్పట్లో ఆయన పేర్కొన్నారు.

# 40 రోజుల వార్‌లో ఐదువేలమంది ఇరానీ సైనికుల హతం!

## నివేదిక విడుదలచేసిన ఇజ్రాయెల్ ఐడిఎఫ్



**జెరూసలెం, ఏప్రిల్ 10:** ఇరాన్‌పై జరిగిన 40 రోజులయుద్ధంలో అనేక మంది ఇరానీ కమాండర్లను అంతంచేసామని ఇజ్రాయెల్ సైనిక విభాగం ఐడీఎఫ్ చెప్పింది. డజన్ల సంఖ్యలో సీనియర్, మీడియా రేంజ్ ఇరానీ ఆఫీసర్లను కూడా ఏరివేసినట్లు పేర్కొన్నది. ఇజ్రాయెల్ జరిపిన దాడుల్లో సుమారు 5 వేల మంది ఇరానీ సైనికులు మృతిచెందినట్లు ఐడీఎఫ్ ప్రకటించింది. వేల సంఖ్యలో ఇరానీ సైనికులు గాయపడినట్లు ఇజ్రాయెల్ చెప్పింది. మృతుల్లో అంతర్గత భద్రతా బలగాలు, బసిజి పారామిలిటరీ దళాలు ఉన్నట్లు తెలిసింది. ఇజ్రాయిలీ అటాక్‌లో మృతిచెందిన వారిలో ఖమేనీతో పాటు మిలిటరీ అడ్వైజర్ అలీ శామ్‌ఖానీ, ఐఆర్జీసీ కమాండ్ మొహమ్మద్ పాక్‌పౌర్, ఐఆర్జీసీ నేవీ చీఫ్ అలీరెజా తంగసిరి, ఐఆర్జీసీ ఇంటెలిజెన్స్ చీఫ్ మసీద్ ఖాదేమి, బసిజి పారామిలిటరీ దళ కమాండర్ గోలంరెజా సోలేమానీ, ఐఆర్జీసీ ప్రతినిధి అలీ మొహమ్మద్ నైని, నేషనల్ సెక్యూర్టీ కౌన్సిల్ హెడ్ అలీ లారిజారి, డిఫెన్స్ మినిస్టర్ అజీన్ నాసిర్‌జాద్‌ఏ, ఎస్‌ఎపీఎస్డీ చైర్మెన్ హుసేన్ జాబల్ అమేలియన్, ఖమేనీ మిలిటరీ సెక్రటరీ మొహమ్మద్ షిరాజి ఉన్నారు. ఇరాన్ న్యూక్లియర్ ప్రోగ్రామ్‌ను టార్గెట్ చేసినట్లు ఇజ్రాయెల్ చెప్పింది. ఇరానీ అణు కేంద్రాలపై దాడులు చేసినట్లు చెప్పింది. ఇరాన్ వద్ద సుమారు 60 శాతం శుద్ధీకరించిన 400 కేజీల యురేనియం ఉన్నట్లు ఇజ్రాయెల్ అనుమానం వ్యక్తం చేసింది. ఆ యురేనియంతో దాదాపు 11 అణు బాంబులను తయారు చేయవచ్చు అని ఇజ్రాయిల్ అధికారులు అంచనా వేశారు. యాజ్ద్ పట్టణం వద్ద ఉన్న న్యూక్లియర్ ప్లాంట్‌పై దాడి చేసినట్లు ఐడీఎఫ్ తెలిపింది. అరాక్‌లో ఉన్న హెవీ వాటర్ రియాక్టర్‌పైనా దాడి జరిగింది. టెహ్రాన్‌లోని మలేక్ అస్తార్ యూనివర్సిటీలో ఉన్న న్యూక్లియర్ రీసర్చ్ డెవలప్మెంట్ సైట్, పార్చిన్ మిలిటరీ కాంప్లెక్స్‌లోని తలేగాన్ 2 కేంద్రం, మిన్‌జాదేహా సీక్రెట్ అండర్‌గ్రౌండ్ కేంద్రంతో పాటు ఇతర అణు కేంద్రాలను టార్గెట్ చేసినట్లు ఇజ్రాయెల్ తెలిపింది. ఇరాన్‌కు ఆర్థిక నష్టం కలిగించే గ్యాస్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌పై అటాక్ చేసినట్లు ఐడీఎఫ్ నివేదిక విడుదలచేసింది. రెండు భారీ స్టీల్ ఫ్యాక్టరీలు, పెట్రోకెమికల్ కేంద్రాలు, 10 కీలకమైన రైలు మార్గాలు, బ్రిడ్జలను పేల్చినట్లు ఐడీఎఫ్ తెలిపింది. పెట్రోకెమికల్ కేంద్రాల్లో ఇరాన్ బాలిస్టిక్ క్షిపణులను తయారు చేసినట్లు ఇజ్రాయెల్ ఆరోపించింది. రైలు మార్గాలు, బ్రిడ్జల ద్వారా ఆయుధాలను ఇరాన్ సరఫరా చేసినట్లు ఐడీఎఫ్ ఆరోపించింది.

# ఉక్రెయిన్ యుద్ధంలో తాత్కాలికకాల్పుల విరమణ

**మాస్కో, ఏప్రిల్ 10:** రష్యాఉక్రెయిన్ యుద్ధంలో ఆర్థడాక్స్ ఈస్టర్ పండుగను పురస్కరించుకుని ఉక్రెయిన్‌తో తాత్కాలిక కాల్పుల విరమణ పాటిస్తున్నట్లు రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ ప్రకటించారు. ఈ మేరకు క్రెమ్లిన్ ఒక ప్రకటన విడుదల చేసింది. ఏప్రిల్ 11వ తేదీ, శుక్రవారం సాయంత్రం 4 గంటల నుంచి ఏప్రిల్ 12వ తేదీ, శనివారం అర్ధరాత్రి వరకు ఈ కాల్పుల విరమణ అమల్లో ఉంటుందని క్రెమ్లిన్ తెలిపింది. ఈ కాలంలో అన్ని దిశల్లో పోరాట చర్యలను నిలిపివేయాలని రష్యా సైనిక దళాల జనరల్ స్టాఫ్‌కు అధ్యక్షుడు పుతిన్ స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. అయితే, శత్రువుల నుంచి ఎలాంటి రెచ్చగొట్టే చర్యలు ఎదురైనా వాటిని సమర్థంగా తిప్పికొట్టేందుకు తమ దళాలు సిద్ధంగా ఉంటాయని ప్రకటనలో పేర్కొన్నారు. రష్యా తీసుకున్న ఈ నిర్ణయాన్ని ఉక్రెయిన్ కూడా గౌరవించి, కాల్పుల విరమణ పాటిస్తుందని ఆశిస్తున్నట్లు క్రెమ్లిన్ వెల్లడించింది. కాగా, కొన్ని రోజుల క్రితం ఉక్రెయిన్ అధ్యక్షుడు వొలొదిమిర్ జెలెన్‌స్కీ కూడా ఈస్టర్ పండుగ సందర్భంగా యుద్ధానికి విరామం ఇవ్వాలని అమెరికా ద్వారా ప్రతిపాదించారు. గత నాలుగేళ్లుగా కొనసాగుతున్న ఈ యుద్ధాన్ని ముగించేందుకు అమెరికా నేతృత్వంలో జరిగిన పలు దఫాల చర్చలు విఫలమయ్యాయి.

మధ్యప్రాచ్యంలో ఇరాన్ అంశంపై అమెరికా దృష్టి సారించడంతో ఈ చర్చలు మరింత మందగించాయి. భూభాగ, రాజకీయపరమైన డిమాండ్లను రష్యా ముందుంచగా, వాటిని అంగీకరించడం లొంగిపోవడమేనని ఉక్రెయిన్ తిరస్కరిస్తోంది. ఈ యుద్ధం కారణంగా లక్షలాది మంది ప్రాణాలు కోల్పోగా, కోట్ల మంది నిరాశ్రయులయ్యారు.



# అలహాబాద్ హైకోర్టు జడ్జి జస్టిస్ యశ్వంత్‌వర్మ రాజీనామా

## ఔట్‌హౌస్‌లో నోట్లకట్టలు బయటపడిన కేసులో విచారణ!

**అలహాబాద్, ఏప్రిల్ 10:** అలహాబాద్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ యశ్వంత్ వర్మ తన పదవికి ఆకస్మికంగా రాజీనామా చేశారు. తనపై అభిశంసన ప్రక్రియ కొనసాగుతున్న నేపథ్యంలో ఆయన ఈ అనూహ్య నిర్ణయం తీసుకున్నారు. తన రాజీనామా లేఖను రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు పంపారు. ఈ లేఖ కాపీని భారత ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) జస్టిస్ సూర్యకాంత్‌కు కూడా పంపినట్లు తెలిసింది. గతేడాది మార్చి 14న జస్టిస్ వర్మ ఢిల్లీ హైకోర్టు జడ్జిగా ఉన్నప్పుడు ఆయన అధికారిక నివాసంలోని ఔట్‌హౌస్‌లో కాలిపోయిన నోట్ల కట్టలు దొరికాయన్న ఆరోపణలతో ఆయన తీవ్ర వివాదంలో చిక్కుకున్నారు. ఈ ఘటన దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. దీని ఫలితంగా 2025 జులైలో లోక్‌సభలో 145 మంది, రాజ్యసభలో 63 మంది ఎంపీలు ఆయనపై అభిశంసన తీర్మానానికి నోటీసులు ఇచ్చారు. దీంతో లోక్‌సభ స్పీకర్ జడ్జెస్ (ఇన్‌క్వైరీ) యాక్ట్, 1968 ప్రకారం ఆరోపణలపై దర్యాప్తు చేసేందుకు ముగ్గురు సభ్యులతో కూడిన విచారణ కమిటీని ఏర్పాటు చేశారు. ఈ కమిటీ ఏర్పాటును జస్టిస్ వర్మ సుప్రీంకోర్టులో సవాలు చేశారు. అయితే, ఆయన పిటిషన్‌ను జస్టిస్ దీపాంకర్ దత్తా, జస్టిస్ సతీశ్ చంద్ర శర్మలతో కూడిన ధర్మాసనం తోసిపుచ్చింది. అంతకుముందు సుప్రీంకోర్టు అంతర్గత కమిటీ ఇచ్చిన నివేదికను సవాల్ చేసినా ఆయనకు చుక్కెదురైంది. తన రాజీనామా లేఖలో తీవ్ర ఆవేదనతో ఈ పదవి నుంచి వైదొలగుతున్నాను.

# రాజ్యసభ సభ్యుడిగా నితీశ్ ప్రమాణం

## - 13 లేదా 14న సిఎం పదవికి రాజీనామా - బీహార్ కొత్త సిఎంగా సామ్రాట్ చౌదరి?



**న్యూఢిల్లీ, ఏప్రిల్ 10:** బీహార్ ముఖ్యమంత్రి నితీశ్ కుమార్ తన సుదీర్ఘ రాజకీయ ప్రస్థానంలో కీలక మలుపు తీసుకున్నారు. నితీశ్ శుక్రవారం రాజ్యసభ సభ్యుడిగా ప్రమాణస్వీకారం చేశారు. రాజ్యసభ చైర్మన్ సిపి రాధాకృష్ణన్ ఆయన చేత ప్రమాణ స్వీకారం చేయించారు. కేంద్ర మంత్రి జెపి నడ్డా సమక్షంలో హిందీ భాషలో నితీశ్ కుమార్ ప్రమాణం చేశారు. కేంద్ర మంత్రులు నిర్మలా సీతారామన్, అర్జున్ రామ్ మేఘావల్ కూడా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. జెడియు నేత, పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ సంజయ్ కుమార్ ఝా, కాంగ్రెస్ నేత జయరాం రమేశ్, బిజెపి ఎంపిలు రాజీవ్ ప్రతాప్ రూఢీ కూడా ప్రమాణ స్వీకారోత్సవానికి హాజరయ్యారు. రాజ్యసభ సభ్యుడిగా నితీశ్ కుమార్ ప్రమాణం చేసిన నేపథ్యంలో.. ఇక బీహార్‌లో ఆయన ప్రస్థానం ముగిసినట్లుగా రాజకీయ పరిశీలకులు అభిప్రాయపడుతున్నారు. ఇక జాతీయ రాజకీయాలకే పరిమితం కానున్నట్లు స్పష్టమైంది. ఇదిలా ఉండగా, త్వరలోనే బీహార్ ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేయనున్నట్లు నితీశ్ స్వయంగా వెల్లడించారు. ఈ సందర్భంగా ఢిల్లీలో నితీశ్ కుమార్ మాట్లాడుతూ "బీహార్‌లో చాలా పనులు చేశాను. ఇక ఇక్కడే (ఢిల్లీ) ఉండి సేవ చేయాలని భావిస్తున్నాను. మూడు నాలుగు రోజుల్లో సిఎం పదవికి రాజీనామా చేస్తాను. కొత్త ముఖ్యమంత్రి, మంత్రులు బాధ్యతలు చేపడతారు" అని స్పష్టం చేశారు. దీంతో ఈ నెల 13 లేదా 14న సిఎం పదవికి రాజీనామా చేస్తారని తెలుస్తోంది. రాజ్యసభ సభ్యుడిగా ప్రమాణస్వీకారం చేయడంతో నితీశ్ కుమార్ తన ఖాతాలో ఓ అరుదైన ఘనతను చేర్చుకున్నారు. రాష్ట్ర శాసనసభ, శాసనమండలి, లోక్‌సభ, రాజ్యసభ.. ఇలా నాలుగు చట్టసభల్లోనూ సభ్యుడిగా పనిచేసిన కొద్దిమంది నేతల జాబితాలో ఆయన చేరారు.

# ఉగ్రవాదులు నమాజ్‌చేస్తున్నారని దాడిని వాయిదావేసాం!

## ఆపరేషన్ సిందూర్‌పై ఆర్మీచీఫ్ జనరల్ ఉపేంద్ర ద్వివేది




**న్యూఢిల్లీ, ఏప్రిల్ 10:** పాక్ ఆక్రమిత కాశ్మీర్‌లో ఉగ్రవాద శిబిరంపై ఆపరేషన్ సిందూర్ పేరుతో దాడి చేసేందుకు సిద్ధమైనప్పుడు, అక్కడ ఉగ్రవాదులు నమాజ్ చేస్తున్నారని తెలిసి దాడిని ఉద్దేశపూర్వకంగా వాయిదా వేసినట్లు భారత ఆర్మీ చీఫ్ జనరల్ ఉపేంద్ర ద్వివేది తెలిపారు. సైనిక లక్ష్యాలతో పాటు మానవతా విలువలకు కూడా ప్రాధాన్యత ఇస్తామని చెప్పడానికి ఇది నిదర్శనమని ఆయన పేర్కొన్నారు. రిషభ్ షా హోస్ట్‌గా వ్యవహరిస్తున్న ఐఎంయూఎన్ వారి బిఫోర్ ఐ బికేమ్ మీ అనే పాడ్‌కాస్ట్‌లో జనరల్ ద్వివేది మాట్లాడారు. మేము ఆ లక్ష్యాలను ఎప్పుడైనా ధ్వంసం చేయవచ్చు. కానీ, ఉగ్రవాద శిబిరంలో వారు నమాజ్ చేస్తున్న సమయంలో దాడి చేయకూడదని నిర్ణయించుకున్నాం. ఎందుకంటే అందరి దేవుడు ఒక్కడే. అందుకే వారు ప్రార్థనలో లేని సమయాన్ని ఎంచుకున్నాం అని ద్వివేది వివరించారు. ఈ సందర్భంగా తన వ్యక్తిగత జీవితం, నాయకత్వ శైలి గురించి కూడా ఆయన పంచుకున్నారు. సైన్యంలో మహిళల చేరిక, పని వాతావరణం వంటి విషయాల్లో తన కుమార్తెలు మార్గనిర్దేశం చేస్తారని తెలిపారు. వారు చెప్పే విషయాలను నేను చాలా సీరియస్‌గా తీసుకుంటాను. అవసరమైన చోట వాటిని అమలు చేస్తాను. వారే నాకు ఈ మార్పులను ఎలా స్వీకరించాలో నేర్పారని ఆయన అన్నారు. తన సైనిక్ స్కూల్, నేషనల్ డిఫెన్స్ అకాడమీ రోజుల గురించి మాట్లాడుతూ, మార్కుల కన్నా వైఖరి, పరిస్థితులకు అనుగుణంగా మారగలగడమే ముఖ్యమని జనరల్ ద్వివేది అభిప్రాయపడ్డారు. మార్కులు కేవలం చదువులోని ప్రతిభకు సూచిక మాత్రమే, అవి మీ వ్యక్తిత్వాన్ని నిర్ధారించలేవని ఆయన వ్యాఖ్యానించారు. అత్యంత క్లిష్టమైన కౌంటర్ టెర్రరిజం ఆపరేషన్లలో నైతిక సందిగ్ధత ఎదురైనప్పుడు, నిర్ణయాలు తీసుకోవడానికి భగవద్గీత,ఆధ్యాత్మిక గ్రంథాలు ఎంతగానో సహాయపడతాయన్నారు.



## క్రీడాస్ఫూర్తితో బాల్యం నుంచి ఎదిగితే విశాలదృక్పథం

### మంత్రి సురేఖ మనవడిని అభినందించిన పిసిసి చీఫ్ మహేష్, ఎంపి చామల

**హైదరాబాద్, ఏప్రిల్ 10, ప్రభాతవార్త:** క్రీడాస్ఫూర్తితో బాల్యం నుంచి ఎదిగితే విశాలధృక్పథం కలిగి సమాజానికి ఉపయోగపడే ఆలోచనలు చేస్తారని పిసిసి చీఫ్ మహేష్‌కుమార్‌గౌడ్ అన్నారు. అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ మనవడు కొండా శ్రీఅన్ష్ మురళీకృష్ణ పటేల్ అసాధారణ ప్రతిభను కనబరిచి, మూడేళ్ల వయసులోనే చదరంగం క్రీడలో రెండు ప్రపంచ రికార్డులను నెలకొల్పారు. లండన్‌కు చెందిన వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్ సర్టిఫికేట్లను పొందిన సందర్భంగా చిన్నారిని గాంధీభవన్‌లో శుక్రవారం పలువురు ప్రముఖులు ఘనంగా సత్కరించారు. పిసిసి అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్, ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య, తుంగతుర్తి శాసన సభ్యుడు మందుల సామేల్ తదితరులు చిన్నా రిని కలిసి అభినందనలు తెలిపారు. ఇంత చినవయసులో ప్రపంచస్థాయి గుర్తింపు తెచ్చుకోవడం రాష్ట్రానికే గర్వకారణమని వారు కొనియాడారు. మహేష్‌కుమార్ మాట్లా డుతూ ప్రభుత్వం క్రీడాకారుల నైపుణ్యం పెంచడానికి అధిక ప్రాధా న్యత ఇస్తోందని అన్నారు. పిన్నవయసులోనే విశిష్ట ప్రతిభ కనబ రుస్తూ అంత ర్జాతీయ స్థాయిలో గుర్తింపు తెచ్చుకున్న శ్రేయాన్ష్‌ను ప్రశంసిస్తూ, రాబోయే రోజుల్లో మరిన్ని విజయాలు సాధించి దేశానికి, రాష్ట్రానికి మరింత కీర్తి తీసుకురావాలని నాయకులు ఆకాంక్షించారు. బాలబాలికలకు తలితండ్రులు క్రీడల్లో రాణించేందుకు చిన్నతనం నుంచి ప్రోత్సహించాలని కోరారు.

## 17న భోజన విరామంలో నల్లబ్యాడ్జీలతో నిరసన

### పత్రాన్ని సిఎస్‌కు అందజేసిన టిజిఇజెఎసి

**హైదరాబాద్, ఏప్రిల్ 10, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్ల సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 17న భోజన విరామ సమయంలో నల్ల బ్యాడ్జిలతో నిరసన తెలియజేయాలని తెలంగాణ ఉద్యోగ జేఏసీ నిర్ణయించిన నేపథ్యంలో ఈ నిర్ణయాన్ని తెలియజేస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె రామకృష్ణారావుకు జేఏసీ నేతలు శుక్రవారం వినతి పత్రాన్ని సమర్పించారు. ఈ కార్యక్రమంలో జేఏసీ ఛైర్మన్ మారం జగదీశ్వర్, సెక్రటరీ జనరల్ ఏలూరి శ్రీనివాస్ రావుతోపాటు జేఏసీ నేతలు దామోదర్‌రెడ్డి, బి. శ్యామ్, జి. సదానందం గౌడ్, కటకం రమేష్, రామారావు, జుట్టు గజేందర్, పి. వెంకట్ రెడ్డి,.పర్వత్ రెడ్డి పాల్గొన్నారు. తెలంగాణ ఉద్యోగ, గెజిటెడ్ అధికారుల, ఉపాధ్యాయుల, కార్మిక పెన్షనర్స్ జాయింట్ యాక్షన్ కమిటీ రాష్ట్ర విస్తృతస్థాయి కార్యనిర్వాహక సమావేశంలో తీసుకున్న తీర్మానాల మేరకు, రాష్ట్రవ్యాప్తంగా ఉద్యోగుల దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న ప్రధాన సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వానికి వినతి పత్రాలు సమర్పించే కార్యక్రమాన్ని ప్రారంభించింది. ఈ 17న తెలంగాణ రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో, హైదరాబాద్ సిటీ(హెచ్‌వోడీ), సెక్రటేరియట్‌తో పాటు మండల, డివిజన్, జిల్లా కలెక్టర్ కార్యాలయాలలో సంబంధిత అధికారులకు వినతిపత్రాలు అందజేయనున్నట్టు జేఏసీ నేతలు సీఎస్ దృష్టికి తీసుకొచ్చారు. రాష్ట్రంలోని సుమారు 15.25 లక్షల ఉద్యోగులను ప్రాతినిధిత్వం వహిస్తున్న 206 సంఘాల తరఫున ఈ చర్యలు చేపట్టబడుతున్నట్టు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు సంబంధించిన మిగిలిన దీర్ఘకాలిక పెండింగ్‌లో ఉన్న 64 అంశాలను కూడా ప్రభుత్వం తక్షణమే పరిశీలించి పరిష్కరించాలని జేఏసీ నేతలు కోరారు.

## తెలంగాణలో మహిళల భద్రతకు సమాధి

### వర్ధన్నపేటలో యువతిపై మృగాళ్ల గ్యాంగ్‌రేప్ దారుణం

### రాష్ట్ర మహిళా మోర్చా అధ్యక్షురాలు మేకల శిల్పారెడ్డి

**హైదరాబాద్, ఏప్రిల్ 10, ప్రభాతవార్త:** వరంగల్ జిల్లా వర్ధన్నపేట నియోజకవర్గం రాయపర్తి మండలంలో ఓ యువతిపై సామూహిక అత్యాచారం, హత్య జరిగిన ఘటన తీవ్రంగా కలచివేస్తుందని రాష్ట్ర మహిళా మోర్చా రాష్ట్ర అధ్యక్షురాలు డా. మేకల శిల్పారెడ్డి మండిపడ్డారు. ఈ దారుణాన్ని బిజెపి తెలంగాణ మహిళా మోర్చా తరపున తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. తెలంగాణలో కాంగ్రెస్ సర్కారు ఆడబిడ్డల భద్రత పూర్తిగా గాలికొదిలేశారని అనడానికి ఈ ఘటనే నిదర్శనం అన్నారు. గంజాయి మత్తులో కొందరు మృగాళ్లు ఒక యువతిపై సామూహిక అత్యాచారానికి పాల్పడి, ఆమె ప్రాణాలు తీయడం సభ్య సమాజం తలదించుకోవాల్సి న విషయం. తెలంగాణ మహిళల భద్రత పూర్తిగా సమాధి అయిందనడానికి సజీవ సాక్ష్యం అన్నారు. ఈ కేసులో పోలీసుల వ్యవహారశైలి అత్యంత హేయంగా ఉందని, కన్నబిడ్డను కోల్పోయి పుట్టెడు దుఃఖంలో ఉన్న కుటుంబ సభ్యులను ఓదార్చాల్సింది పోయి, పోలీసులు అధికార పార్టీకి తొత్తుల్లా మారి బాధితులనే అవమానించడం దారుణం అన్నారు. యువతి శరీరంపై రక్తపు గాయాలు స్పష్టంగా కనిపిస్తుంటే, గంజాయి మత్తులో మృగాళ్లు అఘాయిత్యం చేశారని ఆరోపణలు వస్తుంటే, ఆమెను చీమలు కరవడం వల్లే రక్తం వచ్చి చనిపోయిందంటూ బాధ్యతా రహితంగా పోలీసులు చెబుతున్న సమాధానాలు వింటుంటే రాష్ట్రంలో శాంతిభద్రతలు ఏ స్థాయిలో దిగజారాయో అర్థమవుతుందన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వయంగా హోంమంత్రి పదవిలో ఉన్నారని, అయినా రాష్ట్రంలో నేరాలు అదుపులోకి రాకపోవడం కాంగ్రెస్ ప్రభుత్వ అసమర్థతకు పరాకాష్ట అన్నారు. నిందితుల పేర్లు బయటకు వచ్చినా పోలీసులు తక్షణమే స్పందించకపోవడం వెనుక ఎవరి ఒత్తిళ్లు ఉన్నాయి? నేరం జరిగాక కళ్లు తెరవడం కాదు, అసలు ఇలాంటి దారుణాలు జరగకుండా ప్రభుత్వం ఏం చేస్తోంది? గంజాయి, డ్రగ్స్ నెట్‌వర్క్‌ను పెకిలించడం మీ వల్ల కాకపోతే తక్షణమే హోంమంత్రి పదవి నుంచి తప్పుకోవాలన్నారు.

## డిఇఇ సెట్-2026కు 20,705 దరఖాస్తులు

### 15 వరకు తుది గడువు

**హైదరాబాద్, ఏప్రిల్ 10, ప్రభాతవార్త:** డిప్లొమా ఇన్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్ కామన్ ఎంట్రన్స్ టెస్ట్(టిజిడీఈఈ సెట్-2026)కి సంబంధించి ఇప్పటి వరకు 20,705 దరఖాస్తులు వచ్చాయి. మార్చి15 నుంచి దరఖాస్తులను ఆన్‌లైన్‌లో స్వీకరిస్తున్నట్టు డీఈఈ సెట్-2026 కన్వీనర్ జి రమేష్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2026-27 విద్యా సంవత్సరం కోసం తెలంగాణ రాష్ట్రంలోని ప్రభుత్వ డైట్స్, ప్రైవేట్ అన్‌ఎయిడెడ్ ఎలిమెంటరీ టీచర్ ఎడ్యుకేషన్ ఇన్స్టిట్యూషన్స్ (డీఈఎల్.ఈడీ) (మైనారిటీ, నాన్ మైనారిటీతో సహా)లో రెండేళ్ల కోర్సులో ప్రవేశానికి కంప్యూటర్ ఆధారిత పరీక్ష (సీబీటీ) ఆన్‌లైన్ విధానం ద్వారా టిజి డీఈఈ సెట్-2026 ద్వారా డిప్లొమా ఇన్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్(డీఈఎల్.ఈడీ), డిప్లొమా ఇన్ ప్రీ స్కూల్ ఎడ్యుకేషన్(డీపీఎస్ఈ) కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తూ ఫిబ్రవరి 27న నోటిఫికేషన్‌ను వెబ్‌సైట్‌లో పొందుపరిచారు. ఇప్పటి వరకు 20,705 దరఖాస్తులు వచ్చాయి. అందులో తెలుగు మీడియం నుంచి 7543, ఇంగ్లీష్ మీడియంకి 12,256, ఉర్దూ మీడియంకి 906 దరఖాస్తులు వచ్చినట్టు తెలిపారు. ఈ నెల 17, 18 తేదీల్లో దరఖాస్తుల్లో దొర్లిన తప్పులను సరిచేసుకోవడానికి ఎడిట్ సౌకర్యం కల్పించినట్టు తెలిపారు. డీఈఈ సెట్ పరీక్షను మే 21, 22 తేదీల్లో నిర్వహించనున్నారు. ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగ అభ్యర్థులకు రూ. 450 ఫీజు కాగా.. ఇతరులకు రూ. 500గా నిర్ణయించారు. ఇతర వివరాలకు 8317567404 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

# రాష్ట్రాల్లో చిన్న వయసు.. నిర్ణయాలలో పెద్దమనసు

### రుణమాఫీ చేసిన ఏకైక ప్రభుత్వం

### రైతు సంక్షేమాన్ని ఓర్వలేకనే విమర్శలు

### బిఆర్ఎస్ తీరుపై మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

**హైదరాబాద్, ఏప్రిల్ 10, ప్రభాతవార్త:** దేశంలోని రాష్ట్రాల్లో చిన్నవయసు రాష్ట్రమైనా పెద్ద రాష్ట్రాలకు సైతం ఆదర్శంగా నిలిచేవిధంగా సాహసోపేతమైన నిర్ణయాలు తీసుకుంటూ రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకు సాగుతోందని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. ప్రజల సంక్షేమమే లక్ష్యంగా, పక్షపాతిగా నిలుస్తూ ఇచ్చిన ప్రతి హామీని నెరవేరుస్తోందని స్పష్టం చేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చేనాటికి చిన్నాభిన్నంగా రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ ఉన్నప్పటికీ రైతులకు ఇచ్చిన మాటను నిలబెట్టుకుంటూ 2 లక్షలలోపు ఉన్న పంట రుణమాఫీని చేశామని గుర్తు చేశారు. తెలంగాణ ప్రభుత్వ ఈ నిర్ణయం దేశంలోనే ఒక మైలురాయిగా నిలిచిందని, ఇతర రాష్ట్రాలకు మార్గదర్శకంగా మారిందని పేర్కొన్నారు. దక్షిణాది రాష్ట్రాల్లో తెలంగాణలోనే రైతుల పంట రుణబాకీలు అతి తక్కువ అని కేంద్రం సమర్పించిన నివేదిక ద్వారా ఈ విషయం స్పష్టమైందని గుర్తు చేశారు. వాస్తవాలు ఇలా ఉంటే బిఆర్ఎస్ నాయకులు చేస్తున్న విమర్శలు అర్థరహితమైనవన్నారు. పూర్తిగా రాజకీయ ప్రయోజనాల కోసమే ప్రభుత్వాన్ని విమర్శిస్తున్నారని మండి పడ్డారు. 2014లో రాష్ట్రం మిగులు బడ్జెట్‌తో ఉన్నప్పటికి లక్ష వరకు రుణమాఫీని ఒకేసారి చేయలేక పోయారని బిఆర్ఎస్‌పై మండిపడ్డారు. దాంతో రైతులకు రుణమాఫీ కాక పోగా రూ. 2630 కోట్ల వడ్డీ భారం పడిందన్నారు. అధికారంలో ఉన్న పదేళ్ల పాటు రైతులను నిరక్ష్యం చేసిన బిఆర్ఎస్..ఇప్పుడు రైతులపై కపట ప్రేమ చూపుతోందని దుయ్యబట్టారు. రేవంత్ సర్కారు చేసిన ఒకేసారి పంట రుణమాఫీతో రూ. 20,616.89 కోట్ల పంట రుణాలుమాఫీ కాగా 25,35,964 మంది రైతులు లబ్ధిపొందారని మంత్రి తుమ్మల వివరించారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వంలా ఒడ్డు చేరే వరకు ఓడ మల్లన్న, ఒడ్డు చేరాక బోడి మల్లన్న అన్న చందంగా కాకుండా ప్రతీ రైతుకు న్యాయం జరిగేలా కాంగ్రెస్ ప్రభుత్వం చర్యలు తీసుకుందని స్పష్టం చేశారు. అయితే ప్రభుత్వంపై విమర్శలు చేయడం తప్ప బిఆర్ఎస్ నేతలకు మరో పని లేదని విమర్శించారు. రైతులను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. రైతులు అన్నీ గమనిస్తున్నారని తగిన సమయంలో మరోసారి బిఆర్ఎస్‌కు బుద్ధి చెబుతారని మంత్రి తుమ్మల స్పష్టం చేశారు. రైతుల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని, భవిష్యత్తులోనూ రైతుల కోసం మరిన్ని సంక్షేమ కార్యక్రమాలు అమలుచేసి, వ్యవసాయ రంగాన్ని మరింత బలోపేతం చేస్తామని ప్రకటించారు.

# మొబైల్‌ఫోన్‌ల కొనుగోలు పారదర్శకమే

### ఎలాంటి అవకతవకలు జరగలేదు

### అసత్య ఆరోపణలు చేస్తే న్యాయపరమైన చర్యలు: మంత్రి సీతక్క

**హైదరాబాద్, ఏప్రిల్ 10, ప్రభాతవార్త:** కేంద్ర ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారమే అంగన్‌వాడిలకు సెల్‌ఫోన్లను కొనుగోలు చేశామని, ఇందులో ఎలాంటి అక్రమాలు చోటు చేసుకోలేదని రాష్ట్ర స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క స్పష్టం చేశారు. సెల్‌ఫోన్ల కొనుగోలులో అక్రమాలు జరిగాయన్న ఆరోపణలు పూర్తిగా అవాస్తవమన్నారు.

కేంద్రం ఇచ్చిన ధర మేరకు ఓపెన్ టెండర్లు, ఆన్‌లైన్ టెండర్ల ద్వారా ఆహ్వానించి ఫోన్‌లను అతితక్కువ ధరకు కొనుగోలు చేశామని తేల్చి చెప్పారు.

ఈ విషయమై శుక్రవారం ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. అవినీతి జరిగిం దని అవాస్తవమైన ఆరోప ణలు చేసేవారిపై కోర్టు ద్వారా న్యాయపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రూ. 11,650 రూపాయలకే సెల్ ఫోన్ కొనుగోలు చేస్తే కావాలని రూ.14 వేలకు కొనుగోలు చేశారని అని విష ప్రచారం చేయడం సరికాదన్నారు.

కేంద్ర ప్రభుత్వం నుండి అంగన్‌వాడీల జీతాల విష యంలో సహకారం అందడం లేదని, ఈ సమ స్యపై పలుమార్లు కేంద్ర మంత్రిని సైతం కలిశా మన్నారు. అంగన్‌వాడీ టీచర్లకు ఎప్పటికీ ఒకేలా ఉండేలా యూనిఫామ్‌లను అందజేస్తాం. హైదరాబాద్ వంటి నగరాల్లో ముమ్ముందు మొబైల్ అంగన్‌వాడీలను సైతం ఏర్పాటు చేస్తామని తెలిపారు.

# మే నుండి థియేటర్లు బంద్!

### టాలీవుడ్‌లో పర్సంటేజ్ సంక్షోభం

**హైదరాబాద్, ఏప్రిల్ 10, ప్రభాతవార్త:** సినిమా థియేటర్లలో పర్సెంటేజీ వివాదం తెలుగు చలన చిత్ర పరిశ్రమ (టాలీవుడ్) లో సంక్షోభాన్ని రేపింది. సినీ పరిశ్రమలో థియేటర్లలో ఇప్పటి వరకూ అమలైన అద్దె విధానాన్ని రద్దు చేసి తాజాగా పర్సెంటేజీ పద్దతిని అమలు చేయాలని తెలంగాణ ఎగ్జిబిటర్లు (థియేటర్ల యాజమాన్యాలు) నిర్ణయంతో చిత్ర పరిశ్రమలో వివాదం తలెత్తింది. దీన్ని నిర్మాతలు (ప్రొడ్యూసర్స్) వ్యతిరేకిస్తున్నారు. మల్టీప్లెక్స్ తరహా మూవీ వసూళ్లలో వాటా కావాలని తెలంగాణ ఎగ్జిబిటర్లు పట్టుబడుతున్నారు. దీనిపై చిత్ర పరిశ్రమలో వివాదం నడుస్తుండగా, మల్టీప్లెక్స్ తరహాలోనే సింగిల్ స్క్రీన్ థియేటర్లకు కూడా పర్సెంటేజీ విధానాన్ని అమలు చేయాలని తెలంగాణ ఫిల్మ్ ఛాంబర్ శుక్రవారం సంచలన నిర్ణయం తీసుకుంది. దీనిపై ఏప్రిల్ 30వ తేదీ లోపు తుది నిర్ణయం తీసుకోవాలని ఫిల్మ్ ఛాంబర్ డెడ్‌లైన్ విధించింది. దీనిపై నిర్మాతల మండలి తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేయడంతో టాలీవుడ్లో కొత్త సంక్షోభం నెలకొంది. మరోపక్క హైదరాబాద్‌లోని 23 థియేటర్లలో ప్రయోగాత్మకంగా పర్సెంటేజీ విధానాన్ని అమలు చేస్తున్నట్లుగా ఎగ్జిబిటర్ల సంఘం తాజాగా ప్రకటించింది.

ఈ ప్రతిపాదన ప్రకారం సినిమా విడుదలైన తొలి వారం వసూళ్లు అయిన ఆదాయంలో 60 శాతం, రెండో వారం 50 శాతం, మూడో వారం 40 శాతం చొప్పున థియేటర్లకు వాటా ఇవ్వాల్సి ఉంటుంది. ప్రస్తుతం థియేటర్లకు ఉన్న ఫిక్స్‌డ్ అద్దె విధానం వల్ల సింగిల్ స్క్రీన్ థియేటర్లు తీవ్రంగా నష్టపోతున్నాయని ఎగ్జిబిటర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పెద్ద సినిమాలు ఆడినా, ఆడకపోయినా నిర్వహణ ఖర్చులు భారం అవుతున్నాయని, అందుకే మల్టీప్లెక్స్ తరహా షేరింగ్ పద్ధతే మంచిదని తేల్చిచెబుతున్నారు. కాగా ఎగ్జిబిటర్లు, ఫిల్మ్ ఛాంబర్ చేసిన పర్సంటేజ్ ప్రతిపాదనలను నిర్మాతల మండలి (ప్రొడ్యూసర్స్ గిల్డ్) ససేమిరా అంటోంది. తెలంగాణ ఫిల్మ్ ఛాంబర్ తీసుకున్న నిర్ణయాన్ని నిర్మాతల గిల్డ్ తీవ్రంగా వ్యతిరేకిస్తోంది. థియేటర్లకు భారీగా పర్సెంటేజీలు ఇవ్వడం కుదరదని, ఇది నిర్మాతలపై అదనపు భారం మోపడమేనని గిల్డ్ స్పష్టం చేసింది. ఈ నేపథ్యంలో ఈ నెలాఖరులోగా దీనిపై నిర్మాతల మండలి నిర్ణయం తీసుకోకపోయినట్లయితే మే 1వ తేదీ నుంచి రాష్ట్రవ్యాప్తంగా సింగిల్ స్క్రీన్ థియేటర్లను మూసివేసే ఆలోచన చేయనున్నట్లు ఎగ్జిబిటర్ల సంఘం హెచ్చరించింది. దీంతో చిత్ర పరిశ్రమలో పర్సంటేజ్ విధానం రాజుకుంటున్నట్లయింది.

## గ్రామస్థాయి నుంచి కాంగ్రెస్ సంస్థాగత పటిష్టతకు కార్యాచరణ

### పిసిసి అధ్యక్షుడు మమేష్‌కుమార్‌గౌడ్

**హైదరాబాద్, ఏప్రిల్ 10, ప్రభాతవార్త:** గ్రామస్థాయి నుంచి కాంగ్రెస్ పార్టీ సంస్థాగత పటిష్టతకు కార్యచరణ రూపొందిస్తున్నామని డిసిసి ప్రసిడెంట్లు ప్రకటించి అనేక జిల్లాలకు పూర్తిస్థాయి కార్యవర్గం కూడా ఏర్పాటు చేసుకొన్నామని పిసిసి చీఫ్ మహేష్‌కుమార్ గౌడ్ అన్నారు. గాంధీభవన్‌లో భువనగిరి పార్లమెంట్ నియోజక వర్గ జనగామ, తుంగతుర్తి నియోజకవర్గాల సమావేశం శుక్రవారం జరుగగా ముఖ్య అతిథిగా పిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్‌గౌడ్, ఎంపి చామల కిరణ్ కుమార్‌రెడ్డి, విప్, యాదాద్రి భువనగిరి డిసిసి అధ్యక్షులు బీర్ల అయిలయ్య,



ఎమ్మెల్యే శామ్యూల్, సూర్యా పేట డిసిసి అధ్యక్షులు గుడిపాటి నర్సయ్య, జనగామ డిసిసిఅధ్యక్షులు ధన్వంతి, సిద్దిపేట డిసిసి అధ్యక్షులు అంక్షరెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పిసిసి చీఫ్ మాట్లాడుతూ వచ్చే పదేళ్లు కాంగ్రెస్‌పార్టీ రాష్ట్రంలో అధికారంలో ఉంటుందని ప్రజల సమస్యలు ఎప్పటికప్పుడు తెలుసుకొని వాటిని అధికారులతో పరిష్కరించేలా చేయాలని కోరారు. ప్రతి కార్యకర్త ప్రతి ఓటరుతో సన్నిహితంగా ఉండాలని సూచించారు. ఇక మండల కమిటీలు గ్రామ కమిటీలు కూడా మండల కమిటీలు త్వరలో నియామకం చేస్తామని ఖాళీగా ఉన్న జిల్లా కమిటీల నియామకాల కోసం కూడా అభిప్రాయలు తీసు కొంటామని వివరించారు.

# మహిళల ఆర్థికస్వావలంబనకు సిఎం కృషి

### పిసిసి చీఫ్ మహేష్‌తో నటి దివ్యవాణిచౌదరి భేటీ

**హైదరాబాద్, ఏప్రిల్ 10, ప్రభాతవార్త:** రాష్ట్రంలో మహిళ ఆర్థికస్వాలంబన కోసం ప్రభుత్వపరంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, పార్టీపరంగా పిసిసి చీఫ్ బొమ్మ మహేష్‌కుమార్ కృషి చేస్తున్నారని దివ్యవాణి చౌదరి ప్రశంసించారు. పిసిసి చీఫ్ మహేష్‌గౌడ్‌ను శుక్రవారం దివ్యావాణిచౌదరి కలిసి బాపు బొమ్మ విశ్వమహిళ పేరుతో ప్రముఖ మహిళలకు అవార్డుల ప్రదానం కార్యాక్రమం విజయవంత చేసినందుకు అభినందించారు. బాపు బొమ్మ విశ్వమహిళ అవార్డ్స్ వేడుకలు రెండు తెలుగు రాష్ట్రాల్లోనే కాకుండా, దేశవ్యాప్తంగా, ప్రపంచవ్యాప్తంగా నిర్వ హించేందుకు సన్నాహాలు చేస్తున్నామని దివ్యవాణి ప్రకటించారు. చిరంజీవి తల్లి అంజనాదేవికి ఇవ్వడం విశేషమనీ ఆమె అభివర్ణించింది. బాపు బొమ్మగా తెలుగు వారి గుండెల్లో శాశ్వత స్థానం సంపాదించుకుని, సామాజిక, రాజకీయ రంగా ల్లోనూ తన ప్రత్యేకత చాటుకుంటున్న ప్రముఖ నటీమణి దివ్యవాణి చౌదరి అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆమె బాపు బొమ్మ విశ్వమహిళ పేరిట 2026వ సంవత్సరానికిగాను అవార్డ్స్ ప్రదానం చేశారు.

మంత్రి జూపల్లి కృష్ణారావు, పిసిసి అధ్యక్షుడు మహేష్‌గౌడ్ సౌజన్యంతో బాపు బొమ్మ విశ్వమహిళ తొలి అవార్డును దివ్యవాణి చిరంజీవి తల్లి అంజనాదేవికి ఇస్తామని ప్రకటించగా ఆమె తరఫున చిరంజీవి సోదరి మాధవి ఈ అవార్డును అందుకున్నారు. అలానే ఇదే వేదికపై రెబల్‌స్టార్ కృష్ణంరాజు సతీమణి శ్యామలా దేవి, యాంకర్ స్వప్న, జనేతా కంచర్ల (యు.ఎస్.ఎ), డాక్టర్ వెన్నెల గద్దర్, డా. పద్మజా చంద్రకాంత్, సమీరా భరద్వాజ్, రేఖారాణి, డి. జ్యోతిరెడ్డి (యు.ఎస్.ఎ.) తదితర మహిళామణులు పురస్కారాలను స్వీకరించారు.

వివిధ రంగాల్లో విశేష ప్రతిభ కనబరుస్తున్న మహిళలను సన్మానించుకోవడం ద్వారా సమాజంలోని సాటి మహిళామణు లందరిలో స్ఫూర్తిని రగిలించాలనే వజ్రసంకల్పంతో నిర్వహించిన ఈ కార్యక్రమం దిగ్విజయం కావడంలో సహకరించిన ప్రతి ఒక్కరికీ దివ్యవాణి కృతజ్ఞతలు తెలిపారు.

# సమ్మెలో పాల్గొన్న కార్మికుల వైద్య సదుపాయాలు నిలిపివేయాలి

### ఆదేశాలు జారీ చేసిన తెలంగాణ విద్యుత్ ఉత్పాదక సంస్థ

**హైదరాబాద్, ఏప్రిల్ 10, ప్రభాతవార్త:** సమ్మెలో పాల్గొంటున్న విద్యుత్ కార్మికులకు (ఆర్టిజన్లు), అలాగే వారిపై ఆధారపడిన వారికి కూడా అన్ని వైద్య సదుపాయాలను నిలిపివేయాలని తెలంగాణ విద్యుత్ ఉత్పాదన సంస్థ లిమిటెడ్ (టిజి జెన్కో) నిర్ణయించింది.

ఇదే సమయంలో సమ్మెలో పాల్గొనని ఆర్టిజన్లకు వైద్య కార్డులు, రీయింబర్స్‌మెంట్ బిల్లులను పంపాలని ప్రధాన కార్యాలయంలోని అధికారులకు ఆదేశాలు జారీ చేయబడ్డాయి. ఇకపై మెడికల్ క్రెడిట్ కార్డ్ లేదా మెడికల్ రీయింబర్స్‌మెంట్ పంపే ముందు, సమ్మెలో పాల్గొనని కార్మికులు ఉన్నారని ధృవీకరించుకోవాలని జెన్కో స్పష్టం చేసింది.

తెలంగాణ విద్యుత్ ఆర్టిజన్ ఉద్యోగుల సంయుక్త కార్యాచరణ కమిటీ బుధవారం నుంచి నిరవధిక సమ్మెను ప్రారంభించిన నేపథ్యంలో ఈ ఉత్తర్వులు జారీ అయ్యాయి.

కాగా తెలంగాణ విద్యుత్ కార్మికులకు నాణ్యమైన వైద్య సేవలు అందించేందుకు ప్రత్యేక ఆరోగ్య పథకాలు, నెట్‌వర్క్ ఆసుపత్రుల ద్వారా సౌకర్యాలు కల్పిస్తోంది. ఆర్టిజన్లతో సహా విద్యుత్ కార్మికులకు, వారి కుటుంబాలకు ఉచిత, రాయితీ వైద్యం, అత్యవసర వైద్య సాయం, ఆరోగ్య శ్రీ వంటి పథకాల వర్తింపుతో కూడిన ఆరోగ్య కార్డులను అందచేసింది.

# సిఎం ప్రజావాణి దేశానికే ఆదర్శం

### సందర్శించిన మధ్యప్రదేశ్ తహశీల్దార్లు




సిఎం ప్రజావాణిని సందర్శించిన మధ్యప్రదేశ్ తహశీల్దార్ల బృందం.

**హైదరాబాద్ (బేగంపేట) ఏప్రిల్ 10, ప్రభాతవార్త:** సీఎం ప్రజావాణి పనితీరు యావత్ దేశానికే ఆదర్శం అని మధ్యప్రదేశ్ రాష్ట్ర తహశీల్దార్లు పేర్కొన్నారు. మహాత్మా జ్యోతిబా పూలే ప్రజా భవన్‌లో శుక్రవారం జరిగిన సీఎం ప్రజావాణీని మధ్య ప్రదేశ్ రాష్ట్ర తహశీల్దార్లు సందర్శించారు. ఈ సందర్భంగా సీఎం ప్రజావాణీ అమలు జరుగుతున్న తీరును వారు పరిశీలించారు. వివిధ డెస్క్ అధికారులను పలు అంశాలను అడిగి తెల్సుకున్నారు. సీఎం ప్రజావాణీ కార్యక్రమం తమలో స్ఫూర్తిని నింపిందని, ఇలాంటి బృహత్ కార్యక్రమం ప్రతి ఒక్కరికీ స్ఫూర్తి దాయకమని అన్నారు. సీఎం ప్రజావాణీ పనితీరును క్షుణ్ణంగా అధ్యయనం చేసిన వారు తమ రాష్ట్రం మధ్యప్రదేశ్ లో కూడా ఇదే తరహా ప్రక్రియను చేపట్టేందుకు ప్రభుత్వ ఉన్నతాధికారుల దృష్టికి తీసికెళ్తామని వారు తెలిపారు. సీఎం ప్రజావాణీ తీరు తెన్నులను ప్రణాళికా సంఘం వైస్ ఛైర్మన్, సీఎం ప్రజావాణీ ఇంచార్జి డా. జి. చిన్నారెడ్డి, స్టేట్ నోడల్ అధికారి దివ్యదేవరాజన్ లు వారికి వివరించారు.

**సిఎం ప్రజావాణికి అందిన దరఖాస్తులు 380**

మహాత్మా జ్యోతిబా పూలే ప్రజాభవన్ లో శుక్రవారం నిర్వహించిన 213వ సీఎం ప్రజావాణీ కార్యక్రమంలో మొత్తం 380దరఖాస్తులు అందాయి. వీటిలో పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖకు సంబంధించి 143 దరఖాస్తులు, రెవెన్యూ శాఖకు సంబంధించి 38, ఇందిరమ్మ ఇండ్ల కోసం 120, ప్రవాసీ ప్రజావాణీకి 05, ఇతర శాఖలకు సంబంధించి 74 దరఖాస్తులు అందాయి. సీఎం ప్రజావాణీ ఇంచార్జి, రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ ఛైర్మన్ డా. జి. చిన్నారెడ్డి, స్టేట్ నోడల్ అధికారి దివ్యదేవరాజన్ దరఖాస్తులు స్వీకరించి ప్రజల సమస్యలు విని సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడి పలు సమస్యలను పరిష్కరించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ సూర్య ప్రకాష్, ఏసీపీ ఉమేందర్, ప్రవాసీ ప్రజావాణీ సమన్వయ కర్త బొజ్జా అమరేందర్‌రెడ్డి వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## ఆర్టీసీ ట్రైనీ ట్రాఫిక్ సూపర్‌వైజర్లు, ట్రైనీ మెకానికల్ సూపర్‌వైజర్ల ఫలితాలు విడుదల

**హైదరాబాద్, ఏప్రిల్ 10, ప్రభాతవార్త:** ఆర్టీసీలో ట్రైనీ ట్రాఫిక్ సూపర్‌వైజర్లు, ట్రైజీ మెకానికల్ సూపర్‌వైజర్ల పోస్టుల భర్తీకి పోలీసు నియామక మండలి నిర్వహించిన రాత పరీక్షల తాలూకు ఫలితాలు శుక్రవారం విడుదల య్యాయి. ఈ మేరకు మండలి ఛైర్మన్ శ్రీనివాసరావు మీడియాకు ఒక ప్రకటన విడుదల చేశారు. పరీక్షల్లో ఉత్తీర్ణులైన వారి మార్కులతోపాటు వారి ఓఎంఆర్ షీట్ల స్కాన్డ్ కాపీలను పోలీసు నియామక మండలి వెబ్ సైట్‌లో వుంచామని, అభ్యర్థులు తమ లాగిన్ ద్వారా వీటిని చూడవచ్చని ఆయన తెలిపారు. పరీక్షలకు సంబంధించిన తుది కీ కూడా అందుబాటులో ఉంచామని శ్రీనివాసరావు తెలిపారు. ఎంపికైన వారికి ఈ నెల 16, 17వ తేదీల్లో అంబర్‌పేట్‌లోని పిటిసిలో ధ్రువపత్రాల పరిశీలన ఉంటుందని, అభ్యర్థులు నిర్దేశించిన సమయంలో ఇక్కడకు రావాలని ఆయన కోరారు.

## రాష్ట్రానికి కేంద్రం పెద్దఎత్తున నిధుల కేటాయింపు

### కేంద్రానికి రాష్ట్ర ప్రభుత్వం సహకరించాలి

### 17న ఆదిలాబాద్‌కు రక్షణ శాఖ, ఎయిర్‌పోర్ట్ అథారిటీ అధికారుల బృందం

### ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్



**హైదరాబాద్, ఏప్రిల్ 10, ప్రభాతవార్త:** రాష్ట్ర అభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వం పెద్దఎత్తున నిధులు, కార్యక్రమాలతో అభివృద్ధి చేస్తుందని ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ అన్నారు. శక్రవారం బిజెపి రాష్ట్ర కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో ప్రస్తుతం ఒకే ఒక్క ఎయిర్‌పోర్ట్ మాత్రమే ఉందని, గత 10 సంవత్సరాలు బిఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు కేంద్ర ప్రభుత్వం పలు సందర్భాల్లో మరిన్ని ఎయిర్‌పోర్టులు ఏర్పాటు చేయడానికి సిద్ధంగా ఉన్నామని, ప్రతిపాదనలు పంపాలని కోరినా స్పందన లేదన్నారు. కానీ ఇప్పుడు పరిస్థితి మారింది. ఇప్పటికే వరంగల్‌లో, ఆదిలాబాద్ ఎయిర్‌పోర్టుకు అనుమతులు వచ్చాయన్నారు. మూడవ ఎయిర్‌పోర్ట్ కోసం సైతం కేంద్ర ప్రభుత్వం వేగంగా చర్యలు తీసుకుంటుందని అన్నారు. ప్రత్యేకంగా ఆదిలాబాద్ అభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వం అత్యంత కట్టుబడి ఉందని పేర్కొన్నారు. రక్షణ శాఖ మంత్రిగా ఉన్నప్పుడు నిర్మలా సీతారామన్ పలుమార్లు రాష్ట్ర ప్రభుత్వానికి లేఖలు రాసినా స్పందన రాలేదని, అయితే ఇటీవల ఢిల్లీలో జరిగిన సమావేశంలో ఆదిలాబాద్, వరంగల్ ఎయిర్‌పోర్టుల అభివృద్ధిపై చర్చించి, మేము రక్షణ శాఖ సహకారం కోరామన్నారు. రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ ఆదిలాబాద్ ఎయిర్‌పోర్ట్ అభివృద్ధికి కావలసిన నిధులను పూర్తిగా సమకూర్చడానికి సిద్ధంగా ఉన్నామని స్పష్టం చేశారు. అంతేకాకుండా అక్కడ ఎయిర్ ఫోర్స్ ట్రైనింగ్ సెంటర్ ఏర్పాటు చేయాలని కూడా నిర్ణయించారు. దీని వల్ల ఆదిలాబాద్ జిల్లాలో ఉపాధి అవకాశాలు పెరుగుతాయన్నారు. ఇప్పటికే మాస్టర్ ప్లాన్ సిద్ధమైంది. సంబంధిత శాఖల సమన్వయం పూర్తయింది. ఈ నెల 17న రక్షణ శాఖ, ఎయిర్‌పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా అధికారుల బృందం ఆదిలాబాద్‌కు వచ్చి తుది నిర్ణయాలు తీసుకోనుందన్నారు. ఇంత వేగంగా కేంద్ర ప్రభుత్వం పనిచేస్తుంటే, గతంలో రాష్ట్ర ప్రభుత్వం చేసిన నిరక్ష్యం వల్ల ఈ ప్రాజెక్టులు ఆలస్యమయ్యాయి. ఆదిలాబాద్ ఆర్మూర్ రైల్వే లైన్ కూడా ఇదే కారణంతో ఆలస్యం అయిందన్నారు. కేంద్రం నిధులు మంజూరు చేసినప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం సహకరించలేదన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం గత తప్పులను పునరావృతం చేయకుండా, కేంద్రంతో సమన్వయం చేసుకొని ప్రాజెక్టులను వేగంగా పూర్తిచేయాలన్నారు.

## మిస్ తెలుగు యుఎస్ఎ.. అమూల్య

**హైదరాబాద్, ఏప్రిల్ 10 ప్రభాతవార్త:** గ్రాండ్ ఫినాలేలో 'మిస్ తెలుగు యూఎస్ఏ 2026' కిరీటాన్ని గెలుచుకున్న అముల్య బాల్మూరి కరీం నగర్‌కు చెందిన యువతి. గోల్డ్‌మన్ సాక్స్ ప్రొఫెషనల్ మరియు రచయిత్రి అయిన ఆమె, ఏప్రిల్ 4న జరిగిన గ్రాండ్ ఫినాలేలో 100 మంది పోటీదారుల నుండి ప్రత్యేకంగా పోటీలో నిలిచి టైటిల్‌ను గెలుచుకున్నారు. బి.శ్రీనివాస రావు (రిటైర్డ్, ఐ క్యాడ్ డిపార్ట్‌మెంట్), బి.రమ ల కుమార్తె అయిన అముల్య బాల్మూరి, మిస్ తెలుగు యూఎస్ఏ 2026 కిరీటాన్ని గెలుచు కున్నారు. ప్రస్తుతం టెక్సాస్‌లోని డల్లాస్‌లో నివసిస్తున్న అమూల్య, కరీంనగర్‌లోని చిట్యాలపల్లి గ్రామానికి చెందినవారు. ఆమె తల్లిదండ్రులు హైదరాబాద్‌లోని ఆల్వాల్‌లో నివసిస్తున్నారు. భోజరెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో ఐటీ నేపథ్యంతో తన విద్యా ప్రస్థానాన్ని ప్రారంభించిన అమూల్య, ఆ తర్వాత మాస్టర్స్ డిగ్రీని పూర్తి చేసి, ప్రస్తుతం గోల్డ్‌మన్ సాక్స్‌లో ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంకింగ్‌లో విజయ వంతమైన మార్గాన్ని ఏర్పరుచుకుంటున్నారు. రచనపై ఉన్న మక్కువతో ఆమె తన కథలను ఆన్‌లైన్‌లో ప్రచురిస్తూ, ప్రపంచవ్యాప్తంగా 90,000 మందికిపైగా పాఠకులను సంపాదించుకున్నారు.

## నేడు ములుగుకు పిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్‌గౌడ్

**హైదరాబాద్,ఏప్రిల్ 10,ప్రభాతవార్త:** తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్ శనివారం ములుగు జిల్లా కార్యవర్గంతో సమావేశం కానున్నారు. డిసిఇ అధ్యక్షులు అశోక్ అధ్యక్షతన ములుగు జిల్లా డిసిసి కార్యవర్గ సమావేశ జరుగుతోంది. ఆసమావేశంలో ముఖ్యఅతిథిగా టిపిసిసి చీఫ్ మహేష్ కుమార్ గౌడ్. మంత్రి సీతక్క, ఎపి బలరాం నాయక్, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, సీనియర్ కాంగ్రెస్ నాయకులు పాల్గొంటారు. కాంగ్రెస్ పార్టీ పటిష్టత, జిల్లా కార్యవర్గ సభ్యులకు నియామక పత్రాలు అందజేత, ప్రభుత్వం ప్రజలకు అందిస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు ప్రజలకు మరింత చేరువ చేయడం లాంటి ఎజెండాతో సమావేశం జరుగుతోంది.

# నవభారత మార్గదర్శి జ్యోతిరావు పూలే

### ద్విశతాబ్ది జయంత్యుత్సవ ప్రారంభవేళ ఘన నివాళి

ప్రధానమంత్రి నరేంద్రమోడీ

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 10:** ఏప్రిల్ 11 నేడు. మనందరికీ చాలా ప్రత్యేకమైన రోజు. భారతదేశపు అగ్రశ్రేణి సంఘ సంస్కర్తల్లో ఒకరు, తరతరాలకూ మార్గదర్శిగా నిలిచిన క్రాంతిపథగామి మహాత్మా జ్యోతిరావు పూలే జయంతి నేడు. ఆయన ద్విశతాబ్ది జయంత్యుత్సవాల ప్రారంభం నేపథ్యంలో, ఈ ఏడాది మరింత విశిష్టతను సంతరించుకున్నది. మహాత్మాపూలే గొప్ప సంఘసంస్కర్త. అంతేకాదు నైతిక స్థైర్యం, నిరంతర సత్యాన్వేషణ, సామాజిక శ్రేయస్సు పట్ల అచంచలమైన అంకితభావం కలబోసిన ఉదాత్త జీవితం ఆయనది. ఎన్నో సంస్థలను నెలకొల్పి, ఎన్నో ఉద్యమాలకు సారథ్యం వహించి చిరస్మరణీయులయ్యారు పూలే. ఆయన రేకెత్తించిన సరికొత్త ఆశలు, దేశజనుల్లో నింపిన ఆత్మవిశ్వాసం, మన నాగరికతా పరిణామ క్రమంలో ఆయన చేసిన అసమానమైన సేవలూ నేటికీ లక్షలాది మందికి స్ఫూర్తిని అందిస్తున్నాయి. పుణ్యభూమి మహారాష్ట్రలో 1827లో మహాత్మాపూలే జన్మించారు. అతిసామాన్య నేపథ్యం నుంచి ఎదిగారాయన. కానీ తొలినాటి కష్టాలేవీ ఆయన అభ్యాసానికీ, ధైర్యానికీ, సామాజిక నిబద్ధతకూ అడ్డుగోడలు కాలేక పోయాయి. సవాళ్లు ఏవైనా సరే నిశ్చేష్టులుగా ఉండిపోకుండా కష్టపడి జ్ఞానాన్ని ఆర్జించి, ఆ సమస్యలను పరిష్కరించుకోవాలన్న దృఢ సంకల్పమే ఆయనలో ఎన్నడూ తొణికిసలాడేది. చిన్నతనంలోనే, విద్యార్థి దశ నుంచే జ్యోతిరావు పూలేలో అపారమైన జిజ్ఞాస ఉండేది. నిరంతర అధ్యయన శీలి. తన వయసు పిల్లల స్థాయికి మించిన పుస్తకాలను చదివేవాడు. మనం ఎంత ప్రశ్నిస్తే అంత జ్ఞానాన్ని పొందుతాం అని తర్వాతి కాలంలో ఆయనే చెప్పారు. చిన్ననాటి నుంచే ఆయనకు అలవడిన ఆ సత్యాన్వేషణ దృక్పథం ఎక్కడా రాజీపడకుండా జీవితాంతమూ కొనసాగింది. విద్యనూ, జ్ఞాన సముపార్జననూ జీవిత లక్ష్యాలుగా మలచుకున్నారు మహాత్మాపూలే. జ్ఞానం కొందరి గుత్తాధిపత్యం కాదనీ, ఆ శక్తి అందరికీ అందాలనీ స్పష్టంగా గుర్తించారాయన. సమాజంలో అనేకులకు అక్షర జ్ఞానం అందని ద్రాక్షగా ఉన్న ఆ కాలంలోనే బాలికల కోసం, విద్యావకాశాలు లేని వర్గాల కోసం పాఠశాలలను తెరిచి విద్యా విప్లవానికి నాంది పలికారు. తల్లి ద్వారా బిడ్డకు అందే సంస్కారం అమూల్యమైనది. అందుకే, పాఠశాలలు తెరవాలనుకుంటే మొదట బాలికల కోసమే తెరవాలి అనేవారాయన. రైతులు, కార్మికులకు అన్యాయం జరిగితే మన సమాజం బలహీనపడుతుందని ఆయనెప్పుడూ చెప్పేవారు. పొలాల నుంచి పల్లెల దాకా రోజువారీ జీవితంలో సామాజిక అసమానతల తీవ్రతను ఆయన నిశితంగా గమనించారు. అందుకే పేదలు, అణగారిన వర్గాల ఆత్మగౌరవాన్ని కాపాడడంలో ఆయన పూర్తిగా నిమగ్నమయ్యారు. అలాగే సామాజిక సామరస్యం కోసం శక్తివంచనలేకుండా నిర్విరామంగా కృషి చేశారు. జోపర్యంత సమాజాతీల సర్వానా సమాన అధికార మిళత్ నహీత్, తోపర్యంత ఖరే స్వతంత్ర్య మిళత్ నహీ (సమాజంలోని ప్రతి ఒక్కరికీ సమాన హక్కులు కల్పించేంత వరకు నిజమైన స్వేచ్ఛను సాధించలేము) అన్నది మహాత్మాపూలే అభిప్రాయం. సమ సమాజం లక్ష్యంగా ఈ ఆశయాన్ని కార్యాచరణగా మలిచే దిశగా ఎన్నో సంస్థలను ఆయన నెలకొల్పారు. ఆయన స్థాపించిన సత్యశోధక సమాజం ఆధునిక భారతదేశంలో అత్యంత ముఖ్యమైన సామాజిక సంస్కరణ ఉద్యమాల్లో ఒకటి. సామాజిక సంస్కరణ, సమాజ సేవ, మానవ గౌరవాన్ని పెంపొందించడంలో ఇది అగ్రగామిగా నిలిచింది. మహిళలు, యువత, గ్రామీణ ప్రజలకు గొంతుకైంది. న్యాయం, ప్రతి వ్యక్తికీ గౌరవం, సమిష్టి పురోగతి స్ఫూర్తిని కేంద్రంగా నిలపడం ద్వారా సమాజాన్ని శక్తిమంతంగా తీర్చిదిద్దవచ్చన్న మహాత్మాపూలే విశ్వాసానికి ఈ ఉద్యమం నిదర్శనం. ఆయన వ్యక్తిగత



జీవితమూ ధైర్యసాహసాలను బోధించే పాఠమే. నిరంతరం జనబాహుళ్యంలో ఉంటూ ప్రజల కోసం పరితపించడం ఆయన ఆరోగ్యంపై ప్రభావం చూపింది. అత్యంత క్లిష్టమైన అనారోగ్య సమస్యలు కూడా ఆయన సంకల్పాన్ని సడలించలేకపోయాయి. పక్షవాతం బారిన పడి శరీరం సహకరించని స్థితిలోనూ తన కృషిని కొనసాగించారు. అవును, ఆయన శరీరం కఠిన పరీక్షను ఎదుర్కొని ఉండవచ్చు.. కానీ సమాజం పట్ల ఆయన నిబద్ధత మాత్రం సడలలేదు. ఆయన జీవితంలోని ఈ అకుంఠిత దీక్షే నేడు ఎన్నో కష్టాలకోర్చి, పోరాట స్ఫూర్తిని కొనసాగిస్తున్న లక్షలాది మందికి స్ఫూర్తినిస్తోంది. గౌరవ సావిత్రీబాయి పూలేను స్మరించుకోకుండా మహాత్మా జ్యోతిరావు పూలే స్మృతి అసంపూర్ణమే అవుతుంది. దేశం గర్వించదగ్గ అగ్రశ్రేణి సంస్కర్తల్లో ఆమె ముందువరుసలో నిలుస్తారు. దేశపు తొలితరం మహిళా ఉపాధ్యాయినిగా, బాలికా విద్యా వికాసంలో ఆమె నిర్ణయాత్మక పాత్ర పోషించారు. తద్వారా వారు కలలను సాకారం చేసుకునే అవకాశాన్నిచ్చారు. మహాత్మా పూలే మరణానంతరమూ ఆ ఆశయ దీప్తిని సావిత్రీబాయి ఆరనివ్వలేదు. 1897లో ప్లేగు వ్యాధి విరుచుకుపడిన తరుణంలో బాధితుల సేవలో ఆమె పునరంకితమయ్యారు. చివరకు అదే వ్యాధికి గురై ప్రాణాలు విడిచిన త్యాగమూర్తి ఆమె. మనది పుణ్యభూమి. విశిష్టమైన భావాలు, నిరుపమాన త్యాగాలు, అకుంఠిత దీక్షతో మన సమాజాన్ని శక్తిమంతంగా మలచిన మహనీయులు, వీరనారులకు నిలయమిది. మార్పు ఎక్కడినుంచో మొదలవుతుందని ఎదురుచూడలేదు. వారే మార్పునకు నాంది పలికారు. శతాబ్దాల నుంచి దేశంలో సామాజిక పురోగతి దిశగా మన సమాజం నుంచే శంఖారావం వినిపించింది. పీడితుల వ్యథను గుర్తించి దానిని తలరాత అని సరిపెట్టుకోకుండా ఎదురుతిరిగిన వారి నుంచి ఆ చైతన్యం పుట్టుకొచ్చింది. అలాంటి యోధుల్లో ఒకరు మహాత్మా జ్యోతిరావు పూలే. 2022లో పూణే పర్యటన సందర్భంగా అక్కడి మహాత్మా పూలే భవ్య విగ్రహం వద్ద నివాళి అర్పించడం నాకెప్పటికీ గుర్తుంటుంది. ఆయన ద్విశతాబ్ది జయంత్యుత్సవాల ప్రారంభ వేళ ఆయన ఆశయాల దిశగా పునరంకితం కావడమే మనం అర్పించే ఘనమైన నివాళి. ముఖ్యంగా ఆయనకెంతో ఇష్టమైన విద్య వంటి ఆదర్శాలకు మనం పునరంకితం కావాలి. అన్యాయంపై నిరసన తెలిపే సున్నితత్వాన్ని పెంచుకోవాలి. సమాజ స్వయం సంస్కరణ సామర్థ్యంపై మన విశ్వాసాన్ని బలంగా చాటాలి. నైతిక స్పష్టత, ప్రజా ప్రయోజనం రెండూ తోడైతే ఈ సమాజ శక్తి దేశంలో అద్భుతాలు సృష్టించగలదని ఆయన జీవితం నిరూపించింది. అందుకే నేటికీ లక్షలాది మందికి ఆయన ఆలోచనలు బలాన్నిస్తున్నాయి. ఆయన మాటలూ, చర్యలూ నేటికీ ఆశను చిగురింపజేస్తున్నాయి. ఆయన జన్మించి దాదాపు రెండు వందల ఏళ్లు గడుస్తున్నా మహాత్మా జ్యోతిరావు పూలే గత కాలపు శక్తిగానే కాకుండా నవ భారత భవితకు మార్గదర్శిగా విరాజిల్లుతున్నారు.

## విద్యుత్ శాఖలోని ఆర్టిజన్స్ సమస్యలను పరిష్కరించాలి

### ముఖ్యమంత్రికి సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని లేఖ

**హైదరాబాద్, ఏప్రిల్ 10, ప్రభాతవార్త:** విద్యుత్ శాఖలో పనిచేస్తున్న ఆర్టిజన్స్ సమస్యలను పరిష్కరించాలని భారత కమ్యూనిస్టు పార్టీ(సీపీఐ) తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు డిమాండ్ చేశారు. విద్యుత్ శాఖలో పనిచేస్తూ సమ్మెలో ఉన్న ఆర్టిజన్ కార్మికులపై ఎస్మా, డిస్మిస్, మెమో లాంటి బెదిరింపు ధోరణితో ఇబ్బందులకు గురిచేయకుండా వారి న్యాయమైన సమస్యలను పరిష్కరించేందుకు వారితో చర్చలు జరిపి పరిష్కరించాలని కోరుతూ కూనంనేని శుక్రవారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి లేఖ రాశారు. విద్యుత్తు రంగంలో 18 వేల మందికి పైగా ఆర్టిజన్‌గా పనిచేస్తున్నారన్నారు. జన్ కో, ట్రాన్స్ కో, ఎన్.పి.డి.సి.ఎల్, ఎస్.పి.డి.సి. ఎల్‌తో పాటు ఇతర విభాగాల్లోనూ ఆర్టిజన్స్ ఉన్నారన్నారు. వారందరూ గత మూడు రోజుల నుంచి రాష్ట్రవ్యాప్తంగా నిరవధికంగా సమ్మె చేస్తున్నారని, చట్టబద్ధంగా సమ్మె నోటీసు ఇచ్చి కాలపరిమితి ప్రకారం అధికారులు స్పందించక పోవటంతో వారు సమ్మె బాట పట్టారన్నారు. సమ్మె చేస్తున్న కార్మికులను ఎస్మా, డిస్మిస్, మెమో లాంటి బెదిరింపు ధోరణితో ఇబ్బందులకు గురిచేయకుండా వారి న్యాయమైన సమస్యలను చర్చల ద్వారా పరిష్కరించాలన్నారు. గత ప్రభుత్వం ఆర్టిజన్ అనే పేరుతో కార్మికులను శ్రమ దోపిడీకి గురి చేసే విధంగా చట్టం చేసి గత పది సంవత్సరాలుగా వేతనాలు ఇవ్వడంలో పదోన్నతులను కల్పించడంలో విద్యార్హతను బట్టి సమూచిత స్థానం ఇవ్వకుండా ఎదుగు బొదుగు లేకుండా ఉన్న స్థానంలోనే ఉంచుతు న్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కష్టం చేస్తున్నవారికి వేతనాలు, పదోన్నతులు లేకుండా చేస్తున్నారని కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారనానరు. వేసవి కాలంలో విద్యుత్ డిమాండ్ నేపథ్యంలో కార్మికుల సమ్మెతో ఉత్పత్తిపై ప్రభావం పడుతుందన్నారు.

## సమ్మక్క-సారలమ్మ వర్సిటీ, ఐఐటీ హైదరాబాద్ మధ్య ఒప్పందం

### ఈ యేడాది ప్రధాని మోడీ గిరిజన వర్సిటీకి భూమి పూజ చేస్తారు: కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, ఏప్రిల్10:** ఈ యేడాది ప్రధాని మోదీ గిరిజన వర్సిటీకి భూమి పూజ చేస్తారని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి తెలిపారు. కేంద్ర గిరిజన వర్సిటీని ముందు మహబూబ్‌నగర్‌లో పెట్టాలనుకున్నాం, కానీ కేంద్రం ములుగులోనే గిరిజన వర్సిటీని ఏర్పాటు చేస్తుందని వివరించారు. శుక్రవారం సమ్మక్కసారలమ్మ గిరిజన వర్సిటీ -ఐటీ హైదరాబాద్ మధ్య ఓ ఒప్పందం కుదిరింది. ఎంసీఆర్‌హెచ్‌ఆర్‌డీలో జరిగిన ఈ ఒప్పంద కార్యక్రమంలో కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి పాల్గొన్నారు. కేంద్ర గిరిజన వర్సిటీని తొలుత మహబూబ్‌నగర్‌లో పెట్టాలనుకున్నామని, కానీ కేంద్రం ములుగులోనే గిరిజన వర్సిటీని ఏర్పాటు చేస్తుందని చెప్పారు. రెండు కేంద్ర సంస్థలు ఈ వర్సిటీకి సహకారం అందిస్తాయని, సమ్మక్క సారలమ్మ యూనివర్సిటీ భవిష్యత్‌లో గొప్ప అభివృద్ధి సాధిస్తుందని, గిరిజనులకు కావాల్సిన ఆధునిక సాంకేతికతను అందిస్తుందన్నారు. ఆబిడ్స్‌లో గిరిజన మ్యూజియం ఏర్పాటు చేస్తున్నాం. ఏజెన్సీ ప్రాంతాల్లో కేంద్రం రూ.24వేల కోట్లతో అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతోందని కిషన్‌రెడ్డి అన్నారు.



## జర్మనీలో యువతకు ఉపాధి కోసం నైపుణ్యశిక్షణ

### భాషపై కూడా పట్టు పెంచుకోవాలి

### మంత్రి వివేక్ వెంకటస్వామి

**హైదరాబాద్, ఏప్రిల్ 10,ప్రభాతవార్త:** ఆధునిక పారిశ్రామిక అవసరాలకు తగ్గట్లు యువత సాంకేతికనైపుణ్యం పెంచుకొంటే జర్మనిలో తెలంగాణ యువతకు పుష్కలంగా ఉపాధి పొందే అవకాశం ఉందని, తెలంగాణలో జర్మన్ పరిశ్రమల అవసరాలకు అనుకుగంగా యువతకు శిక్షణ చేపడుతామని కార్మిక, ఉపాధి గనుల శాఖ మంత్రి డా. జి. వివేక్ వెంకటస్వామి అన్నారు. తెలంగాణ యువతకు విదేశీ ఉపాధి అవకాశాలను విస్తరించేందుకు కీలక అడుగుగా, కార్మిక, ఉపాధి గనుల శాఖ మంత్రి డా. జి. వివేక్ వెంకటస్వామి నాయకత్వంలోని ఉన్నత స్థాయి ప్రతినిధి బృందం శుక్రవారం బెర్లిన్‌లోని భారత రాయబారి కార్యాలయంలో జర్మనీకి భారత రాయబారి అజిత్ గుప్తేతో వ్యూహాత్మక సమావేశం నిర్వహించింది. ఈ సమావేశంలో నైపుణ్య ఉపాధి మార్గాలను బలోపేతం చేయడం, అలాగే యూరప్‌లో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థ అయిన జర్మనీలో భారతీయ ప్రవాసుల పాత్రను మరింత పెంపొందించడం వంటి అంశాలపై ప్రధానంగా చర్చించారు. జర్మనీలో భారతీయుల సంఖ్య 3.11 లక్షలకు చేరుకున్నదని, అందులో సుమారు 1.16 లక్షల మంది దేశ ఆర్థిక వ్యవస్థకు పన్నుల రూపంలో సహకరిస్తున్నారని ప్రతినిధి బృందం వివరించింది. ఇది జర్మన్ కార్మిక మార్కెట్‌లో భారత సాంకేతిక నిపుణలకు డిమాండ్ పెరుగుతోందని చెప్పారు.

## కాకతీయ థర్మల్ ప్లాంట్‌లో 500 మెగావాట్ల ప్లాంట్‌లో నిలిచిన విద్యుత్ ఉత్పత్తి

**హైదరాబాద్, ఏప్రిల్ 10, ప్రభాతవార్త :** రాష్ట్రంలోని భూపాలపల్లి జిల్లా గణపురం మండలం చెల్పూర్‌లోని కాకతీయ థర్మల్ పవర్ ప్లాంట్ (కేటీపీపీ) మొదటి దశ 500 మెగావాట్ల ప్లాంట్‌లో విద్యుత్తు ఉత్పత్తి నిలిచిపోయింది. ఈ ప్లాంట్‌లో సాంకేతిక సమస్యలు తలెత్తడంతో విద్యుత్ ఉత్పత్తికి అంతరాయం ఏర్పడింది. దీనివల్ల రాష్ట్ర విద్యుత్ వ్యవస్థపై ప్రభావం పడే అవకాశం ఉంది. ఈ యూనిట్‌లో విద్యుత్ ఉత్పత్తి నిలిచిపోవడంతో రోజుకు సుమారు రూ.2 కోట్ల నష్టం వాటిల్లుతోంది. కాగా కాకతీయ థర్మల్ పవర్ ప్లాంట్ మొదటి దశ 500 మెగావాట్లు, రెండో దశ 600 మెగావాట్ల విద్యుత్ ప్లాంట్లు నడుస్తున్నాయి.

# ఎఐ టెక్నాలజీ ద్వారా పన్నుల పర్యవేక్షణ

### త్రీ ట్రిలియన్ డాలర్ల ఎకానమీ లక్ష్యంగా ప్లానింగ్

### ఖజానాకు పెరిగిన ఆదాయం

### కేబినెట్ సబ్‌కమిటీ సమావేశంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క



**హైదరాబాద్, ఏప్రిల్ 10, ప్రభాతవార్త:** రాష్ట్రంలో ఎఐ వంటి ఆధునిక టెక్నాలజీ వినియోగం ద్వారా పన్నుల ఆదాయంపై నిరంతరం సమీక్ష, పకడ్బందీ నిర్వహణతో వివిధ శాఖల్లో ఆదాయం పెరుగుదల కనిపిస్తుందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. హైదరాబాద్‌లోని సచివాలయంలో శుక్రవారం రెవిన్యూ జనరేషన్ రిసోర్స్ మొబలైజేషన్ క్యాబినెట్ సబ్ కమిటీ సమావేశంలో సభ్యులు జూపల్లి కృష్ణారావు, ఉత్తమ్‌కుమార్‌రెడ్డితో కలిసి పాల్గొన్న ఆయన మాట్లాడుతూ ఎఐటెక్నాలజీ వినియోగంతో మైనింగ్, రవాణా శాఖల్లో ఆదాయ వనరులను పెంచుకోగలిగామన్నారు. ఇసుక, క్రషర్ మైనింగ్ విభాగాల్లో అక్రమ రవాణా, ఓవర్ లోడ్ వంటి అంశాల్లో పకడ్బందీ చర్యలు చేపట్టాలని సూచించారు. నిరంతరం సమీక్షలు, పన్నుల నిర్వహణలో పకడ్బందీ చర్యల మూలంగా కమర్షియల్ టాక్స్ శాఖలో జీఎస్టీ ద్వారా ఆదాయం గత మూడు నెలలుగా 15 శాతం పెరుగుదల కనిపించిందని వివరించారు.

ఇదే తరహాలో రిజిస్ట్రేషన్లలో సైతం ఆదాయంలో మెరుగుపడిందన్నారు. కాగా 2047 వరకు త్రీ ట్రిలియన్ డాలర్ ఎకానమీ సాధన లక్ష్యంగా ప్రణాళికలు రూపొందించుకుని, ఆ మేరకు అన్ని శాఖలు ఆదాయ సమీకరణకు ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని పేర్కొన్నారు.

హెచ్ఎండిఎ ఆధ్వర్యంలో భూముల విక్రయానికి సంబంధించి ప్రపంచ స్థాయిలో ప్రచారం నిర్వహించాలని, ఈ అంశంపై అందరికీ ముందస్తుగా సమాచారం కారణంగా ఆదాయ వనరులు పెరిగే అవకాశం ఉంటుందని తెలిపారు. భూముల విలువ పెంపునకు సంబంధించి రిజిస్ట్రేషన్ శాఖ ఆధ్వర్యంలో ఇప్పటికే వివిధ కమిటీలు ఏర్పాటు చేసి అధ్యయనం పూర్తి చేశామన్నారు. ఆ కమిటీల నివేదికలను ముందుగా సబ్ కమిటీకి సమర్పించిన తర్వాత క్యాబినెట్‌కు నివేదించేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని చెప్పారు. అలాగే మెట్రో రైల్ స్వాధీనం, నిర్వహణ, ఆదాయ, వ్యయ మార్గాలపైన, ఎక్సైజ్, రెవిన్యూ, పరిశ్రమల శాఖలోనూ ఆదాయం పెంపునకు సంబంధించి చేపట్టిన చర్యలు ఫలితాలపై సమీక్ష చేశారు. ఈ సమావేశంలో చీఫ్ సెక్రటరీ రామకృష్ణారావు, వివిధ శాఖల ఉన్నతాధికారులు సందీప్ కుమార్ సుల్తానియా, వికాస్ రాజ్, సభ్య సాచి ఘోష్ తదితరులు పాల్గొన్నారు.

## సమసమాజ స్థాపన కోసం కృషి చేసిన పూలే

### వి.హనుమంతరావు ప్రశంస




చిరంజీవులుకు 'మహాత్మా జ్యోతిరావు పూలే ఎక్సలెన్స్ అవార్డు-2026'ను ప్రదానం చేస్తున్న ప్రముఖులు

**హైదరాబాద్ (రవీంద్రభారతి,) ఏప్రిల్ 10, ప్రభాతవార్త:** సమ సమాజ స్థాపన కోసం కుల ఆధారిత అసమానతలను రూపుమాపేందుకు విశేష కృషి చేసిన మహనీయుడు, సంఘ సంస్కర్త మహాత్మా జ్యోతిరావు పూలే అని రాజ్యసభ మాజీ సభ్యుడు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు వి.హనుమంతరావు చెప్పారు. తెలంగాణ సిటిజన్స్ కౌన్సిల్ ఆధ్వర్యంలో శుక్రవారం రవీంద్రభారతిలో జరిగిన పూలే 199వ జయంతి కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. సమాజంలో అంటరానితనం, కుల వ్యవస్థ నిర్మూలనకు పూలే చేసిన కృషి అపారమైనదని ఆయన చూపిన మార్గంలోనే నేటి యువతరం ముందుకు సాగాలని ఆయన పిలుపునిచ్చారు. శాసనమండలిలో ప్రతిపక్ష నేత సిహెచ్ మధుసూదనాచారి మాట్లాడుతూ పేదల కోసం, శుద్రుల హక్కుల కోసం పోరాడిన పూలే జీవితం ప్రతి ఒక్కరికి ఆదర్శమన్నారు. ఆయన జీవన విధానాన్ని అధ్యయనం చేసి అచరించాలని సూచించారు. ఆల్ ఇండియా బహుజన సమాజ్ పార్టీ కన్వీనర్ పూర్ణచంద్రరావు మాట్లాడుతూ చదువు అనే ఆయుధంతో సామాజిక గౌరవాన్ని సాధించడంలో పూలే ప్రేరణగా నిలిచారని, ఆదే మార్గంలో టి.చిరంజీవులు బిసి సమాజాభివృద్ధి కోసం కృషి చేస్తున్నారని చెప్పారు. తెలంగాణ బిసి మేధావుల ఫోరం ఛైర్మన్ టి.చిరంజీవులు మాట్లాడుతూ బిసిల ఐక్యత కోసం తనవంతు కృషిని కొనసాగిస్తున్నానని, పోరాటాల ద్వారా హక్కులను సాధించేందుకు అన్ని వర్గాలను ఒకే వేదికపైకి తీసుకువస్తానని చెప్పారు. తాను రచించిన పుస్తకాలు, ప్రసంగాల ద్వారా బిసిలలో చైతన్యం తీసుకువచ్చి పూలే కలలను నేరవేర్చేందుకు కృషి చేస్తానన్నారు. కౌన్సిల్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ రాజ్‌నారాయణముదిరాజ్ మాట్లాడుతూ రాష్ట్రం నుంచి ప్రతిభావంతుడైన ఒకరికి ప్రదానం చేసే -మహాత్మ జ్యోతిరావు పూలే ఎక్సలెన్స్ అవార్డు -2026' ఈ ఏడాది బిసి మేధావుల ఫోరం ఛైర్మన్ టి.చిరంజీవులను ఎంపిక చేయడం జరిగిందన్నారు. చిరంజీవులు చేసిన సేవలకు గుర్తింపుగా ఈ అవార్డును ప్రదానం చేస్తున్నామని తెలిపారు. ఈ సందర్భంగా అతిథులు చిరంజీవులను శాలువ, పూలమాల, జ్ఞాపిక ప్రశంసాపత్రంతో ఘనంగా సన్మానించి అవార్డు ప్రదానం చేశారు.

# నిరుద్యోగుల పోరాటానికి సంపూర్ణ మద్దతు

### వెంటనే ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్లను జారీ చేయాలి: జాన్‌వెస్లీ

**హైదరాబాద్, ఏప్రిల్ 10, ప్రభాతవార్త:** రాష్ట్రంలో నిరుద్యోగులు చేస్తున్న పోరాటాలకు తమ సంపూర్ణ మద్దతు ఉంటుందని భారత కమ్యూనిస్టు పార్టీ మార్క్సిస్టు(సీపీఐఎం) తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ స్పష్టం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ఉద్యోగాల భర్తీ కోసం నోటిఫికేషన్లను జారీ చేయాలని డిమాండ్ చేశారు. శుక్రవారం హైదరాబాద్‌లోని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యాలయం లో ఎంబీ భవన్‌లో డివైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు కోట రమేష్, రాష్ట్ర కార్యదర్శి ఆనగంటి వెంకటేష్, నిరుద్యోగ జేఏసీ కన్వీనర్ ఆర్ఎల్ మూర్తి, జేఏసీ నాయకులు కిరణ్, శ్రీనుతో కలిసి మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా జాన్ వెస్లీ మాట్లాడుతూ... కేంద్ర ప్రభుత్వ శాఖల్లో 60 లక్షల ఉద్యోగాలు ఖాళీలున్నాయనీ, ఒక్క రైల్వే శాఖలోనే 10 లక్షల ఖాళీలున్నాయన్నారు. 2014లో ఇచ్చిన రెండు కోట్ల ఉద్యోగాల భర్తీ హామీ ఏమైందని మోడీ సర్కార్‌ను ప్రశ్నించారు. తెలంగాణలో తొలి ఏడాదే 2 లక్షల ఉద్యోగాలను భర్తీ చేస్తామని హామీనిచ్చి, నిరుద్యోగుల కుటుంబాల ఓట్లతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం 28 నెలల పాలనలో కేవలం 16,798 పోస్టులను మాత్రమే భర్తీ చేసిందన్నారు. రాహుల్ గాంధీ స్వయంగా అశోక్ నగర్ చౌరస్తాకు వచ్చి ఇచ్చిన హామీ ఏమైందని ప్రశ్నించారు. డీ.వై.ఎఫ్.ఐ రాష్ట్ర అధ్యక్షులు కోట రమేష్, రాష్ట్ర కార్యదర్శి ఆనగంటి వెంకటేష్, నిరుద్యోగ జేఏసీ కన్వీనర్ ఆర్ఎల్ మూర్తి మాట్లాడుతూ... జూన్ రెండో తేదీ నాటికి జాబ్ క్యాలెండర్ విడుదల చేసి ఖాళీలను వెంటనే భర్తీ చేయాలనీ, లేనిపక్షంలో దశలవారీగా పోరాటాలు చేస్తామని హెచ్చరించారు.

# రూ.33వేల కోట్ల బకాయిలు కట్టాల్సిందే

### నీటిపారుదల శాఖకు తేల్చిచెప్పిన విద్యుత్ శాఖ

### రెండు శాఖల మధ్య ముదురుతున్న వివాదం

**హైదరాబాద్, ఏప్రిల్ 10, ప్రభాతవార్త:** విద్యుత్ సరఫరా విషయంలో రాష్ట్రంలోని రెండు ప్రధాన శాఖల మధ్య వివాదం ముదురుతోంది. ఎత్తిపోతల పథకాలకు 24 గంటల పాటు విద్యుత్ సరఫరా చేయాలని ఇరిగేషన్ శాఖ అంటుంటే, పెండింగ్ బకాయిలను చెల్లిస్తేనే విద్యుత్ సరఫరా చేస్తామని విద్యుత్ శాఖ తేల్చిచెబుతోంది. నిరంతరం విద్యుత్ సరఫరా చేయకపోతే ఎత్తిపోతల పథకాల యంత్రాలు దెబ్బతింటాయని, ఆవిధంగా ఇప్పటికే దెబ్బతిని లక్షల రూపాయలు ఖర్చు చేసి నష్టాల్లో ఉన్నట్లు ఇరిగేషన్ అధికారులు పేర్కొంటున్నారు. బకాయిలు ఉన్న రూ.33వేల కోట్ల మేర బిల్లులు చెల్లిస్తేనే ఎత్తిపోతల పథకాలకు కరెంట్‌ను సరఫరా చేస్తామని విద్యుత్ పంపిణీ సంస్థలు స్పష్టం చేశాయి. లేదంటే ఇవ్వలేం అంటూ నీటి పారుదల శాఖకు విద్యుత్ శాఖ తేల్చిచెప్పింది. ఈ మేరకు నీటిపారుదల శాఖ అధికారులకు విద్యుత్ శాఖ తాజాగా లేఖ రాసింది. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 6 గంటల దాకే ఎత్తిపోతల పథకాల పంపులు నడిపించాలని, ఆ సమయంలో సౌర విద్యుత్ ఉత్పత్తి అధికంగా ఉంటుందని, తక్కువ ధరకు విద్యుత్ లభిస్తుందని విద్యుత్ శాఖ సూచించింది. దీనివల్ల విద్యుత్ సంస్థలపైనా భారం పడదని స్పష్టం చేసింది. ఇప్పటికే విద్యుత్ సంస్థలు రూ.50 వేల కోట్లకు పైగా అప్పుల్లో ఉన్నాయని, ఇందులో రూ.33,653కోట్లు నీటిపారుదల శాఖ నుంచే రావాలని వెల్లడించింది. బిల్లులు కట్టకుండా 24 గంటల పాటు విద్యుత్ ఎలా సాధ్యమని ప్రశ్నించారు. అధిక ధరకు లభించే కరెంట్‌తో కాకుండా తక్కువ ధరకు లభించే సౌరవిద్యుత్‌తో పంపింగ్ చేసుకోవాలని సూచించింది. కాగా విద్యుత్ శాఖ అధికారవర్గాల వివరాలు ప్రకారం విద్యుత్ సరఫరా చేస్తున్న ఉత్తర, దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థలకు 2014-25 మధ్య కాలంలో మొత్తం రూ.36,435 కోట్ల బిల్లులు చెల్లించాల్సి ఉండగా, కేవలం రూ.12,2788 కోట్లు మాత్రమే చెల్లించింది. ఎత్తిపోతల పథకాల పంప్‌హౌస్‌లకు విద్యుత్ సరఫరా చేసే సబ్ స్టేషన్ల నిర్వహణ, పర్యవేక్షణ బాధ్యతలను చూస్తున్న రాష్ట్ర విద్యుత్ సరఫరా సంస్థ ట్రాన్స్కో కు చెల్లించాల్సి న బకాయిలు మరో రూ.1,550.22 కోట్లకు పెరిగాయి. నిర్మాణంలో ఉన్న ఎత్తిపోతల పథకాల సబ్‌స్టేషన్లను నిర్మిస్తున్న కాంట్రాక్టర్లకు చెల్లించాల్సి న బిల్లుల బకాయిలు రూ.4,849.57 కోట్లుకు చేరాయి.

## యమునానదిలో పడవ మునిగి 10 మంది మృతి

### మరికొందరు గల్లంతు

**లక్నో, ఏప్రిల్ 10:** పర్యాటకులతో వెళ్తున్న పడవ యమునా నదిలో బోల్తాపడింది. ఈ ప్రమాదంలో పది మంది మరణించారు. మరికొందరు గల్లంతయ్యారు. పోలీసులు, అధికారులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. గజ ఈతగాళ్ల సహాయంతో గాలింపు చర్యలు చేపట్టారు. ఉత్తరప్రదేశ్‌లోని మథుర జిల్లాలో ఈ సంఘటన జరిగింది. పంజాబ్‌లోని లూథియానాకు చెందిన సుమారు 30 మంది ఉత్తరప్రదేశ్‌లోని బృందావనాన్ని సందర్శించారు. శుక్రవారం మధ్యాహ్నం రెండు బోట్లలో యమునా నదిలో ప్రయాణించారు. బలంగా వీచిన గాలులకు ఒక బోటు తీవ్రంగా ఊగిపోయింది. పాంటూన్ వంతెనను ఢీకొట్టడంతో ఆ పడవ బోల్తా పడినట్లు ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. ఈ సమాచారం తెలుసుకున్న పోలీసులు, అధికారులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. నదిలో గల్లంతైన వారి కోసం గజ ఈతగాళ్లతో గాలింపు చర్యలు చేపట్టారు. మరోవైపు పంజాబ్‌లోని లూథియానాకు చెందిన పది మంది పర్యాటకుల మృతదేహాలను ఇప్పటి వరకు వెలికితీశారు. నదిలో గల్లంతైన మిగతా వారి కోసం గాలింపు చర్యలు కొనసాగిస్తున్నారు.

## ముగిసిన ముగ్గురు నిందితుల మూడో దఫా కస్టడీ విచారణ

### మొయినాబాద్ ఫాంహౌస్ డ్రగ్స్‌పార్టీ కేసు

### చంచల్‌గూడ జైలుకు తరలింపు

**హైదరాబాద్, ఏప్రిల్ 10, ప్రభాతవార్త:** తెలుగు రాష్ట్రాల్లో సంచలనం రేపిన మొయినాబాద్ ఫాం హౌస్ డ్రగ్స్ పార్టీ కేసులో తాండూరు మాజీ ఎంఎల్ఎ పైలట్ రోహిత్ రెడ్డి ఆయన సోదరుడు రితేష్ రెడ్డి, ఢిల్లీకి చెందిన రియల్టర్ నమిత్ శర్మలను మరోమారు చంచల్‌గూడ జైలుకు తరలించారు. గ త నెల 14వ తేదీన వెలుగు చూసిన ఈ కేసులో ముగ్గురు నిందితులను మూడవ దఫా పోలీసు కస్టడీలో భాగంగా గురువారం, శుక్రవారం నాడు చేవెళ్ల పోలీసులు విచారించారు. ఇంతకు ముందు రెండుసార్లు వీరిని మూడేసి రోజుల పాటు కస్టడీలోకి తీసుకుని విచారించిన పోలీసులు మూడవ సారి కూడా ఇదేరీతిన విచారించారు. విచారణ పూర్తయిన తరువాత శుక్రవారం మధ్యాహ్నం ముగ్గురిని ఉప్పర్‌పల్లిలోని రాజేంద్రనగర్ కోర్టులో హాజ రు పరిచారు. ఈ కేసును విచారించిన న్యాయమూర్తి ముగ్గురికి మళ్లీ రిమాండు విధించారు. కాగా కోర్టులో హాజరు పరిచే తరలించే ముందు ము గ్గురికి పోలీసులు ఉస్మానియా ఆసుపత్రిలో వైద్య పరీక్షలు నిర్వహించారు. దీని తరువాత పోలీసులు వారిని చంచల్‌గూడ జైలుకు తరలించారు. అ యితే మూడవ దఫా విచారణలోనూ నిందితులు పెద్దగా నోరు మెదపలేదని సమాచారం. దీంతో వీరిని మరోదఫా కస్టడీలోకి తీసు కునేందుకు పో లీసులు కోర్టులో పిటిషన్ దాఖలు చేయాలని భావిస్తున్నట్లు తెలిసింది.

# ఎర్రచందనం స్మగ్లర్‌కు ఐదేళ్ల జైలు శిక్ష

తిరుపతి, ఏప్రిల్ 10 ప్రభాతవార్త ప్రతినిధి: శేషాచలం అడవుల నుండి ఎర్రచందనం అక్రమ రవాణా చేస్తూ పట్టుబడిన స్మగ్లర్‌కు ఐదేళ్ల జైలు శిక్ష, రూ.6 లక్షల జరిమానా విధిస్తూ ఆర్ఎస్ఎస్ అదనపు కోర్టు న్యాయమూర్తి నరసింహమూర్తి శుక్రవారం తీర్పు నిచ్చారు. శేషాచలం రిజర్వు అటవీ ప్రాంతంలో జరుగుతున్న ఎర్రచందనం అక్రమ రవాణాను అరికట్టే లక్ష్యంతో ఎర్రచందనం అక్రమ రవాణా నిరోధక దళం కఠిన చర్యలు అమలు చేస్తోంది. టాస్క్‌ఫోర్స్ చీఫ్ లంకెల సుబ్బరాయుడు రూపొందించిన ప్రత్యేక కార్యాచరణ మేరకు టాస్క్‌ఫోర్స్ విభాగం ఎస్పీ కులశేఖర్ పర్యవేక్షణలో గతంలో నమోదై, కోర్టులో విచారణ దశలో ఉన్న కేసుల గురించి ప్రత్యేక శ్రద్ధ తీసుకు న్నారు. స్పెషల్ పిపి అమరనారాయణ కోర్టులో పటిష్ఠంగా సాక్ష్యాధారాలను నిరూపించి ముద్దాయిలకు శిక్షపడేలా చూశారు. 2017 కేసులో తమిళనాడు తిరువన్నామలై జిల్లాకు చెందిన ఆర్.రామరాజన్‌పై నేరం రుజువు కావడం తో న్యాయమూర్తి ఈ తీర్పు వెలువడించారు. కోర్టు ఆదేశాల

# సీమకు అన్యాయంపై ఐక్య ఉద్యమం

● రాయలసీమ లిఫ్ట్ ప్రాజెక్టు పనులు నిలిపివేయడం వెనుక పెద్ద కుట్ర ● గతంలో నీరుచెట్టులో దోపిడీ చేసుకున్నట్లే ఇప్పుడు నీటి భద్రత ● సాగునీటి సంఘాలకు పనులు- రాయలసీమ సాగునీటి ప్రాజెక్టులు సమాలోచన సదస్సులో మాజీ మంత్రి కాకానీ గోవర్ధన్ రెడ్డి



అనంతపురం, ఏప్రిల్10 ప్రభాతవార్త బ్యూరో: గతంలో టిడిపి ప్రభుత్వం ఉన్నప్పుడు నీరు చెట్టు పథకం కింద టిడిపి కార్యకర్తలకు దోపిడీకి అవకాశం ఇచ్చినట్లే ఇప్పుడు కూటమి ప్రభుత్వం సాగునీటి భద్రత సాగునీటి సంఘాలకు పనులు పేరుతో టిడిపి కార్యకర్తలు దోచుకునేందుకు అవకాశం ఇస్తుందని, చంద్రబాబు సర్కార్ ఏ స్కీమ్ అమలు చేసినా అందులో కమిషన్లు ఉంటాయని వైసిపి నేత, మాజీ మంత్రి కాకాని గోవర్ధన్ రెడ్డి ధ్వజమెత్తారు. వైయస్ జగన్మోహన్ రెడ్డి సిఎంగా ఉన్నప్పుడు పని ఎక్కువ చేసిన ప్రచారం తక్కువ చేసుకునేవారని, ఇప్పుడు సీఎం చంద్రబాబు పని తక్కువ చేసి ఆర్భాటంగా ప్రచారం చేసుకుంటున్నారని, ప్రభుత్వ వైఫల్యాలను వైసిపి కార్యకర్తలు జనం దృష్టికి తీసుకోవడంతో పాటు సాగునీటి పథకాలపై ఉద్యమించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్‌ను తక్షణం పూర్తి చేయడంతో పాటు హంద్రీనీవా ప్రధాన కాలువ వెడల్పు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాయలసీమ సాగునీటి ప్రాజెక్టులు - సమాలోచన పేరుతో శుక్రవారం అనంతపురంలోని గుత్తిరోడ్డులో ఉన్న కెటిఆర్ ఫంక్షన్ హాల్‌లో వైసిపి అనంతపురం జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి అధ్యక్షతన రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు విషయంలో సిఎం చంద్రబాబు వైఖరిని మాజీ మంత్రి కాకాని తూర్పార పట్టారు. రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు పనులను అర్ధాంతరంగా నిలిపివేయడం వెనుక పెద్ద కుట్ర దాగి ఉందని ఆరోపించారు. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చెప్పిన మాటల మేరకే ఈ ప్రాజెక్టు పనులు ఆపేశారన్న వ్యాఖ్యలపై చంద్రబాబు ఇప్పటివరకు స్పందించకపోవడం అనుమానాలకు తావిస్తున్నదని విమర్శించారు. రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు సీమలోని ఇతర ప్రాజెక్టులకు ఇన్సూరెన్స్‌లా పనిచేస్తుందని పేర్కొన్నారు. రైతులు, వ్యవసాయం గురించి ఆలోచించిన ఒకే ఒక్క నాయకుడు వైఎస్ రాజశేఖరరెడ్డి అని కొనియాడారు. చంద్రబాబు మెడలు వంచి రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్‌ను పూర్తి చేయించుకుందామన్నారు.

వైఎస్ఆర్‌సిపి అనంతపురం జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి మాట్లాడుతూ సీమ అభివృద్ధికి కీలకమైన రాయలసీమ ఎత్తిపోతల పథకం పనులు పూర్తి చేయాలని, సీమ ప్రజల ప్రయోజనాల కోసం పోరుబాటను మరింత ఉధృతం చేస్తామని స్పష్టం చేశారు. రాయలసీమపై ముఖ్యమంత్రి నిర్లక్ష్య వైఖరి స్పష్టంగా కనిపిస్తోందని విమర్శించారు.

అమరావతి రాజధాని పేరుతో ఒకే చోట నిధులు ఖర్చు పెడితే వెనుకబడిన ప్రాంతాల పరిస్థితి ఏంటని అనంత వెంకటరామిరెడ్డి ప్రశ్నించారు. రాయలసీమ అభివృద్ధి కోసం గతంలో బిజెపి రాయలసీమ డిక్లరేషన్ ప్రకటించి ఇప్పుడు మౌనంగా ఉండడం ఏంటని ప్రశ్నించారు. సీమ డిక్లరేషన్‌ను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రోగ్రాం కో ఆర్డినేటర్, మాజీ మంత్రి డాక్టర్ శైలజానాథ్, వైసిపి అనంతపురం పార్లమెంట్ పరిశీలకులు నరేష్‌రెడ్డి, సమన్వ యకర్తలు రంగయ్య, విశ్వేశ్వరరెడ్డి, వై.వెంక ట్రామిరెడ్డి, మెట్టు గోవిందరెడ్డి, కేతిరెడ్డి వెంకట్రామిరెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ, పంచాయతీరాజ్ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు వెన్నపూస రవీంద్రారెడ్డి, వైసీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి గోరంట్ల మాధవ్, రైతు విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గోకుల్‌నాథ్ రెడ్డి, కెవి రమణ మాట్లాడుతూ తెలంగాణ సిఎం రేవంత్ రెడ్డి వ్యాఖ్యలపై ఎపి సిఎం చంద్రబాబు మౌనం అనుమానాస్పదమన్నారు. ఒకవైపు ఈ ప్రాజెక్టును దొంగ ప్రాజెక్టు అని అంటూనే, మరోవైపు వేల కోట్ల రూపాయల బిల్లులు ఎందుకు చెల్లించారో ప్రభుత్వం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ ప్రాజెక్టు పూర్తయితేనే రాయలసీమ ప్రాజెక్టులకు నీరు అందుతుందని పేర్కొన్నారు. రైతు వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్న ప్రభుత్వంపై పోరాటాలు కొనసాగించాలన్నారు. రాయలసీమకు సాగు, తాగునీటి విషయంలో జరుగుతున్న అన్యాయంపై ఐక్య ఉద్యమాలే మార్గమని స్పష్టం చేశారు. అన్ని శాసనసభ స్థానాల నుంచి వైసిపి నాయకులు, కార్యకర్తలు సమావేశానికి భారీగా రావడం విశేషం.

# హర్యానాలో గుడివాడ టెకీ దారుణ హత్య



విజయవాడ, ఏప్రిల్ 10 ప్రభాతవార్త ప్రతినిధి: కృష్ణా జిల్లా గుడివాడకు చెందిన ఒక యువ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ హర్యానాలో దారుణ హత్యకు గురైన ఘటన స్థానికంగా తీవ్ర విషాదాన్ని నింపింది. గుడివాడ శివారు బేతవోలుకు చెందిన టెకి బండ్ల ఋషికేష్ (27) ఇటీవలే హర్యానాలోని పంచకుల ప్రాంతంలో ఉన్న ఒక ఐటీ సంస్థలో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా ఉద్యోగంలో చేరారు. విధుల్లో చేరి పది రోజులు కూడా గడవకముందే ఆయన మరణవార్త వినాల్సి రావడం అందరినీ దిగ్భ్రాంతికి గురిచేసింది. కంపెనీ కేటాయించిన నివాస గదిలోనే ఋషికేష్ రక్తపు మడుగులో విగతజీవిగా పడి ఉండటాన్ని స్థానికులు గుర్తించారు. గుర్తు తెలియని వ్యక్తులు ఆయనను హత్య చేసినట్లు ప్రాథమికంగా తెలుస్తోంది. సమాచారం అందుకున్న హర్యానా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తును ముమ్మరం చేశారు. గుడివాడ వన్‌టౌన్ పోలీసులు ఈ విషయాన్ని కుటుంబ సభ్యులకు చేరవేయడంతో, ఋషికేష్ తండ్రి హుటాహుటిన హర్యానాకు బయలుదేరి వెళ్లారు. ఈ హత్య వ్యక్తిగత కారణాలతో జరిగిందా? లేక ఆఫీసు గొడవలేమైనా ఉన్నాయా? అనే కోణాల్లో పోలీసులు విచారణ జరుపుతున్నారు. కొత్త చోట, కొత్త ఉద్యోగంలో చేరిన కొద్ది రోజుల్లోనే ఇలా జరగడం వెనుక ఏదైనా కుట్ర ఉందా? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఉద్యోగ రీత్యా పంచకుల వెళ్లిన కొద్ది రోజుల్లోనే ప్రాణాలు కోల్పోవడంతో బాధితుడి కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరవుతున్నారు.

# సీమకు అసలైన ద్రోహి జగన్ రెడ్డే

- టిడిపి జిల్లా నేతలు అంబికా లక్ష్మినారాయణ, శ్రీధర్ చౌదరి ధ్వజం




అనంతపురం, ఏప్రిల్ 10 ప్రభాతవార్త బ్యూరో: రాయలసీమలోని 102 నీటి ప్రాజెక్టులకు రద్దుచేసి సీమ బిడ్డ అని చెప్పుకునే జగన్‌రెడ్డి సీమరైతుల పట్ల క్షమించారని ద్రోహం చేశాడు అని, ఇప్పుడు దెయ్యాలు వేదాలు వల్లించినట్టు డైవర్షన్ కోసం ఈ రోజు రౌండ్ టేబల్ సమావేశం పెట్టి కూటమి ప్రభుత్వంపై బురద చల్లుతున్నారు అని అనంతపురము ఎంపి అంబికా లక్ష్మినారాయణ, టిడిపి జిల్లా పార్టీ ప్రధాన కార్యదర్శి జి.శ్రీధర్ చౌదరి తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. ఎంపి అంబికా లక్ష్మినారాయణ, టిడిపి జిల్లా పార్టీ ప్రధాన కార్యదర్శి శ్రీధర్ చౌదరిలు సంయుక్తంగా ఎంపి క్యాంప్ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాజీ గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ గౌస్ మోద్దీన్, జిల్లా పార్టీ ఉపాధ్యక్షులు కృష్ణకుమార్, జిల్లా పార్టీ కార్యాలయ కార్యదర్శి తాజుద్దీన్‌లతో కలిసి ఘాటుగా వైసిపి నాయకులకు బదులిచ్చారు. ఎంపి అంబికా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ రాయలసీమకు జగన్ రెడ్డి ద్రోహం చేస్తే తెలుగుదేశం ప్రభుత్వం న్యాయం చేసింది. అందుకు సాక్ష్యం నేడు రాయలసీమలోని అన్నీ జిల్లాల్లో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలే అందుకు నిదర్శనమన్నారు. రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు పై అనంతపురంలో జగన్ రెడ్డి తన ఐదేళ్ల పాలనలో రాయలసీమకు ఏం చేశాడడనే విషయాన్ని చెప్పాలి. జగన్ రెడ్డి పిచ్చి తుగ్లక్ పాలనలో రాయలసీమ రైతులకు ఎలాంటి ప్రయోజనం చేయలేదన్నారు. గుండ్రేవుల, వేదవతి, ఆర్డీఎస్, బిటి ప్రాజెక్ట్ లాంటి 102 రాయలసీమ ప్రాజెక్టుల పనుల్ని జీఓ 365 తో జగన్ ప్రభుత్వం ఎందుకు రద్దు చేశారని ప్రశ్నించారు. రాయలసీమ రైతులకు ఉపయోగకరమైన డ్రిప్ ఇరిగేషన్ పథకాన్ని కూడా జగన్ రద్దీ చేశారన్నారు. 2026-27 ఆర్థిక బడ్జెట్‌లో రూ.10,014 కోట్లు ఒక్క రాయలసీమ ప్రాజెక్టులకు కేటాయించారని ఆయన గుర్తు చేశారు. పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్‌తో సహా నేటి రాయలసీమ ప్రాజెక్టుల్లో 80శాతం ఎన్టీఆర్, చంద్రబాబు నిర్మించినవేనని అంబికా గుర్తు చేశారు. టిడిపి జిల్లా పార్టీ ప్రధాన కార్యదర్శి శ్రీధర్ చౌదరి మాట్లాడుతూ జగన్ పాలనలోనే ఆగిపోయిన రాయలసీమ లిఫ్టును ఇప్పుడు కూటమి ప్రభుత్వం ఎలా అపివేస్తుందన్నారు. జగన్ జమాన 2021లో ఆగిపోయిన లిఫ్ట్ నిర్మాణాలకు నాలుగేళ్ళల్లో అనుమతులు ఎందుకు జగన్ ప్రభుత్వం సాధించలేకపోయారన్నారు. ప్రాంతీయ విద్వేషాలు రెచ్చగొట్టి రాజకీయ లబ్ది పొందడానికి కుట్ర చేసింది మన రాయలసీమ వాసులు ఇంకా మర్చిపోలేదన్నారు. దాదాపు రాయలసీమ హార్టికల్చర్ హబ్ కోసం రూ.30 వేల కోట్లు బడ్జెట్‌లో కేటాయించడం శుభపరిణామని పేర్కొన్నారు. రాయలసీమను రతనాల సీమగా మార్చే ఒక యజ్ఞానికి ముఖ్యమంత్రి చంద్రబాబు పూనుకున్నారని, దానికి ఇప్పుడు రాక్షసుల్లా వైసిపి నాయకులు అడ్డుపడకుండా సహకరించాలని హితువు చెప్పారు.

# వర్కింగ్ జర్నలిస్టుల హెల్త్ స్కీమ్ మరో యేడాది పొడిగింపు

విజయవాడ, ఏప్రిల్ 10 ప్రభాతవార్త ప్రతినిధి: రాష్ట్రంలోని వర్కింగ్ జర్నలిస్టులు వారి కుటుంబ సభ్యుల ఆరోగ్య పరిరక్షణకు అమలు చేస్తున్న వర్కింగ్ జర్నలిస్టుల హెల్తు స్కీమ్ ను మరో ఏడాది అనగా 2026-27 కు పొడిగిస్తూ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈమేరకు శుక్రవారం రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ కార్యదర్శి సౌరవ్ గౌర్ జిఓఎంస్ సంఖ్య 43 ద్వారా ఉత్తర్వులు జారీ చేశారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో జిఓ ఎంస్ సంఖ్య 12 ద్వారా 2015లో అక్రిడేటెడ్ వర్కింగ్ జర్నలిస్టులు ప్రింట్ మరియు ఎలక్ట్రానిక్ మీడియా అదే విధంగా ఫ్రీలాన్స్, వెటరన్ జర్నలిస్టులు వారి కుటుంబ సభ్యుల ఆరోగ్య పరిరక్షణకు ప్రభుత్వ ఉద్యోగుల ఆరోగ్య పథకం మాదిరిగా వివిధ ఎంపానల్డ్ ఆసుపత్రుల ద్వారా గుర్తింపు పొందిన అన్ని ప్రభుత్వ ప్రైవేట్ నెట్‌వర్క్ ఆసుపత్రుల ద్వారా ఎటువంటి నగదు చెల్లించాల్సిన అవసరం లేకుండా క్యాస్ లెస్ వైద్య సేవలు అందించే లక్ష్యంతో వర్కింగ్ జర్నలిస్టుల హెల్తు స్కీమ్‌ను ప్రవేశపెట్టడం జరిగింది. దీర్ఘకాలిక వ్యాధులు మరియు అత్యవసర శస్త్రచికిత్సలతో సహా ప్రభుత్వం నిర్ణయించిన వందలాది వైద్య విధానాలు ఈ పథకం కింద కవర్ చేయబడతాయి. కాలానుగుణంగా ఈపథకాన్ని ప్రతి ఏటా అనగా 2016-17 నుండి 2025-26 వరకూ పొడిగించడం జరిగింది. మరలా ఈవర్కింగ్ జర్నలిస్టుల కాంప్రెహెన్సివ్ హెల్తు స్కీమ్ ను మరో ఏడాది కాలానికి అనగా 2026- 27 కు పొడిగించాలన్న సాధారణ పరిపాలన శాఖ (ఐఅండ్ పిఆర్) విజ్ఞప్తి మేరకు ప్రభుత్వం ఈనెల 1వ తేదీ నుండి వచ్చే ఏడాది మార్చి 31 వరకూ పొడిగిస్తూ నిర్ణయం తీసుకుని ఆమేరకు ఉత్తర్వులు జారీ చేసింది. వర్కింగ్ జర్నలిస్టుల హెల్తు స్కీమ్ పొడింగింపు ఉత్తర్వులకు అనుగుణంగా వెంటనే తగిన చర్యలు తీసుకోవాల్సిందిగా చీఫ్ ఎగ్జిక్యూటివ్ అధికారి డా.ఎన్టిఆర్ వైద్య సేవ ట్రస్ట్ మరియు సంచాలకులు సమాచార పౌర సంబంధాల శాఖ చర్యలు తీసుకోవాల్సిందిగా వైద్య ఆరోగ్యశాఖ కార్యదర్శి సౌరవ్ గౌర్ ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

# పల్నాడు అత్యాచార ఘటనలో నిందితుడు అరెస్టు



గుంటూరు, ఏప్రిల్ 9 ప్రభాతవార్త ప్రతినిధి: మాచర్ల పోలీసు స్టేషన్ పరిధిలో మహిళపై జరిగిన అత్యాచార ఘటనలో నిందితుడిని అరెస్ట్ చేపట్టినట్లు పల్నాడు జిల్లా ఎస్పీ బి.కృష్ణారావు తెలిపారు. ఈ నెల 2వ తేదీన మాచర్ల పట్టణంలో నివాసం వుండే మహిళా తన ఇంటిలో ఒంటరిగా వున్న సమయంలో మంచి నీళ్ల కోసం వచ్చిన గుర్తు తెలియని వ్యక్తి ఆమె పై అత్యాచారం చేసి దారుణంగా దాడి చేశాడన్న ఫిర్యాదు పై పోలీసులు విచారణ జరిపి గురువారం నిందితుడిని అరెస్టు చేశారు.పోలీసుల కథనం ప్రకారం నిందితుడు నామాల శ్రీనివాస్ కు సోషల్ మెసేజ్ యాప్ ద్వారా బాధితురాలితో గత కొంతకాలంగా పరిచయం వుంది. ఇంస్టాగ్రామ్ ద్వారా ఆమెతో సన్నిహిత సంబంధం ఏర్పరుచుకున్నట్లు తెలిసింది. ఈ క్రమంలో బాధితురాలు అతనిని తన ఇంటికి రావాలని ఆహ్వానించి అతను ఇంటికి చేరుకునే వరకు మార్గ నిర్దేశం చేసినట్లు పోలీసులకు బాధితురాలు తెలిపినట్లు సమాచారం. ఆ విధంగా మహిళ ఇంట్లోకి ప్రవేశించిన నిందితుడు ఆమె పై అత్యాచారానికి పాల్పడినట్లు పోలీసులు పేర్కొన్నారు. మహిళలు , బాలికల భద్రత రక్షణకు పల్నాడు జిల్లా పోలీస్ శాఖ అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, మహిళలు, చిన్నారులపై జరిగే నేరాలను ఏమాత్రం సహించబోమని, నేరాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ ఈ సందర్భంగా స్పష్టం చేశారు.



# అచ్చెన్నాయుడూ.. నీ వ్యాఖ్యలు వెనక్కి తీసుకో!

వైఎస్సార్ మరణంపై నీ వ్యాఖ్యలు సరికాదు

మీడియా సమావేశంలో మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం

ఆముదాలవలస, ఏప్రిల్ 10 ప్రభాతవార్త: దివంగత మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖర రెడ్డి మరణంపై మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు చేసిన వ్యాఖ్యల పట్ల మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. శుక్రవారం ఆముదాలవలస తన నివాసంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాజకీయ ఉనికి కోసం చనిపోయిన వ్యక్తిపై బురద చల్లడం అచ్చెన్నాయుడి దిగజారుడుతనానికి పరాకాష్ట అని మండిపడ్డారు. వైఎస్సార్ మరణించిన సమయంలో జగన్మోహన్ రెడ్డి విదేశాల్లో ఉన్నారంటూ అచ్చెన్నాయుడు చేసిన వ్యాఖ్యలను తిప్పికొడుతూ, ఆనాడు తండ్రి మరణవార్త విని కుప్పకూలిపోయిన కుటుంబానికి జగన్ అండగా ఉండి,అంత్యక్రియల వరకు అన్ని తానై చూసుకున్న విషయం ప్రపంచం మొత్తానికి తెలుసని, నీ రాజకీయ లబ్ధి కోసం ఇన్ని అబద్ధాలు ఆడతావా అని నిలదీశారు. మంత్రి అచ్చెన్నాయుడి విమర్శలకు కౌంటర్ ఇస్తూ, గార మండలం సింగపురం దగ్గర ఎర్రన్నాయుడుపై జరిగిన బాంబ్ బ్లాస్ట్ ఘటనలో నీ హస్తం లేదని చెప్పగలవా అంటూ సంచలన ప్రశ్నలు సంధించారు. విశాఖపట్నంలో జరిగిన ఒక కార్యక్రమంలో పాల్గొని తిరుగు ప్రయాణంలో రణస్థలం మండలం వద్ద ఎర్రంనాయుడు వాహన ప్రమాదంలో మృతి చెందిన ఘటనలో నీ హస్తం లేదని చెప్పగలవా అంటూ తమ్మినేని ప్రశ్నించారు. వైఎస్సార్ పాదయాత్ర ద్వారా ప్రజల గుండెల్లో చెరగని ముద్ర వేశారని, ఆయన ప్రవేశపెట్టిన ఫీజు రీయింబర్స్‌మెంట్, ఉచిత విద్యుత్ వంటి పథకాలు తరాల జీవితాలను మార్చాయని గుర్తు చేస్తూ, అలాంటి మహనీయుడిపై విమర్శలు చేయడం ఆకాశంపై ఉమ్మి వేయడమేనని ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో మావిగన్ ప్లాన్ బికి ప్రజల నుంచి అనూహ్య మద్దతు లభిస్తోందని, అమరావతిలో జరుగుతున్న దోపిడీ నుంచి ప్రజల దృష్టిని మళ్లించేందుకే చంద్రబాబు ఆదేశాలతో అచ్చెన్నాయుడు ఇటువంటి నీచమైన డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారని ఆరోపించారు. 'అమరావతి వద్దు.. మావిగన్ ముద్దు' అని ప్రజలు అంటున్నారని, ఇప్పటికైనా నోరు అదుపులో పెట్టుకోకపోతే అచ్చెన్నాయుడు భవిష్యత్తులో తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని తమ్మినేని సీతారాం ఘాటుగా హెచ్చరించారు.




# తిరుపతి రుయా ఆసుపత్రిలో ఒపి వేళల్లో మార్పు

తిరుపతి, ఏప్రిల్ 10 ప్రభాతవార్త ప్రతినిధి: రాయలసీమ జిల్లాలకే తలమానికంగా ఉన్న, నిరుపేద రోగులకు, బాధితులకు మెరుగైన వైద్యసేవలందిస్తున్న తిరుపతి రామ్‌నారాయణ రుయా ఆస్పత్రిలో ఒపి వేళలు మార్పు చేస్తూ ఆస్పత్రి అధికారులు నిర్ణయం తీసుకున్నారు. రోజువారీగా అన్ని విభాగాలతో కలిపి సుమారు 1,500 మంది వరకు ఒపిలు నమోదవుతూన్నాయి. ఇప్పటికే రాయలసీమ జిల్లాల్లోనే గాక నెల్లూరు, ప్రకాశం జిల్లాల పరిధిలో రోడ్డుప్రమాదాలు జరిగినా, అత్యవసర కేసులు తిరుపతి రూయా ఆస్పత్రికి వస్తున్నాయి. ఇలా రోగుల సంఖ్య పెరగడంతోబాటు ఆస్పత్రిలో నిపుణులైన వైద్యులు మెరుగైన వైద్యసేలందిస్తున్నారు. వేసవికాలంలో ఎండ తీవ్రత పెరగడంతో ఒపి వేళల్లో మార్పుచేశారు. ఎంతో దూర ప్రాంతాల నుండి వచ్చే రోగులు ఇబ్బంది పడకుండా ఉండేందుకు వీలుగా సోమవారం 13వ తేదీ నుండి ఉదయం 8గంటలకు ఒపిలు కౌంటర్లు ప్రారంభమవుతాయి. ఉదయం 8 నుండి సాయంత్రం 4గంటల వరకు ఒపిలు తీసుకొని వైద్య సేవలు పొందవచ్చని రుయా ఆస్పత్రి వైద్యులు తెలిపారు. ప్రస్తుతం రుయా ఆస్పత్రిలో ఉదయం 9గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు మాత్రమే ఒపిలు జారీచేస్తున్నారు. ఆ తర్వాత అత్యవసర కేసుల ఒపిలే జారీ అవుతాయి. రోగులు, బాధితులు ఈ వేళల మార్పును గమనించి ఆస్పత్రికి చేరుకోవాలని కోరారు.

# స్వచ్ఛ తిరుమలకు మరింత ప్రత్యేక శ్రద్ధ





- కొండపై భక్తులకు దాహార్తి తీర్చుతున్న కదిలే మినీ నీళ్ల ట్యాంకులు

తిరుమల, ఏప్రిల్ 10 ప్రభాతవార్త ప్రతినిధి: కలియుగ వైకుంఠం తిరుమలను మరింత పరిశుభ్రంగా ఉంచేందుకు తిరుమల తిరుపతి దేవస్థానమ్ ప్రత్యేక కార్యాచరణ అమలుచేస్తోంది. ఇప్పటికే దేశంలోనే అత్యంత పరిశుభ్ర పుణ్యక్షేత్రాల్లో తిరుమలకు మొదటిస్థానం లభించింది. రోజూ లక్షమంది వరకు వస్తున్న భక్తుల ఆరోగ్యం, పారిశుద్ధం, పర్యావరణ పరిరక్షణపై ప్రత్యేక దృష్టి పెట్టింది. సుమారు 4.5 చదరపు కిలోమీటర్ల పరిధిలో పారిశుద్ధ్య నిర్వహణ సమర్థంగా కొనసాగుతోంది. ఇందుకు తిరుమలను మూడు జోన్లుగా, ఏడు వార్డులుగా విభజించి, ప్లాస్టిక్ వినియోగాన్ని పూర్తిగా నిషేధించారు. నో స్టాక్ - నో గోడౌన్ లైసెన్సులను జారీ చేయడం జరుగుతోంది. వార్డు1 పరిధిలో ప్రధానమైన శ్రీవారి ఆలయం పరిధిలో విభాగ సిబ్బంది ప్రత్యక్షంగా పనిచేస్తున్నారు. వార్డు2 నుండి 7 వరకు పారిశుద్ధ్య పనులు మూడు కాంట్రాక్ట్ సంస్థల ద్వారా నిర్వహిస్తున్నారు. చెత్త సేకరణకు తొమ్మిది టిప్పర్ వాహనాలు పనిచేస్తున్నాయి. రోజుకు సుమారు 45 ట్రిప్పులు చేసి, దాదాపు 3,056 చెత్త డబ్బాల నుండి చెత్త సేకరణ జరుగుతోంది. 2025 సంవత్సరానికి సంబంధించి హానికర రసాయనాలు లేకుండా మట్టిలో కలిసిపోయే వ్యర్థాలు 16,689.04 మెట్రిక్ టన్నులు. నాన్‌బయో డిగ్రేడబుల్ వ్యర్థాలు 8,221.97 మెట్రిక్ టన్నులు సేకరణ జరుగుతోంది. భక్తుల సౌకర్యార్థం తిరుమలలో విస్తృతంగా మరుగుదొడ్ల బ్లాకులు ఏర్పాటు చేశారు. శాశ్వత మరుగుదొడ్లు 210. సంస్థల మరుగుదొడ్లు 130. తాత్కాలిక మరుగుదొడ్లు 14 అందుబాటులో ఉన్నాయి. వేసవికాలంలో భక్తులకు దాహార్తి కలిగించకుండా శ్రీవారి సేవకులతో మొబైల్ వాటర్ డ్రమ్స్‌తో తాగునీరు పంపిణీ జరుగుతోంది. వేసవి ప్రారంభమవ్వడంతో భక్తులు తాగునీటికి ఇబ్బంది పడకుండా నేరుగా భక్తుల వద్దకే శ్రీవారి సేవకులు వెళ్లి తాగునీరు అందిస్తున్నారు. ఎన్ఎబిఎల్ గుర్తింపు పొందిన ఈ ల్యాబ్ భక్తులకు అందించే నీరు, ఆహారం నాణ్యతను కఠినంగా పరీక్షిస్తోంది. ప్రతిరోజూ లడ్డూ, అన్నప్రసాదం తయారీలో ఉపయోగించే పదార్థాల పరీక్షలు, నీటి నమూనాల విశ్లేషణ (రోజుకు సుమారు 20 నమూనాలు), నెలకు 1,200 నమూనాల పరీక్షలు, నెయ్యి నాణ్యత పరీక్షలకు ఆధునిక హెచ్‌పిఎల్‌సి, జిసి యంత్రాలు వినియోగంలో ఉన్నాయి. భారత ఆహార భద్రతా ప్రమాణాల సంస్థ ద్వారా ఇటీవల 19.75 కోట్లతో అత్యాధునిక ఫుడ్ ల్యాబ్ ఏర్పాటు జరిగింది. తిరులలో నాణ్యమైన పారిశుద్ధ్య సేవలపై భక్తుల్లో సంతృప్తి వ్యక్తమవుతోంది. దేశంలో మరెక్కడా లేనివిధంగా టిటిడి ఎప్పటికప్పుడు చెత్తను సేకరిస్తూ భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చర్యలు చేపట్టడం, మరుగుదొడ్లను అనునిత్యం పరిశుభ్రంగా ఉంచడం వంటి చర్యలపై భక్తులు టిటిడిని ప్రశంసిస్తున్నారు.

# తిరుపతి పద్మావతి మహిళ వర్సిటీకి ఐఎస్ఓ గుర్తింపు

- మెరుగైన విద్యాబోధన, అత్యుత్తమ విధానాల అమలు



తిరుపతి, ఏప్రిల్ 10 ప్రభాతవార్త ప్రతినిధి: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో తొలి మహిళ విశ్వవిద్యాలయం తిరుపతి పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం అంతర్జాతీయ నాణ్యతా ప్రమాణాల సంస్థ (ఐఎస్ఓ) గుర్తింపు సాధించింది. ఈ గుర్తింపుతో విశ్వవిద్యాలయం మరో ముఖ్యమైన మైలురాయిని చేరుకుంది. నాణ్యమైన విద్య, సమర్థవంతమైన పరిపాలన, నిరంతర అభివృద్ధి పట్ల విశ్వవిద్యాలయానికి ఉన్న నిబద్ధతకు ఐఎస్ఓ సర్టిఫికేషన్ నిదర్శనమని వర్సిటీ ఉపకులపతి ఆచార్య ఉమ వెన్నం తెలిపారు. ఇంటర్నేషనల్ సర్టిఫికేషన్స్ ప్రైవేట్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ ఆలపాటి శివయ్య రెండురోజులు విశ్వవిద్యాలయాన్ని సందర్శించి, ఈ నూతన ధ్రువీకరణ పత్రాలను విశ్వవిద్యాలయ అధికారులకు అందజేశారు. విశ్వవిద్యాలయ పురోగతిపై ఆయన విద్యాసంస్థ పారదర్శకత, అత్యుత్తమ విధానాల అమలులో అత్యున్నత స్థాయి నిబద్ధతను ప్రదర్శించిందని కొనియాడారు. ఉపకులపతి ఆచార్య ఉమ ఈ సాధన పట్ల హర్షం వ్యక్తం చేస్తూ, ఈ సర్టిఫికేషన్ అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థుల సమిష్టి కృషికి లభించిన గుర్తింపు అని పేర్కొన్నారు. ఆవిష్కరణలు, సమ్మిళితత్వం, విద్యాపరమైన విశిష్టత కోసం వర్సిటీ నిరంతరం కృషి చేస్తుందని ఆమె పేర్కొన్నారు. వర్సిటీ రిజిస్ట్రార్ ఆచార్య ఆర్. ఉష మాట్లాడుతూ ఐఎస్ఓ ధ్రువీకరణ విశ్వవిద్యాలయంకు విద్య, పరిపాలనా ప్రక్రియల్లో నాణ్యత, పారదర్శకత, నిరంతర మెరుగుదలకు లభించిన గుర్తింపు అని తెలిపారు. విద్య ద్వారా మహిళా సాధికారతకు నిరంతరం కట్టుబడి ఉందని డైరెక్టర్ ఐక్యూఎసి ఆచార్య టి.త్రిపురసుందరి పేర్కొన్నారు.

# యుపిఎస్‌సి సంయుక్త రక్షణ సేవల పరీక్షకు ఏర్పాట్లు



తిరుపతి, ఏప్రిల్ 10 ప్రభాతవార్త ప్రతినిధి: యుపిఎస్‌సి ద్వారా తిరుపతి కేంద్రాల్లో రేపు ఆదివారం జరిగే సంయుక్త రక్షణ సేవల పరీక్ష (1)కు అన్ని ఏర్పాట్లు చేపట్టినట్లు తిరుపతి జిల్లా రెవెన్యూ అధికారి నరసింహులు తెలిపారు. 2026 జాతీయ రక్షణ అకాడమీ నావల్ అకాడమీ పరీక్షకు తిరుపతిలో నాలుగు కేంద్రాలున్నాయన్నారు. శుక్రవారం తిరుపతి జిల్లా కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో ఈ పరీక్షల నిర్వహణకు సంబంధించి జిల్లా రెవెన్యూ అధికారి నరసింహులు లైజనింగ్ అధికారులు, సంబంధిత ఆదికారులతో సమావేశం నిర్వహించారు. జిల్లాలో మొత్తం నాలుగు పరీక్ష కేంద్రాలలో 1,535 మంది అభ్యర్థులు హాజరు కానున్నారని తెలిపారు. పరీక్షా కేంద్రాలలోకి మొబైల్ ఫోన్, ఎలక్ట్రానిక్ పరికరాలు, ఎలక్ట్రానిక్ వాచ్‌లు, వైర్లెస్ హెడ్ సెట్స్, తదితర ఎలక్ట్రానిక్ వస్తువులు అనుమతి ఉండదని, అభ్యర్థుల సౌకర్యార్థం సకాలంలో పరీక్షా కేంద్రాలకు చేరుకునే విధంగా ఆర్టిసి ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచించారు. తిరుపతిలో పద్మావతి మహిళా జూనియర్ కళాశాల (వింగ్ -ఎ), పద్మావతి గెస్ట్ హౌస్ సమీపంలో, పద్మావతి మహిళ డిగ్రీ కళాశాల ప్రక్కన, తిరుపతి, పద్మావతి మహిళా జూనియర్ కళాశాల (వింగ్ -బి), పద్మావతి గెస్ట్ హౌస్ సమీపంలో, ఎస్.వి ఆర్ట్స్ కళాశాల, (టి.టి.డి.), (వింగ్ ఎ,బి), బాలాజీ కాలనీ సమీపంలో కేంద్రాలన్నారు. పరీక్షల రాష్ట్ర పరిశీలకుడు జితేంద్ర కుమార్, అధికారులు పాల్గొన్నారు.

## ఏప్రిల్ 23న తిరుపతి, చిత్తూరు జిల్లాలలో తమిళనాడు ఉద్యోగులకు వేతనంతో కూడిన సెలవు

విజయవాడ, ఏప్రిల్ 10 ప్రభాతవార్త ప్రతినిధి: తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల దృష్ట్యా తిరుపతి, చిత్తూరు జిల్లాలలో పనిచేసే ఆ రాష్ట్రంలో అర్హులైన ఓటర్లుగా ఉన్న ఉద్యోగులకు వేతనంతో కూడిన సెలవు మంజూరు చేస్తూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. పోలింగ్ రోజైన ఏప్రిల్ 23న, ఎపిలో పనిచేస్తున్న తమిళనాడు ఓటర్లకు, రోజువారీ వేతన కార్మికులతో సహా అందరికీ వేతనంతో కూడిన సెలవు వర్తిస్తుంది. ప్రజా ప్రాతినిధ్య చట్టం 1951, సెక్షన్ 135బి ప్రకారం ఓటు హక్కును వినియోగించుకునే అవకాశం కల్పించారు. ఈ నిబంధనను ఉల్లంఘించి, ఓటు వేయడానికి సెలవు ఇవ్వని యజమానులపై కఠిన చర్యలు తీసుకుంటారు. ఈ సదుపాయాన్ని ఉపయోగించుకుని, తమిళనాడులో ఓటు హక్కు ఉన్న ఉద్యోగులు, కార్మికులు ఓటును వినియోగించుకోవచ్చు.

# మగువ మెచ్చే మిథిలా కళ



ఫ్యాషన్ ఫ్యాషన్

పురాతన కళ మిథిలా కళ మనుగడ సాగించడానికి కారణం మహిళలే! మొదట గోడలపైనా, ప్రేమల రూపంలోనే కనిపించేది. తరవాత చీరల పైనా మెరవడం మొదలు పెట్టింది. ఆకర్షించే రంగుల మీద ప్రకృతి, పురాణ కథలు, జానపద కళలకి చోటిస్తారు. అన్నీ కట్టుకున్నవారికి సౌభాగ్యం, సంపద, అభివృద్ధి కలిగి ఉంటుందని బిహారీల నమ్మకం. కాబట్టే జాగ్రత్తగా తీర్చిదిద్దుతారు. వీళ్ల ప్రాధాన్యమూ ప్రకృతిహిత వస్త్రాలు, సహజ రంగులే. టస్సర్, చందేరి, భాగల్‌పురి సిల్క్, కంచి సిల్క్, కాటన్ వస్త్రాల మీద చేత్తో తీర్చిదిద్దిన నెమళ్లు, చేపలు, ఏనుగులు, పచ్చని మొక్కలు దేవతా రూపాలు కట్టుకున్న వారికి అందాన్ని తేవడమే కాదు నడిచొస్తున్న పెయింటింగ్‌ని స్ఫురణకు తెస్తాయి.









# వేసవిలో నిమ్మరసం



డాక్టర్ కె.ఉమాదేవి
తిరుపతి

ఆరోగ్య భాగ్యం

నిమ్మచెట్టుయొక్క పసుపు పండుని ప్రపంచవ్యాప్తంగా ఉపయోగిస్తారు. నిమ్మరసంలో దాదాపు 5-6% సిట్రిక్ ఆమ్లం ఉంటుంది. ఈ సిట్రస్ పండ్లు పుల్లని రుచిని కల్గి ఉంటాయి. నిమ్మలోని ఆసిడ్ కేలరీల్ని ఖర్చు చేస్తుంది. వేసవి వచ్చిదంటే ప్రతి ఇంట్లో, బైట నిమ్మరసం నిమ్మ సోడా త్రాగాల్సిందే. నిమ్మరంసలోని సిట్రిక్ ఆసిడ్ నేచురల్ ఆంటిసెప్టిక్‌లా పనిచేసి కడుపులోని క్రిముల్ని నిర్మూలిస్తుంది. వేసవిలో నిమ్మరసంలో పంచదార, చిటికెడు ఉప్పు చేర్చి చల్లని నీరు కలిపి త్రాగితే నోరుఎండుకు పోవడం దప్పిక తీరడమే కాకుండా వడదెబ్బ తగులకుండా కాపడుతుంది దీనివల్ల తృప్తి కల్గుతుంది. ఆకలి పెరుగుతుంది. దాంతో వికారం, వాంతులు, తలత్రిప్పడం, తలనొప్పి, అధిక చెమటలు పట్టడం వంటివి తగ్గుతాయి. రోజూ ఉదయం నిద్రలేవగానే నిమ్మరసంలో కొద్దిగా తేనె కలుపుకొని త్రాగితే రోజువారీ అవసరాలకి కావలసిన విటమిన్ సిలో 21% లభిస్తాయి. వీటిని రోజు తప్పకుండా తీసుకుంటే రోగ నిరోక శక్తి తక్కువగా ఉన్నవారిలో ఇమ్యూనిటీ బూష్టర్‌గా పనిచేస్తుంది. ఇది శరీరాన్ని ఉత్తేజ పర్చి, శరీరంలోని వ్యర్థాల్ని బైటికి పంపే డీటాక్సిఫికేషన్‌గా పనిచేస్తుంది. నిమ్మరసంలోని ఆంటీ ఆక్సిడెంట్స్ కాలేయం దెబ్బతినకుండా కాపాడడమే కాకుండా కాలేయ శుద్ధి కావించి కాలేయ వ్యాధుల నివారణలో కూడా ఉపయోగపడుతుంది. అయితే నిమ్మరసం త్రాగినంత మాత్రాన అన్ని రోగలు తగ్గవు. కాని కొన్ని ఆరోగ్య ప్రయోజనాల దృష్యా ఇదొక మంచి ఆరోగ్య అలవాటు మాత్రమే దీనివల్ల శరీరం కూడా తేలికగా అనిపిస్తుంది. నిమ్మరసంలో జీలకర్ర, అల్లం కలిపి త్రాగితే జీర్ణవ్యవస్థ శుభ్రపడి మలబద్ధకం విరేచనాలు తగ్గుతాయి. ఆరోగ్యకరమైన ప్రేవుల ఆరోగ్యానికి, మెటబాలిజమ్ ప్రక్రియలకి నిమ్మరసం మించిందిలేదు. ఒక నిమ్మపండు నుండి ఇంచుమించు 3 చెంచాల నిమ్మరసం వస్తుంది. తక్షణ శక్తినిచ్చే నిమ్మరసాన్ని నిరాహార దీక్ష విరమించే వారు సైతం తీసుకోవడం ఒక సంప్రదాయంగా మారింది. గోరు వెచ్చని నీటిలో నిమ్మ రసం తేనె కలుపుకొని త్రాగడం వల్ల స్థూలకాయం తగ్గుతుంది. నిమ్మరసంలో కొద్దిగా తినే సోడా కలిపి త్రాగిన కడుపులో మంట, ఆసిడ్ రిఫ్లెక్స్, అజీర్తి, అల్సర్స్ తగ్గుతాయి. నిమ్మరసం త్రాగడం వల్ల, పొంగు, ఆటలమ్మ, తట్టు వ్యాధులు శరీరంలో మంటలు తగ్గుతాయి. నోరు జిగురు, నోరు దుర్వాసన తగ్గుతుంది. ఇది వేడిని తగ్గించి చలువ చేస్తాయి. నిమ్మరసం అరటి పండు కలిపి తిపడం వల్ల రక్తమొలలు, ఫిస్టులా, జిగట విరేచనాలు తగ్గుతాయి. నిమ్మకాయకు చిన్న రంధ్రం చేసి దాని వాసనపీల్చిన ఎడల జర్నీ సిక్‌నెస్, వికారం వాంతులు, తలనొప్పి వంటి లక్షణాలు తగ్గుతాయి. నిమ్మరసంలో పెరుగు మరియు దోసకాయ రసం కలిపి ముఖానికి అప్లై చేసిన ముఖం జిడ్డు కాండం తగ్గి, మొటిమలు, నల్లని మచ్చలు పొక్కులు తగ్గుతాయి. □

# హై హై నాయకి హైదరాబాదీ !



ఉన్నత విద్యావంతురాలైన డా మేనకా గురుస్వామి హైదరాబాద్‌లో జన్మించారు. కేవలం న్యాయవాద వృత్తికి మాత్రమే పరిమితం కాలేదు.మానవ హక్కుల కార్యకర్తగా ప్రసిద్ధి చెందారు. ఆమె తన ఉనికిని రాజకీయాలకు విస్తరిస్తూ తృణమూల్ కాంగ్రెస్ పార్టీకి అనుసంధ్యాంగా అనేక న్యాయ వ్యవహారాలను పర్యవేక్షించేవారు. పశ్చిమ బెంగాల్‌లోని తృణమూల్ కాంగ్రెస్ సంబంధిత సంస్థలపై ఇ.డి దాడుల సమయంలో టీఎంసీ తరపున మేనకా గురుస్వామి సుప్రీంకోర్టులో వాదనలు వినిపిం చారు. ఇవే కాకుండా, పరిపాలనా సంస్కరణలు, రైట్ టు ఎడ్యుకేషన్, సాల్వాజుడుం వంటి ఎన్నో సంచల నాత్మక కేసులలో కూడా ఆమె తన వాదనలు వినిపించారు. ఆమె ఇప్పుడు ప్రపంచ టవ్యాప్తంగా తన వాదనాపటిమతో గుర్తింపు పొందిన మహిళ. బహుముఖ ప్రజ్ఞాశాలిగా పేరొందిన ఆమెకు మరో రంగం ఏప్రిల్ **6, 2026**న భారతదేశ ఎగువ సభ స్వాగతం పలికింది.

**సంచలనాత్మక నేపథ్యం !** 2018లో స్వలింగ సంపర్కం నేరం కాదంటూ, భారతదేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు ఇచ్చిన చారిత్రాత్మక తీర్పులో కీలక వాదనలు వినిపించిన సీనియర్ న్యాయవాది డా మేనక గురుస్వామి ప్రపంచ దృష్టిని ఆకర్షించారు. 1974లో హైదరాబాద్‌లో జన్మించిన ఆమె దేశంలోని ప్రఖ్యాత న్యాయ విశ్వవిద్యాలయం (లా యూనివర్సిటీ) నల్సార్ సహా ప్రతిష్టాత్మక ఆక్స్‌ఫర్డ్, హార్వర్డ్ యూనివర్సిటీల నుండి న్యాయశాస్త్రంలో పట్టాలు పొందారు. కొలంబియా యూనివర్సిటీలో బీఆర్ అంబేద్కర్ రీసెర్చ్ స్కాలర్‌గా కూడా పనిచేసిన ఆమె ఐక్యరాజ్యసమితికి సంబంధించిన అనేక న్యాయపర మైన వ్యవహా రాలను కూడా పర్యవేక్షించారు. భారత శిక్షా స్మృతిలోని సెక్షన్ 377లోని కొంత భాగాన్ని రద్దు చేయడం ద్వారా, భారత సుప్రీం కోర్టు 2018 సెప్టెంబర్ 6న స్వలింగ సంపర్కాన్ని అధికారికంగా నేర రహితం చేసింది. 'అసహజ నేరాలను' నేరంగా పరిగణించిన వలస పాలన నాటి ఆ చట్టం రాజ్యాంగ విరుద్ధమని, అహేతుక మని, అలాగే గోప్యత, గౌరవం మరియు సమాన త్వానికి సంబంధించిన ప్రాథమిక హక్కులను ఉల్లంఘించేదని ఈ ఏకగ్రీవ తీర్పు ప్రకటించింది. ఈ కేసు సంద ర్భంలో మేనకా గురుస్వామి సుప్రీంకోర్టు లో వినిపించిన వానలే కోర్టు తీర్పుకు కలకమ య్యాయి. ఆ తర్వాత 'టైమ్స్ మ్యాగజైన్' ప్రకటించిన ప్రపంచంలోని 100 మంది అత్యంత ప్రభావ వంత మైన వ్యక్తుల జాబితాలో ఆమెకుచోటు దక్కడం గమనార్హం. దేశ పార్ల మెంటరీ చరిత్రలోనే ఎల్జిబిటిక్యు ప్లస్ క్వీర్ వర్గానికి తొలిసారిగా డా.మేనకా గురుస్వామి ప్రాతి నిథ్యం వహించడం ఓ సరికొత్త అధ్యాయానికి నాంది పలి కింది. ఎవరూ ఊహించని విధంగా స్వలింగ సంపర్కురాలైన (హోమో సెక్సువల్) మేనకా గురుస్వామిరాజ్యసభలో కాలుపెట్టింది.

**వాదనాపటిమతోనే ముందడుగు:** ప్రపంచంలోని 38 దేశాలు స్వలింగ జంటల వైవాహిక సంబంధా లను చట్టబద్ధం చేశాయి. వివాహానికి బదులుగా, కొన్ని దేశాలు ప్రత్యా మ్నాయ చట్టపరమైన గుర్తింపు (ఉదాహరణకు, సివిల్ యూనియన్లు, డొమెస్టిక్ పార్ట్‌నర్‌షిప్‌లు) అవకాశాలు కల్పిస్తున్నాయి. కొన్ని దేశాలలో హక్కుల విషయంలో పురోగతి సాధిస్తుండగా, మరికొన్ని దేశాలలో పెరుగు తున్న ఆంక్షలు ఎల్జిబిటిక్యు ప్లస్ వ్యతిరేక చట్టాలు కొనసాగు తున్నాయి. అయినా మేనక ఎంతో ధైర్యంగా అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందిన సీనియర్ న్యాయవాది. ఆమె తన భాగస్వామి, మరో సుప్రీంకోర్టు న్యాయవాది అయిన అరుంధతి కట్జూతో సహజీవనంచేయడం విశేషం

- యేచన్ చంద్ర శేఖర్

# రామరాజ్యం సాధ్యమే

రామాయణ మహాకావ్యం నదులు పర్వాతాలు ఉన్నంత కాలం వుంటుందని బ్రహ్మ దేవుడు వాల్మీకి మహర్షికి ఇచ్చినవరం. రామ, ఆయనం కలిపితే రామాయణం, అంటె రాముని ప్రయాణం. రాముని ప్రయాణమంతా, ఆయన పయనించిన మార్గం అంతా ధర్మహితం, ప్రజాహితం జీవహితం, ధర్మనిష్ఠని, కార్యదీక్షని తన జీవితమంతా ఆచరించి చూపిన ధర్మమూర్తి, వేదమూర్తి. అందుకే ఆయన పాలించిన రాజ్యం రామరాజ్యం అయింది. అందరూ రామరాజ్యం కావాలని కోరుకుంటారు. అదే రాముని విశిష్టత. అదే రాముని పరిపాలనా ప్రత్యేకత. అదే రామరాజ్యం చొక్క పరమోష్ఠ. అంతటి గొప్పరాజు నీతిజ్ఞుత రామునిది. ఉత్తమోత్తమ రాజనీతిజనక్షతతో, ధర్మాన్ని, అడుగడుగునా, అణవణు వునా పాటిస్తూ ప్రజాహితంగా పరిపాలన అందించిన పరిపూర్ణ ఆరధ్యమూర్తి. అందుకే ఇన్ని వేల సంవత్సరాల తర్వాత కూడా రాముడిని కోలుస్తూన్నాం. కొనయాడుతున్నాం.

ఆధ్యాత్మికం

రామ రాజ్యం అని వేనోళ్ళ పొగుడుతున్నాము. పితృవాక్యం పరిపాలన కోసం శ్రీరాముడు వనవాసానికి వెళ్ళాడు. భరతుడు రాముడు వెతుకుంటూ మంది మార్బలంతో పరివారంతో రాముడ్ని కలవడానికి వస్తాడు. రాముని భరతుడు కలుసుకున్నప్పుడు అతనికి రాజనీతిజనక్షతను, ఎన్నో రాజధర్మాలనూ శ్రీరాముడు చెబుతాడు. దేవుడు లేడు, పరలోకం, పరుజన్మలేదు అని విశృంఖలత్వంతో ఇంద్రియాలు ఏ రకంగా చెబితే ఆ రకంగా ఉండే మనస్తత్వాన్ని విడనాడాలి. క్రోధం వలన అనరాని మాటలు అనరాదు. దానివలన పాపం వస్తుంది. పెద్దలవలన పొరపాటు జరిగినా, తొందరపడివారిని ఏమీ తిరిగి కోపంగా అనరాదు. ఇంద్రియాలకు లొంగి పోరాదు. వ్యసనాలకు బానిసకాకూడదు. అలసత్వాన్ని, సోమరితనాన్ని, వదులుకోవాలి. రాజైనవాడు ఎప్పుడూ అప్రమత్తంగా వుండాలి. ఎప్పుడు అతి జాగరూకుడై మెలగాలి. అప్పుడే రచకార్యాలు సమన్వయంగా సాగుతాయి. ప్రజల మంచిని దృష్టిలో వుంచుకునే తాను నిర్ణయాలను తీసుకోవాలి. ప్రజలకు భారంగా వుండే అధికపన్నులు వేయరాదు. ప్రజలను పీడనకు గురిచేయంచు రాజుయజ్ఞయాగామలే గావించి, పితృ, దేవ, రుషుల రుణాలను తీర్చుకోవచ్చును. గురువులనూ, మహర్షులను, ఆచార్యలనూ పెద్దలనూ గౌరవించాలి. పాలకులు శ్రీరాముని ఆదర్శంగా తీసుకోవాలి.రాజ్యంలో ఉన్నధీనులనూ, హీనులనూ, అనాధలనూ అన్నార్తులనూ, వృద్ధులనూ ఆదుకోవాలి. వారి క్షేమాలు చూడాలి. అది రాజధర్మం. తల్లిదండ్రుల్ని ప్రజల్ని ప్రేమతో చూసుకోవాలి. సదాచార, సంపన్నతి, సత్ప్రవర్తన, లోకహితంగావించే వారిని పురోభితులుగా నియమించి, యజ్ఞ, హోమ, ఆధ్మాత్మికల కర్మలు జరిగేలా చూడాలి. బుద్ధి కుశలత లోనూ, ఆలోచనా శక్తిలోనూ, ఉన్నతంగా ఉండేవారిని తనతో సమానమైన వారినీ, పరాక్రమంలో రాజుకు తగ్గజోడీ అయ్యేటటు వంటి వారినీ, యోధులైనవారినీ, మంత్రులుగా నియమించాలి. శ్రీరాముడు అందించిన ధర్మపథంలో పాలన సాగించాలి.

డా॥ పులివర్తి కృష్ణమూర్తి

# రఘుకుంచె 'గేదెలరాజు ' 24న విడుదల



రఘుకుంచే టైటిల్ పాత్ర పోషిస్తున్న చిత్రం'గేదెలరాజు. కాకినాడ తాలుకా సినిమా ట్యాగ్‌లైన్. రఘుకుంచే తో పాటు రామచంద్రం పుణ్యమూర్తుల, వికాస్, టీనా శ్రావ్య, మోనిక, రవి చిన్నిబిల్లి తదితరులు నటించిన ఈ సినిమా టీజర్, ట్రైలర్, పాటలు విడుదలై మంచి విజయాన్ని అందుకున్న సంగతి తెలిసిందే. మొదటగా ఈ చిత్రాన్ని ఏప్రిల్ 17న విడుదల చేద్దామనుకున్నారు చిత్ర నిర్మాత దర్శకుడు చైతన్య మోటూరి. ఏప్రిల్ 17న దాదాపు తొమ్మిది సినిమాలు విడుదలకు సిద్ధమవ్వటంతో సినిమా హక్కులు కొనుక్కున్న డిస్ట్రిబ్యూటర్స్ సలహా మేరకు ఈ చిత్రాన్ని మరో వారం రోజుల తర్వాత అంటే ఏప్రిల్ 24న సినిమా విడుదల చేస్తున్నట్టు మేకర్స్ తెలియచేశారు. ఈ చిత్రం ట్రైలర్‌కి అనూహ్యమైన స్పందన రావటంతో రఘు కుంచే , చైతన్య మోటూరిలు మాట్లాడుతూ- కంటెంట్ ఉన్న సినిమాను పది సినిమాల మధ్యలో విడుదల చేసి ఆ సినిమా అస్థిత్వాన్ని కోల్పోయేలా చేయకూడదు అన్న ఒకే ఒక ఉద్దేశ్యంతో సినిమాను మరుసటి వారానికి వాయిదా వేస్తున్నామన్నారు. అలాగే సినిమా ట్రైలర్ చూసిన ఒక్కొక్కరు ట్రైలర్ చాలా కొత్తగా ఉంది అని ప్రతి ఒక్కరు నలుగురికి చెప్పటంతో ఆర్గానిక్‌గా మా సినిమాకి చక్కని బజ్ ఏర్పడింది అన్నారు.

# 'లవ్ ఇన్సూరెన్స్ కంపెనీ' ఫుల్ లెంగ్త్ లవ్ స్టోరీ



**విగ్నేష్ శివన్ గారు ఈ స్టోరీ చెప్పినప్పుడు మీకు ఎలా అనిపించింది?**
ఉప్పెన్ల తర్వాత పూర్తిస్థాయి లవ్ స్టోరీ చేయలేదు. అలాంటి ఫుల్ లెంత్ ప్రేమ కథ చేసే అవకాశం ఇందులో వచ్చింది. ఇందులో ప్రేమకథ చాలా ఫ్రెష్‌గా ఉంటుంది. ఈ జనరేషన్ లో డబ్బులు లేకపోయినా పర్వాలేదు, కానీ ఫోన్ లేకుండా ఉండడం చాలా కష్టం. అలాంటి ఒక క్యారెక్టర్ చేస్తున్నాను. విజువల్ కాన్సెప్ట్ 2040 ఫ్యూచరిస్టిక్‌గా ఉన్నా, కథ మాత్రం అందరికి రిలేటబుల్‌గా ఉంటుంది.

**మీకు కూడా ఫోన్ అంటే చాలా ఇష్టమా?**
వర్క్ ఉన్నప్పుడు నేను అసలు ఫోన్ టచ్ చేయను.

**ఈ సినిమాను నయనతార నిర్మించారు కదా.. షూటింగ్ సమయంలో వచ్చేవారా?**
ఈ సినిమాతో నయనతార గారితో మంచి అనుబంధం ఏర్పడింది. సినిమాలో చూస్తే ఒక బాస్ లేడీలా ఉంటారు, కానీ బయట చాలా స్వీట్ పర్సన్. నయనతార

**ఇది ఫ్యూచరిస్టిక్ లవ్ స్టోరీ కదా.. మీ మనసులో ఓల్డ్ స్కూల్, ఫ్యూచరిస్టిక్ లవ్ స్టోరీకి సంబంధిం చిన ఏవైనా ఆలోచనలు ఉన్నాయా?**
నేనైతే ఓల్డ్ స్కూల్ థాట్‌ని బిలీవ్ చేస్తాను. 'సీతా రామం', '96' లాంటి ప్రేమకథలు నా ఫేవరెట్. అమాయకత్వంలో ఒక ఆనందం ఉంటుంది.

**ఫ్యూచర్‌లో లవ్ ఇన్సూరెన్స్ కంపెన్నీ లాంటి సిచువేషన్ వచ్చే అవకాశం ఉందా?**
ఇప్పుడు బాడీలో ప్రతి పార్ట్‌ని ఇన్సూరెన్స్ చేస్తున్నారు. ఫ్యూచర్‌లో లవ్ కూడా ఒక ఇన్సూరెన్స్‌గా భాగం కావచ్చు.

**ఈ సినిమా చేస్తున్నప్పుడు మీకు చాలెంజింగ్‌గా అనిపించిన అంశం ఏమిటి?**
శివన్ గారు నాకు ఈ క్యారెక్టర్ గురించి చెప్పినప్పుడు, ఇప్పటివరకు నా కెరీర్‌లో చేసిన క్యారెక్టర్స్‌కి భిన్నంగా చేద్దాం అన్నారు. దానికి తగ్గట్టే ప్రిపరేషన్ జరిగింది. ఇందులో నా క్యారెక్టర్ ఎక్స్‌ప్రెసివ్‌గా ఉండదు.

**ప్రదీప్ రంగనాథన్ గురించి?**
ప్రదీప్ రంగనాథన్ గారు చాలా స్వీట్ పర్సన్. అన్ని విషయాల్నీ అబ్జర్వ్ చేస్తుంటారు. ఎప్పుడూ నవ్వుతూనే ఉంటారు.

**ఎస్జే సూర్య గారి గురించి?**
ఎస్జే సూర్య గారితో వర్క్ చేయడం గ్రేట్ ఎక్స్‌పీరియన్స్. ఆయన లొకేషన్‌కి వచ్చిన తర్వాత అసలు కూర్చోరు.

**కొత్తగా చేస్తున్న సినిమాలు?**
ప్రస్తుతం తెలుగులో అనిల్ రావిపూడితో ఒక సినిమా చేయబోతున్నాను.

# చీరకట్టు సోయగాలతో కుషిత కల్లపు



ఈ మధ్యకాలంలో చిట్టి పొట్టి బట్టలతో ఆకట్టుకునే అవసరం లేకుండానే సాంప్రదాయంగా ఒంటినిండా దుస్తులు ధరిస్తూ అందాలతో అభిమానులను ఆకట్టుకుంటున్నారు కొంతమంది హీరోయిన్స్.ముఖ్యంగా రుక్మిణి వసంత్, అనుపమ పరమేశ్వరన్, రెజీనా కాసాండ్రా ఇలా చెప్పుకుంటూ పోతే ఎంతోమంది హీరోయిన్లు చీర కట్టులో కనిపించే అభిమానులను మెస్మరైజ్ చేస్తున్నారు. ఇప్పుడు ఆ జాబితాలోకి కుషిత కల్లపు కూడా వచ్చి చేరింది. తాజాగా మరొకసారి సోషల్ మీడియాలో అభిమానుల హృదయాలను గెలుచుకుంది తాజా ఇన్‌స్టాగ్రామ్ పోస్టు ఈమెకు పెరుగుతున్న ప్రజాదారణకు నిదర్శనం అనడంలో సందేహం లేదు. తాజాగా చీర కట్టులో అందాలను ఆరబోస్తూ షేర్ చేసిన ఈ ఫోటోలు అందరి దృష్టిని ఆకర్షిస్తున్నాయి. లైట్ స్కై బ్లూ కలర్ చీర కట్టి మెరూన్ రెడ్ బ్లౌజ్ ధరించి నడుమును సన్నని గొలుసుతో ఫుల్ ఫిల్ చేస్తూ వెనుక నుంచి స్టైల్ ఇస్తూ షేర్ చేసిన ఫోటోలు అభిమానుల హృదయాలను ఒక్కసారిగా కొల్లగొట్టాయి. నీటి కొలను దగ్గర నిలబడి బ్యాక్ అందాలు చూపిస్తూ కుషిత షేర్ చేసిన ఈ ఫోటోలు అభిమానులను విపరీతంగా ఆకట్టుకుంటున్నాయి. ఇకపోతే ఈ ముద్దుగుమ్మను ఇలా చూసేసరికి అభిమానులు కొత్త నేషనల్ క్రష్ అంటూ పిలుస్తున్నారు. ఇప్పటికే పలువురు భామలను బీట్ చేసి తన అందంతో ఉక్కిరిబిక్కిరి చేస్తోంది కుషిత. ముఖ్యంగా ఈమె స్టైల్ కి అభిమానులు ఫిదా అవుతున్నారు అనడంలో సందేహం లేదు. 3 రోజెస్ సీజన్ 2 లో కనిపించిన ఈమె అక్కడ తన అద్భుతమైన నటనతో ప్రశంసలు అందుకుంది.2002 అక్టోబర్ 19న తెలంగాణ హైదరాబాదులో జన్మించిన ఈమె ఇన్‌స్టాగ్రామ్ ఇన్ఫ్లుయెన్సర్గా తన కెరియర్ను మొదలు పెట్టింది . ఇక ఆ తర్వాత నటిగా సినిమా ఇండస్ట్రీలోకి ప్రవేశించింది.

# 'శిఖండి' సినిమా టీజర్ లాంచ్



యువరాజ్ గౌడ, నిఖిల్, దీపక్ శెట్టి, ఖ్యాతి, నిఖిత స్వామి ప్రధాన పాత్రల్లో నటిస్తున్న సినిమా శిఖండి. ఈ చిత్రాన్ని పోలా మూవీస్ బ్యానర్ పై పోలా ప్రవీణ్ కుమార్ నిర్మిస్తున్నారు. హీరోయిన్ నిఖిత స్వామి మాట్లాడుతూ ఈ చిత్రంలో నాది శిఖండి పాత్ర అని మేకర్స్ చెప్పారు. నేను కన్నడలో హీరోయిన్‌గా నటిస్తున్నాను. నటి నీతు వనజాక్షిమాట్లాడుతూ శిఖండి చిత్రంలో నటిస్తుం డటం హ్యాపీగా ఉంది. డైరెక్టర్ ఈ సినిమా కథ ఎంత బాగా చెప్పారో అంత బాగా తెరకెక్కించారు. ఆయన చెప్పిన ఎలిమెంట్స్ అన్నీ మూవీలో ఉన్నాయి. మా మూవీ టీజర్ మీ అందరికీ నచ్చిందని నమ్ముతున్నాను. అన్నారు.నటి చాందినీ మాట్లాడుతూ శిఖండి మహాభారతంలోని పాత్ర అనే విషయం నాకు తెలియదు. నేను పెద్దగా చదువుకోలేదు. ఈ సినిమాలో నటించే అవకాశం వచ్చినప్పుడు భయంగా అనిపించింది. మ్యూజిక్ డైరెక్టర్ ప్రద్యోత్తన్ మాట్లాడుతూ నేను రామ్ గోపాల్ వర్మ గారి ఐస్ క్రీమ్ సినిమాకు మ్యూజిక్ చేశాను. ఇటీ వల నా కన్నడ మూవీ ఒకటి మంచి సక్సెస్ అయ్యింది. ఈ చిత్రానికి బీజీఎం అందించాను. నటుడు దీపక్ శెట్టి మాట్లాడుతూ నేను నటిస్తున్న తొలి తెలుగు చిత్రమిది. మా మూవీ టీజర్ లాంచ్‌కు వచ్చిన ప్రతి ఒక్కరికీ థ్యాంక్స్. రైటర్ ఆలపాటి మాట్లాడుతూ నా స్నేహితుడు ప్రవీణ్ కుమార్ ఇలాంటి గొప్ప చిత్రాన్ని నిర్మించడం సంతోషంగా ఉంది.

తెర

# 'తిమ్మరాజుపల్లి టీవీ' మూవీ ట్రైలర్ లాంచ్



టెక్నికల్ బ్రిలియన్స్, ఆర్టిస్టుల పర్ ఫార్మెన్స్ లు, అందమైన ఊరి వాతావారణం చూసేందుకు మా "తిమ్మరాజుపల్లి టీవీ" సినిమా చూడండి ట్రైలర్ రిలీజ్ ఈవెంట్ లో హీరో కిరణ్ అబ్బవరం. న్యూ టాలెంట్‌ను ఎంకరేజ్ చేస్తూ హీరో కిరణ్ అబ్బవరం సుమైర స్టూడియోస్ తో కలిసి తన కేఏ ప్రొడక్షన్స్ పై నిర్మిస్తున్న సినిమా 'తిమ్మరాజుపల్లి టీవీ'. తేజ వేల్పుచర్ల సహ నిర్మాతగా వ్యవహరిస్తున్నారు. ఈ చిత్రంతో సాయి తేజ్, వేద జలంధర్ హీరో హీరోయిన్స్ గా పరిచయమవుతున్నారు. 'తిమ్మరాజుపల్లి టీవీ" చిత్రంతో వి.మునిరాజు దర్శకుడిగా పరిచయమవుతున్నారు. విలేజ్ బ్యాక్ డ్రాప్ లో సాగే పీరియాడిక్ డ్రామాగా రూపొందుతున్న ఈ సినిమా ఈ నెల 17న గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ కు రెడీ అవుతోంది. నటుడు సాయికృష్ణ మాట్లాడుతూ "తిమ్మరాజుపల్లి టీవీ' సినిమాలో నేను దక్షిణం అనే క్యారెక్టర్ లో నటించాను. నటుడు బాల్ రాజ్ మాట్లాడుతూ నేను చాలా చిత్రాల్లో నటించినా నన్ను ఇలా గుర్తించి ఎవరూ స్టేజీ మీదకు పిలవలేదు. కిరణ్ అన్న నాకు అలాంటి అవకాశం కల్పించారు. నటుడు చిట్టి మాట్లాడుతూ ఈ సినిమాలో హీరో స్నేహితుడి పాత్రలో నటించాను. నటి కరిష్మ మాట్లాడుతూ 'తిమ్మరాజు పల్లి టీవీ' సినిమాలో గంగోజీ పాత్రలో నటించాను. నటి స్వాతి మాట్లాడుతూ నేను నటించిన తొలి చిత్రమిది. అందుకే ఈ మూవీ నాకు ఎంతో ప్రత్యేకం.

# 'రావు బహాదూర్' ఫస్ట్ సింగిల్ 'ఓ సుందరి' 15న రిలీజ్



సూపర్‌స్టార్ మహేష్ బాబు, నమ్రతా శిరోద్కర్ జిఎంబి ఎంటర్‌టైన్‌మెంట్, ప్రముఖ దర్శకుడు వెంకటేష్ మహా దర్శకత్వంలో, వెర్సటైల్ యాక్టర్ సత్యదేవ్ కథానాయకుడిగా నటిస్తున్న 'రావు బహాదూర్' చిత్రాన్ని సగర్వంగా అందిస్తోంది. ఈ చిత్రాన్ని ఏ+ఎస్ మూవీస్, శ్రీచక్రాస్ ఎంటర్‌టైన్ మెంట్స్ సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. స్మరణ్ సాయి స్వరపరిచిన ఫస్ట్ సింగిల్ 'ఓ సుందరి' ఏప్రిల్ 15న విడుదల కానుంది. సత్యదేవ్, దీపా థామస్‌లను రొమాంటిక్ సెటప్‌లో ప్రజెంట్ చేసిన సాంగ్ రిలీజ్ అనౌన్స్మెంట్ పోస్టర్ ఆకట్టుకుంది. సైకలాజికల్ ఇంటన్సిటీ, కనుమరుగవుతున్న ఒక రాజరిక ప్రపంచపు అవశేషాలను కలగలిపిన ఎమోషనల్ డ్రామాగా 'రావు బహాదూర్' రూపుదిద్దుకుంటోంది. రచయిత, దర్శకుడు, ఎడిటర్‌గా వెంకటేశ్ మహా ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకులను ఆకట్టుకునేలా ఈ కథని మలిచారు.అగ్రశ్రేణి నిర్మాతలు, ప్రత్యేకమైన కథన శైలితో కూడిన దర్శకుడు, అలాగే సత్యదేవ్ కెరీర్‌లోనే అత్యంత అద్భుతమైన నటనను కనబరిచే పాత్రలో కనిపిస్తున్న ఖిరావు బహదూర్ఖి పై ఇప్పటికే మంచి అంచనాలు నెలకొన్నాయి.




# ధోనీ స్టైల్ ఫినిష్

*ఇండియన్ ప్రీమియర్ లీగ్ ప్రతి ఏటా కొత్త కొత్త డైమండ్లను ప్రపంచానికి పరిచయం చేస్తోంది. నిన్నటి దాకా ఎవరికీ తెలియని ఆటగాళ్లు రాత్రికి రాత్రే స్టార్‌లుగా మారిపోతుంటారు. 2026 సీజన్‌లో అచ్చం అలాగే వెలుగులోకి వచ్చిన మరో అద్భుత కిరణం ముకుల్ చౌదరి. కోల్‌కతా నైట్ రైడర్స్ చేతుల్లోకి వెళ్లిపోయింది అనుకున్న మ్యాచ్‌ను తన సిక్సర్ల సునామీతో లక్నో సూపర్ జెయింట్స్ వైపు తిప్పేసి అందరినీ ఆశ్చర్యపరిచాడు ఈ 21 ఏళ్ల కుర్రాడు.*

(వార్త క్రీడా విభాగం)

ఏప్రిల్ 9 రాత్రి ఈడెన్ గార్డెన్స్‌లో జరిగిన మ్యాచ్‌లో ముకుల్ చౌదరి సరికొత్త చరిత్ర సృష్టించాడు. లక్నో గెలుపుపై ఆశలు వదులుకున్న దశలో ఏడో నంబర్ బ్యాటర్‌గా వచ్చిన ముకుల్ కేవలం 27 బంతుల్లోనే 54 పరుగులు చేసి అజేయంగా నిలిచాడు. ఇందులో 7 భారీ సిక్సర్లు ఉన్నాయి. ఆఖరి 4 ఓవర్లలో లక్నోకు 54 పరుగులు కావాల్సి ఉండగా, అందులో 52 పరుగులు కేవలం ముకుల్ బ్యాట్ నుంచే వచ్చాయి. ఈ అద్భుత ఇన్నింగ్స్ లక్నోకు విజయాన్ని అందించింది. ధోనీ స్టైల్‌లో మ్యాచ్‌ను ఫినిష్ చేసి, జట్టుకు అసాధారణ విజయాన్ని అందించిన ఈ యువ ఆటగాడిపై ప్రశంసల జల్లు కురుస్తోంది.

ముకుల్ చౌదరి సామర్థ్యాన్ని గుర్తించిన లక్నోయాజమాన్యం వేలంలో అతని కోసం ఏకంగా 2.60 కోట్లు ఖర్చు చేసింది. ఒక అన్‌క్యాప్డ్ ప్లేయర్‌కు ఇంత భారీ ధర ఎందుకని అప్పట్లో విమర్శలు వచ్చినా, గురువారం ఇన్నింగ్స్‌తో ముకుల్ వాటన్నింటికీ సమాధానం చెప్పాడు. ముకుల్ కేవలం హిట్టరే కాదు, వికెట్ కీపర్ కూడా కావడం జట్టుకు అదనపు బలం.

లక్నో టీమ్ కోసం ఒక మ్యాచ్ విన్నర్ దొరికాడని క్రీడా విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ముకుల్ చౌదరి ఆడిన కొన్ని షాట్లు, ముఖ్యంగా కవర్స్ మీదుగా కొట్టిన సిక్సర్ మ్యాచ్‌కే హైలైట్‌గా నిలిచింది. ఈ ఒక్క ఇన్నింగ్స్‌తో ముకుల్ ఐపీఎల్ 2026లో అత్యంత ప్రభావం చూపగల ఆటగాళ్ల జాబితాలో చేరిపోయాడు.

**ముందే హెచ్చరించిన అర్జున్ తెండూల్కర్**

ముకుల్ టాలెంట్ గురించి అర్జున్ తెండూల్కర్ ముందే హెచ్చరించాడు. ముకుల్ చౌదరి చాలా బాగా సిక్సర్లు కొడతాడు. ప్రాక్టీస్ మ్యాచ్‌ల్లో అతని హిట్టింగ్ చూసి నేను షాక్ అయ్యాను. మైదానం నలుమూలలా, ముఖ్యంగా స్క్వేర్ లెగ్, పాయింట్ మీదుగా అతను కొట్టే షాట్లు అద్భుతం. అతని బ్యాటింగ్ నన్ను బాగా ఆకట్టుకుందని తెలిపాడు. కోల్‌కతా మ్యాచ్‌లో ముకుల్ సరిగ్గా అర్జున్ చెప్పినట్లే షాట్లు ఆడటం విశేషం.

రాజస్థాన్‌కు చెందిన ముకుల్ చౌదరి... వికెట్ కీపర్ కమ్ మిడిల్ ఆర్డర్ బ్యాట్స్‌మన్. ఇటీవల అండర్-23 లెవెల్‌లో సత్తాచాటాడు. సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీలో ఐదు ఇన్నింగ్స్‌లలో 200 స్ట్రైక్ రేటుతో 173 రన్స్ స్కోరు చేశాడు. జనవరి 2023లో రంజీ ట్రోఫీ ద్వారా ఫస్ట్ క్లాస్ క్రికెట్‌లో అరంగేట్రం చేశాడు. డెత్ ఓవర్లలో వేగంగా పరుగులు చేస్తాడని ముకుల్‌కు పేరుంది. 160కి పైగా స్ట్రైక్ రేటుతో అతడు రన్స్ రాబడుతున్నాడు.

**ఏప్రిల్ 8: ఢిల్లీ క్యాపిటల్స్ వర్సెస్ గుజరాత్ టైటాన్స్; లక్ష్యం: 211 పరుగులు**

క్రీజ్‌లో స్పెషలిస్ట్ బాట్స్‌మెన్ డేవిడ్ మిల్లర్. అప్పటికే వేలిగాయంతో రిటైర్డ్‌హర్ట్ అయ్యాడు. తప్పని పరిస్థితుల్లో క్రీజ్‌లోకి వచ్చాడు. చివరి 2 ఓవర్లలో చేయాల్సిన రన్స్ 36. 19వ ఓవర్లో సిక్స్, ఫోర్, సిక్స్‌తో ఏకంగా 23 రన్స్ సాధించాడు. 20వ ఓవర్లో విజయానికి 13 రన్స్. మొదటి మూడు బంతులు మిగతా వాళ్లు ఆడేశారు. నాలుగో బంతికి మిల్లర్ సిక్స్. గెలుపుకు 2 బంతుల్లో 2 రన్స్. అయిదో బంతికి సింగిల్ తీసుకోలేదు. చివరి బంతికి నాన్ స్ట్రయికింగ్ ఎండ్‌లో ఉన్న కుల్దీప్ వేగంగా స్పందించకపోవడంతో రనౌట్. గుజరాత్ టైటాన్స్ ఖాతాలో విజయం.

**ఏప్రిల్ 9: కోల్‌కతా నైట్ రైడర్స్ వర్సెస్ లక్నో సూపర్ జెయింట్స్; లక్ష్యం: 182 పరుగులు**

128 పరుగులకే ఏడు వికెట్లు, 16 ఓవర్లు పూర్తి.. విజయానికి 4 ఓవర్లలో54 రన్స్ చేయాల్సిన పరిస్థితి. గత మ్యాచ్‌లో మిల్లర్ బ్యాటింగ్ స్టంట్ అందరికీ తెలుసు. కానీ ఇక్కడ మాత్రం అలాంటి పేరున్న బ్యాట్స్‌మెన్ లేడు. క్రీజ్‌లో ముకుల్ చౌదరి అంతకుముందు ఆడిన రెండు మ్యాచ్‌ల్లో చేసింది 2, 14 రన్స్. కోల్‌కతా తొలి విక్టరీ ఖాయమని అంతా డిసైడ్ అయ్యారు. కానీ ముకుల్ తుఫాన్‌లా చెలరేగి సిక్సర్లమోతతో 54 పరుగుల్లో ఒక్కడే 52 రన్స్ చేశాడు. చివరి ఓవర్లో రెండు సిక్స్‌లు బాది విజయానికి చేరువచేశాడు. చివరి బంతికి సింగిల్ తీస్తే గెలుపు. బంతి వికెట్ల వెనక్కి వెళ్లింది. నాన్ స్ట్రయికర్‌లో ఉన్న అవేష్ వేగంగా పరుగు పూర్తి చేయడంతో లక్నోకు అద్భుత విజయం లభించింది.

## ఐపీఎల్‌లో నేటి మ్యాచ్‌లు

| | | | |
|---|---|---|---|
| సన్‌రైజర్స్ హైదరాబాద్ V/S పంజాబ్ కింగ్స్ | మధ్యాహ్నం 3.30 గం.లకు | చెన్నై సూపర్ కింగ్స్ V/S ఢిల్లీ క్యాపిటల్స్ | రాత్రి 7.30 గం.లకు |

ఐపీఎల్‌లో ఈ రోజు రెండు మ్యాచ్‌లు అలరించనున్నాయి. న్యూచండీఘర్ వేదికగా మధ్యాహ్నం 3.30 గంటలకు సన్‌రైజర్స్ హైదరాబాద్, పంజాబ్ కింగ్స్ తలపడతాయి. పంజాబ్ అజేయ జైత్రయాత్రకు సన్‌రైజర్స్ బ్రేక్ వేస్తుందా అన్న ఉత్కంఠ నెలకొంది. బ్యాటింగ్‌లో వైఫల్యాన్ని అధిగమిస్తే భారీ స్కోరుకు ఢోకా ఉండదు. అభిషేక్, ఇషాన్ కిషన్‌పై భారీ ఆశలు పెట్టుకుంది. బౌలింగ్‌లో ప్రత్యర్థిని కట్టడిచేసే స్థాయిలోనే ఉంది. మరోమ్యాచ్‌లో రాత్రి 7.30 గంటలకు సొంతగడ్డపై ఢిల్లీ క్యాపిటల్స్‌తో చెన్నై సూపర్ కింగ్స్ తలపడనుంది. ఆడిన మూడు మ్యాచ్‌ల్లోనూ ఓడిన సీఎస్‌కే పరాజయల బాటకు ఫుల్‌స్టాప్ పెట్టాలని చూస్తోంది. ధనాధన్ ధోనీ అందుబాటులోకి రావడం జట్టుకు కలిసొచ్చే అంశం. మరో వైపు గత మ్యాచ్‌లో అనూహ్యంగా ఓడిన ఢిల్లీ క్యాపిటల్స్ రెండు విజయాలు, ఓ పరాజయంతో ఉంది.



## నైషిక్‌కు గోండ్వానా కప్

**హైదరాబాద్:** ఛత్తీస్‌గఢ్‌లోని రాయ్‌పూర్‌లో జరిగిన ఆలిండియా టెన్నిస్ టోర్నీలో హైదరాబాద్‌కు చెందిన నైషిక్ రెడ్డి విజేతగా నిలిచి గోండ్వానా కప్‌తో పాటు లక్ష రూపాయల నప్రైజ్ మనీ అందుకున్నాడు. పురుషులసింగిల్స్ ఫైనల్లో టాప్ సీడ్ ప్రసాద్ ఇంగలే(మహారాష్ట్ర)ను 7-6, 6-4తో ఓడించాడు. సెమీస్‌లో 3వ సీడ్ అనూప్ మహాదేవ్(మహారాష్ట్ర)పై, క్వార్టర్స్ ఫైనల్లో ప్రబీర్ ముఖేష్ (గుజరాత్)పై గెలుపొందాడు. టోర్నీ మొత్తంలో నైషిక్ ఒక్క సెట్ కూడా కోల్పోలేదు. ఛత్తీస్‌గఢ్ ఉపముఖ్యమంత్రి అరుణ్ సావ్, ఆలిండియా టెన్నిస్ అసోసియేషన్ సెక్రటరీ జనరల్ అనిల్ ధూపర్... నైషిక్‌కు ట్రోఫీ అందజేశారు. సురేష్ కృష్ణ టెన్నిస్ అకాడమీలో నైషిక్ శిక్షణ పొందుతున్నాడు. మాజీ ఒలింపియన్ విష్ణు వర్ధన్ మార్గదర్శకత్వం వహిస్తున్నారు.

# భారత్ పసిడి పంచ్

## మీనాక్షి, ప్రీతి, అరుంధతి, ప్రియ స్వర్ణాల పంట



**ఉలాన్‌బాటర్ (మంగోలియా):** ఆసియా సీనియర్ బాక్సింగ్ చాంపియన్‌షిప్‌లో భారత మహిళా బాక్సర్ల పంచ్ అదిరింది. పతకాల పంట పండించింది. మీనాక్షి హుడా (48 కేజీలు), ప్రీతి పవార్ (54 కేజీలు), అరుంధతి చౌధరీ (70 కేజీలు), ప్రియ ఘన్‌ఘస్ (60 కేజీలు) పసిడి పతకాలతో మెరిశారు. ప్రపంచ చాంపియన్ జైస్మీన్ లంబోరియా (57 కేజీలు), అల్పియా పఠాన్ (80(ప్లస్ కేజీలు) రజత పతకాలతో సరిపెట్టారు. ఫైనల్స్‌లో మీనాక్షి 5-0తో నొముందరి (మంగోలియా)పై, ప్రీతి 5-0తో టోక్యో ఒలింపిక్స్ కాంస్య పతక విజేత హువాంగ్ సియావో వెన్ (చైనీస్ తైపీ)పై నెగ్గారు. అరుంధతి 4-1తో బకిత్ సెడిష్ (కజకిస్తాన్)పై, ప్రియ 3-0తో వన్ ఉన్ గ్యోంగ్ (ఉత్తర కొరియా)పై గెలుపొందారు. జైస్మీన్ 0-5తో పున్రావి ర్యునర్స్ (థాయ్‌లాండ్) చేతిలో, అల్ఫియా 0-5తో దినా ఇస్లామ్‌బెకోవా (కజకిస్తాన్) చేతిలో పరాజయం పొందారు. తెలంగాణ స్టార్, రెండుసార్లు ప్రపంచ చాంపియన్ నిఖత్ జరీన్ (51 కేజీలు)సెమీస్‌లో ఓడి కాంస్య పతకంతో సరిపెట్టింది. ఓవరాల్‌గా ఈ మెగా ఈవెంట్‌లో బరిలోకి దిగిన 10 వెయిట్ కేటగిరీల్లోనూ భారత బాక్సర్లు పతకాలు గెలుపొందారు.



# ఆయుష్ పతకం గ్యారంటీ

## ప్రపంచ నెం.4పై సంచలన విజయం

## సెమీస్‌లోకి ఎంట్రీ

**నింగ్‌బో(చైనా):** భారత యువ షట్లర్ ఆయుష్ శెట్టి.. చైనాలోని నింగ్‌బోలో జరుగుతున్న ఆసియా బ్యాడ్మింటన్ ఛాంపియన్ షిప్‌లో పతకాన్ని ఖాయంచేసుకున్నాడు. పురుషుల సింగిల్స్ సెమీఫైనల్లోకి దూసుకెళ్లాడు. క్వార్టర్‌ఫైనల్లో ప్రపంచ నెంబర్4 జోనాటన్ క్రిస్టీ(ఇండోనేషియా)ను వరుస సెట్లలో కంగుతినిపించాడు. కేవలం 50 నిమిషాల్లోనే 23-21, 21-17తో సంచలనం విజయం అందుకున్నాడు. తొలి సెట్‌లో ఇద్దరూ హోరాహోరీగా తలపడ్డారు. టై బ్రేకర్ వరకు సాగిన ఈ సెట్‌ను గెలిచి శుభారంభం చేసిన ఆయుష్... రెండో సెట్‌లో మరింతగా విజృంభించాడు. సెట్‌ను, మ్యాచ్‌ను ముగించి ముందంజవేశాడు. ఈ ఖండాంతర టోర్నమెంట్‌లో 2018లో హెచ్.ఎస్. ప్రణయ్ తర్వాత పురుషుల సింగిల్స్‌లో పతకం సాధించనున్న తొలి భారత షట్లర్‌గా నిలవనున్నాడు. 2023లో చిరాగ్ శెట్టి, సాయిరాజ్ రంకిరెడ్డి జోడీ పురుషుల డబుల్స్ స్వర్ణం సాధించిన తర్వాత బ్యాడ్మింటన్ ఆసియా ఛాంపియన్‌షిప్‌లో భారత్‌కు ఇదే తొలి పతకం కానుంది. సెమీఫైనల్స్‌లో ఆయుష్... పారిస్ 2024 రజత పతక విజేత కున్లావుట్ విటిడ్సార్న్(థాయిలాండ్)తో తలపడతాడు. ఈ టోర్నమెంట్‌లో అంతకు ముందు, ఆయుష్ తొలి రౌండ్‌లో ప్రపంచ నంబర్ 7, ప్రస్తుత ఆసియా గేమ్స్ ఛాంపియన్ లీ షీ ఫెంగ్‌ను ఓడించి సంచలనం సృష్టించాడు. ఆ తర్వాత చైనీస్ తైపీకి చెందిన చి యు జెన్‌ను ఓడించి క్వార్టర్‌ఫైనల్స్‌కు అర్హత సాధించాడు. భారత సవాల్‌గా ఒకే ఒక్కడుగా ఉన్నాడు. కాగా రెండుసార్లు ఒలింపిక్ పతక విజేత పీవీ సింధు రెండో రౌండ్‌లో, లక్ష్య సేన్ తొలి రౌండ్‌లోనే నిష్క్రమించారు.



## డాలర్ వర్సెస్ రూపాయి

# 92.57

**ముంబయి, ఏప్రిల్ 10:** అమెరికా డాలర్‌తో పోలిస్తే భారత రూపాయి విలువ బలపడింది. వారాంతంలో రూపాయి దాదాపు 10 పైసలు లాభపడి 92.57 వద్ద ట్రేడ్ జరిగింది. ముందు రోజు ముగింపు ధర 92.66గా ఉంది. ఇంటర్ బ్యాంక్ ఫారిన్ ఎక్స్ఛేంజి కౌంటర్‌లో భారత్ కరెన్సీ బలపడుతుండటం కనిపించింది. బ్యాంకులు తమ ఆర్బిట్రేజ్ పొజిషన్లను రద్దు చేసుకోవడానికి రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా విధించిన గడువు నేటితో ముగియనుండటమే ఇందుకు ప్రధాన కారణం. ఆఫ్‌షోర్ నాన్‌డెలివరబుల్ ఫార్వర్డ్స్ (ఎన్‌డీఎఫ్)మార్కెట్‌లో బ్యాంకుల మితిమీరిన లావాదేవీలను నియంత్రించేందుకు ఆర్బీఐ గత నెలలో కీలక ఆదేశాలు జారీ చేసింది. ప్రతి పనిదినం ముగిసేసరికి బ్యాంకు నికర ఓపెన్ పొజిషన్ 100 మిలియన్ డాలర్లకు మించరాదని స్పష్టం చేసింది. ఈ గడువును పొడిగించాలని పలు బ్యాంకులు కోరినప్పటికీ, ఆర్బీఐ అందుకు అంగీకరించలేదు. దీంతో బ్యాంకులు తమ పొజిషన్లను సరిచేసుకుంటున్నాయి. ఆర్బీఐ తదుపరి ఆదేశాలు వెలువడే వరకు మార్కెట్ వేచి చూసే ధోరణిలో ఉండవచ్చని విశ్లేషకులు భావిస్తున్నారు. మరోవైపు అంతర్జాతీయ మార్కెట్ లో ముడిచమురు ధరలు పెరుగుతుండటం ట్రేడర్లను ఆందోళనకు గురిచేస్తోంది.

బ్యారెల్ బ్రెంట్ క్రూడ్ ధర 1.13 శాతం పెరిగి 97 డాలర్ల వద్ద ఉండగా, యూఎస్ డబ్ల్యూటీఐ క్రూడ్ 1శాతానికి పైగా పెరిగి 99.24 డాలర్లకు చేరింది. ఈ పరిణామాలపై ఆర్బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా స్పందిస్తూ, విదేశీ మారక ద్రవ్య మార్కెట్‌లో అస్థిరతను అరికట్టేందుకే బ్యాంకులపై ఈ ఆంక్షలు విధించామని, ఇవి తాత్కాలిక చర్యలు మాత్రమేనని స్పష్టం చేశారు. బ్యాంకులు చేస్తున్న ఆర్బిట్రేజ్ ట్రేడ్‌ల వల్లే ఇటీవలి కాలంలో మార్కెట్‌లో ఒడిదొడుకులు పెరిగాయని ఆర్బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా పేర్కొన్నారు.

# లాభాల్లో ముగిసిన సెన్సెక్స్, నిఫ్టీ

**ముంబయి, ఏప్రిల్ 10:** గ్లోబల్ మార్కెట్లలో ర్యాలీ, కాల్పుల విరమణపై సందిగ్ధత తొలగడం, చమురు ధరలు దిగిరావడం వంటి పరిణామాలతో దేశీయ స్టాక్ మార్కెట్లు వారాంతంలో లాభాలబాట పట్టాయి. బిఎస్‌ఇ సెన్సెక్స్ 918.80పాయింట్లు పెరిగి 77,550.25 పాయింట్ల వద్దకు చేరింది. నిఫ్టీ 50 సూచీ కూడా 275.50 పాయింట్లుపెరిగి 24,050.60 పాయింట్ల వద్ద ట్రేడింగ్ నిలిపివేసింది. ఐసిఐసిఐబ్యాంకు 3.22, హెచ్‌డిఎఫ్‌సి బ్యాంకు 1.65శాతం, రిలయన్స్ ఇండస్ట్రీస్ 1.56శాతం చొప్పున పెరిగి ఈక్విటీలకు మద్దతిచ్చాయి. బిఎస్‌ఇలో మిడ్‌క్యాప్ సూచీ కూడా 1.71శాతం, స్మాల్‌క్యాప్‌సూచీ 1.60శాం చొప్పున పెరిగాయి. బిఎస్‌ఇలో 3360 షేర్లు పెరిగితే 945 షేర్లుతిరోగమించాయి. 151 షేర్లు మాత్రం నిలకడగానే కొనసాగాయి. విదేశీ కరెన్సీ మార్కెట్‌లో డాలరుతో రూపాయి మారకం విలువలు 92.69వద్ద కొనసాగింది. ముందు రోజు 92.51తో పోలిస్తే కొంతమేర దిగజారింది. ఎంసి ఎక్స్‌లో పసిడి ఫ్యూచర్లు జూన్ సెటిల్‌మెంట్ నాటివి రూ.1,52,420గా ఉన్నాయి. అమెరికా పదేళ్ల బాండ్ల రాబడులు 0.05శాతంపెరిగి 4.291శాతంగా ఉన్నాయి. కమోడిటీ మార్కెట్లలో బ్రెంట్ ముడి చమురు జూన్ సెటిల్‌మెంట్లు 61సెంట్లు పెరిగి బ్యారెల్‌కు 96.53 డాలర్లుగా కొనసాగాయి. షేర్‌బైబాక్ ఉంటుందన్న అంచనాలతో విప్రో 0.96శాతం పెరిగింది.

బిఇయన్‌బ్రెయిన్స్ గ్యారేజి వెంచర్స్ గ్రో మాతృకంపెనీ 3.72 శాతం పెరిగింది. పవర్‌మెక్‌ప్రాజెక్టులు 8.49శాతం, ఐషర్‌మోటార్స్ 3.87శాతం, గోద్రెజ్‌ప్రాపర్టీస్ 1.37శాతం, ప్రెస్టిజ్ ప్రాజెక్ట్స్ 0.25 శాతం ఐఆర్‌బి ఇన్‌ఫ్రా డెవలపర్స్ 3.69శాతం, పార్క్ మెడివరల్డ్ 4.48శాతం చొప్పునపెరిగాయి. దేవ్ ఐటి 7.03శాతంపైపైకి ర్యాలీ తీసింది. వివి టెక్ వాబాగ్ కూడా 2.11అదే తీరులో ఉంది. కంటైనర్ కార్పొరేషన్ 0.41శాతం పెరిగింది. రైల్‌టెల్ కమ్యూనికేషన్ ఇండియా 1.22శాతం పెరిగింది. ఇక ఐపిఒల పరంగా ఓంపవర్ ట్రాన్స్‌మిషన్ 41,46,300 షేర్లకుగాను బిడ్లు రాబట్టింది. బిడ్లు 0.69రెట్లు కొనుగోల్లుజరిగాయి. 13వ తేదీతో బిడ్లు పూర్తివుతాయి.




ఐపిఒ ధరలు రూ.166నుంచి 175గా నిర్ణయించింది. గ్లోబల్‌మారెనకట్లు కూడా యుద్ధవాతావరణం సద్దుమణుగుతున్నదన్న ధోరణు లతో ర్యాలీ తీసాయి. యూరోప్; ఆసియా మార్కెట్లు వారాంతంలో గణనీయంగాపెరిగాయి. ఇజ్రాయెల్‌కూడా చర్చలకు సుముఖంగా ఉండటంతో ఆసియా షేర్లుమరింతపెరిగాయి. వాల్‌స్ట్రీట్‌లో కూడా షేర్లు ర్యాలీ తీసాయి. ఎస్‌అండ్‌పి 500 0.62శాతం, నాస్‌డాక్ కాంపోజిట్ 0.83శాతం, డోజౌన్స్ ఇండస్ట్రియల్ సగటు 275.88 పాయింట్లు చొప్పున పెరిగింది. అమెరికా వాణిజ్యశాఖ ద్రవ్యోల్బణం 2.8శాతంగా

## ఒక్కనెలలో రూ.32,087 కోట్లు రాక

# ఫండ్స్ పెట్టుబడుల్లో 'సిప్'లే ఎక్కువ

**ముంబయి, ఏప్రిల్ 10:** ఈ ఏడాది భారతదేశ మ్యూచువల్ ఫండ్ రంగం కొత్త రికార్డులు నమోదుచేసింది. సామాన్యులు నెలల వారీగా పెట్టుబడి పెట్టే సిప్ ఇన్ ఫ్లో మొదటిసారిగా మార్చి నెలలో రూ. 32,087 కోట్లకు చేరింది. ఫిబ్రవరితో పోలిస్తే ఇది 8 శాతం వృద్ధిని నమోదు చేసింది. గత ఏడాదితో పోలిస్తే సిప్ పెట్టుబడులు ఏకంగా 24 శాతం పెరగడం గమనార్హం. ప్రస్తుతం దేశంలో దాదాపు 9.72 కోట్ల సిప్ ఖాతాలు ఉన్నాయి.




ప్రజలు క్రమశిక్షణతో కూడిన పెట్టుబడుల వైపు మొగ్గు చూపుతున్నారని ఈధోరణి స్పష్టం చేస్తోంది. మ్యూచువల్ ఫండ్ పరిశ్రమలోని మొత్తం నిర్వహణ ఆస్తులు రూ. 73.73 లక్షల కోట్లుగా ఉన్నాయి. ఇందులో కేవలం సిప్ ద్వారా వచ్చిన ఆస్తులే రూ. 15.10 లక్షల కోట్లు (సుమారు 20.5 శాతం) ఉండటం విశేషం. మ్యూచువల్ ఫండ్ ఖాతాల సంఖ్య మార్చి నాటికి 27.39 కోట్లకు చేరింది. కేవలం ఒక్క నెలలోనే 33.63 లక్షల కొత్త ఖాతాలు ప్రారంభమయ్యాయి. ఈక్విటీ ఫండ్లలోకి పెట్టుబడులు వరుసగా 61 నెలలో కూడా పెరిగాయనేచెప్పాలి. దీర్ఘకాలికంగా సంపదను సృష్టించుకోవడానికి భారతీయులు మ్యూచువల్ ఫండ్లను విశ్వసిస్తున్నారనడానికి ఈ పెట్టుబడులే ఉదాహరణ. సిప్ పెట్టుబడులు బలంగా ఉన్నప్పటికీ ఫిబ్రవరితో పోలిస్తే ఆస్తుల విలువ కొంత తగ్గింది. రిటైల్ ఇన్వెస్టర్ల భాగస్వామ్యం మాత్రం స్థిరంగా కొనసాగుతోంది. భారత ఆర్థిక వ్యవస్థ బలంగా ఉండటం, ప్రజలు తమ ఆర్థిక లక్ష్యాల కోసం మ్యూచువల్ ఫండ్లను ఎంచుకోవడం వల్ల ఈ వృద్ధి సాధ్యమైందని నిపుణులు విశ్లేషిస్తున్నారు.




## అనుమానాస్పద లావాదేవీలకు చెక్

# గంట దాటాకే క్లియరింగ్ : ఆర్బీఐ

**ముంబయి, ఏప్రిల్ 10:** డిజిటల్ చెల్లింపులపరంగా పదివేలు లేదా అంతకంటే ఎక్కువ మొత్తం ఉన్న అకౌంట్ టు అకౌంట్ ట్రాన్స్‌ఫర్లకు ఒక గంట ఆలస్యం విధించాలని సూచించింది. ఈ వ్యవధిలో, బ్యాంకులు చెల్లింపుదారులతో అనుమానాస్పద చెల్లింపులను ధృవీకరించుకోవచ్చు, చెల్లింపుదారులు వాటిని రద్దు కూడా చేయవచ్చు. డిజిటల్ మోసాలు అంటే ప్రభుత్వ పరిగణనలోనికి వచ్చిన సైబర్‌మోసాలే గత సంవత్సరం రూ.22,930 కోట్లకు చేరాయి. రూ.10,000 పైగా లావాదేవీలు మోసాల సంఖ్యలో 45 శాతం ఉన్నప్పటికీ, విలువల మొత్తంలో 98.5శాతం వరకు ఉన్నాయి. మోసకారులు విక్టిమ్‌లను త్వరగా నిర్ణయం తీసుకోవాలని ఒత్తిడి చేస్తారు. గంట కూలింగ్ ఆఫ్ పీరియడ్ ఇచ్చి, వినియోగదారులు లావాదేవీని రద్దు చేసుకోవడానికి లేదా బ్యాంక్ సందేహాస్పదమైతే తనిఖీ చేయడానికి అవకాశం ఇస్తుంది. ఈ ఆలస్యం సమయంలో మొత్తం ప్రొవిజనల్ డెబిట్ అవుతుంది. వినియోగదారుడు రద్దు చేస్తే డబ్బు తిరిగి వస్తుంది.

వ్యక్తులు, సోల్ ప్రొప్రైటర్లు, పార్టనర్‌షిప్ ఫర్మ్‌లు చేసే అకౌంట్‌టుఅకౌంట్ ట్రాన్స్‌ఫర్‌లు మెర్చంట్ పేమెంట్లు షాపింగ్, బిల్లులు వంటివి. ఇవి ఇప్పటికే డిస్ప్యూట్ రిజల్యూషన్ ఉన్నాయి, రికరింగ్ పేమెంట్లు, చెక్కులు. తక్కువ మొత్తం లావాదేవీలు ఇప్పటిలాగే తక్షణం పూర్తవుతాయి. సీనియర్ సిటిజన్లు, డిసేబుల్డ్ వ్యక్తులు వంటి సమూహాలకు రూ.50,000 పైగా లావాదేవీలకు ట్రస్టెడ్ పర్సన్ అదనపు ఆథెంటికేషన్. సందేహాస్పద అకౌంట్లకు క్రెడిట్ లిమిట్లు. వినియోగదారులు ఒక్క క్లిక్‌తో కిల్ స్విచ్ అన్ని డిజిటల్ పేమెంట్లను ఆపేసే సదుపాయం. వినియోగదారులు కొన్ని ముఖ్యమైన లావాదేవీలు లేదా పేయీలను వైట్‌లిస్ట్ చేసుకుని ఆలస్యాన్ని దాటవేయవచ్చు. ఇది చర్చా పత్రం మాత్రమే. అన్ని వర్గాలు తమ అభిప్రాయాలు వారంరోజుల్లోపు పంపించాలని ఆర్బీఐ సూచించింది.

# తులం బంగారం 1.55 లక్షలు

**ముంబయి, ఏప్రిల్10:** బులియన్ మార్కెట్‌లో ధరలుమళ్లీ ఒక్కసారిగా పెరిగాయి వెండిధరలు కిలో ఒక్కింటికి రూ.3800 పెరిగి కిలో వెండి రూ.2.47 లక్షలుగా దేశ రాజధాని మార్కెట్లలో కొనసాగింది. అలాగే బంగారంధరలు కూడా పది గ్రాములు రూ.1.55 లక్షలకు చేరింది. ఆలిండియా సరాఫా అసోసియేషన్ వివరాలప్రకారం వెండిదరలు రూ.2.47 లక్షలుగాఉంది. ముందు రోజు రూ..2.43 లక్షలతో పోలిస్తే కొంతమేర పెరిగింద.ఇ ఇక 99.9 కేరట్ల స్వచ్ఛత కలిగిన బంగారం రూ.400 పెరిగి తులం ఒక్కింటికి రూ.1,55,300గాకొనసాగింది. అంతకు ముందు రోజు 1.55 లక్షలవరకూ వెళ్లిన సంగతి తెలిసిందే. వారంలోనే వెండిధరలు 4.2శాతం, బంగారం ధరలు 2.51శాతం చొప్పునపెరిగాయి.

ఇరాన్ వివాదంలో దౌత్యపరమైన చర్చలు సానుకూలంగా ఉంటాయన్న ధోరణులతోనే ఈ ధరల ప్రభావం ఎక్కువ ఉంది. గ్లోబల్ స్థాయిలో కూడా బంగారం ధరలు స్పాట్ మార్కెట్‌లో



11.52 డాలర్లపెరిగి ఔన్స్ ఒక్కింటికి 4777.17 డాలర్లుగా ఉంది. వెండిధరలు కూడా ఒకటిశాతం పెరిగి ఔన్స్ ఒక్కింటికి 75.91 డాలర్లుగా ఉంది. ఒకదశలో బంగారం ఔన్స్ ఒక్కింటికి 4700గా నమోదయి క్రమేపీ పెరిగింది. శాంతిడీల్ కుదిరితే ఔన్స్ ఒక్కింటికి ఐదువేల డాలర్లవరకూ పెరగవచ్చున్న అంచనాలు కూడా ఉన్నాయి. చెన్నై, హైదరాబాద్‌ల్లో వెండిధరలు 2,65,500గా కొనసాగుటుంటే ఇతరత్రా ఢిల్లీ, ముంబై, కోల్‌కత్తా, బెంగళూరుల్లో 2.60 లక్షలుగా కొనసాగింది.

## 12వేల రెట్లు పెరిగిన డిజిటల్ పేమెంట్స్



**ముంబయి, ఏప్రిల్ 10:** భారత డిజిటల్ చెల్లింపుల వ్యవస్థలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చిన యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్ (యూపీఐ) ఈనెల 11వ తేదీతో పదేళ్లు పూర్తి చేసుకుంది. ఈ దశాబ్ద కాలంలో లావాదేవీల పరిమాణంలో 12వేల రెట్లు, విలువల పరంగా నాలుగువేల రెట్లకు పైగా అసాధారణ వృద్ధిని నమోదు చేసి సరికొత్త రికార్డు సృష్టించింది. 2016-17 ఆర్థిక సంవత్సరంలో కేవలం 1.78 కోట్ల లావాదేవీలు, విలువ రూ. 6,952 కోట్లు మొదలైన యూపీఐ ప్రస్థానం2025-26 నాటికి 21,898 కోట్ల లావాదేవీలతో దాదాపు రూ. 285 లక్షల కోట్ల విలువలకు చేరింది. ముఖ్యంగా కరోనా మహమ్మారి తర్వాత డిజిటల్ చెల్లింపుల వినియోగం విపరీతంగా పెరగడంతో యూపీఐ వృద్ధి అమాంతం పెరిగింది. మర్చంట్ క్యూఆర్ కోడ్‌లు, పాయింట్ ఆఫ్ సేల్ టెర్మినల్స్ సంఖ్య కూడా భారీగా పెరిగింది. ఈఏడాది మార్చిలో యూపీఐ తన ఆల్ టైమ్ రికార్డును నమోదు చేసింది. ఆ నెలలో ఏకంగా 22.64 బిలియన్ల లావాదేవీలు జరిగాయి. యూపీఐ ప్రారంభమైనప్పటి నుంచి ఒకే నెలలో ఇన్ని లావాదేవీలు జరగడం ఇదే తొలిసారి. గతేడాది మార్చితో పోలిస్తే ఇది 24 శాతం అధికం. ప్రస్తుతం ఒక నెలలో జరుగుతున్న యూపీఐ లావాదేవీల విలువ సుమారు రూ. 28 లక్షల కోట్లుగా ఉన్నాయి.

Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.